# ది క్రైమ్ న్యూస్

Crime News

తెలుగు దినపత్రిక

శుక్రవారం, ఏప్రిల్ 24, 2026 | సంపుటి - 20 | సంచిక 219 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.


## ఉత్తరప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

### అదుపుతప్పి ముందున్న వాహనాలను ఢీకొన్న ట్రక్కు

### వాహనాలు ఢీకొనడంతో మంటలు చెలరేగి 11మంది సజీవ దహనం



లక్నో :ఉత్తర్‌ప్రదేశ్ లో ఘోర ప్రమాదం జరిగింది. ఒక ట్రక్కు అదుపుతప్పి పలు వాహనాలను ఢీకొట్టడంతో 11 మంది సజీవ దహనమయ్యారు. వివరాల మేరకు లసోడా ప్రాంతం వైపు వెళుతున్న ఓ ట్రక్కు బ్రేకులు ఫెయిల్ అవ్వడంతో అది అదుపుతప్పి ముందువెళుతున్న కారును కంటైనర్‌ను ఢీకొట్టింది. 2లో



## రెండోరోజూ కొనసాగిన ఆర్టీసీ సమ్మె

### ఎక్కడిక్కడే నిలిచిపోయిన బస్సులు

### బలవంతంగా నడడిపేందుకు యత్నలు

### పలుచోట్ల కార్మికులను అదుపులోకి తీసుకున్న పోలీసులు



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రెండో రోజు ఆర్టీసీ కార్మికుల సమ్మె గురువారం కూడా కొనసాగింది. ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితం కావ డంతో ప్రయాణికులు నానా యాతన పడుతున్నారు. తమ న్యాయమైన హక్కుల కోసం ఉద్యమిస్తున్న ఆర్టీసీ కార్మికులపై కాంగ్రెస్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నది. 2లో

### బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో

# భాజపాదే విజయం

### మే4న రాష్ట్రమంతా మిఠాయిలు పంచుతాం

### ప్రశాంత వాతారణంలో ఎన్నికలు జరగడం విశేషం

### నదియాలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ



కోల్‌కతా : బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా తప్పకుండా విజయం సాధిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు. మే 4న ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక రాష్ట్రమంతా మిఠాయిలు పంచుతామని పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని నదియాలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. గతంలో మనం చూసుకుంటే భారీగా ఓటింగ్ జరిగిన ప్రాంతాల్లో భాజపా ఘన విజయం సాధించింది. బెంగాల్ లో కూడా మే 4న భాజపా చరిత్ర సృష్టించనుంది. ఆ తర్వాత రాష్ట్రమంతా మిఠాయిలు పంచి వేడుక చేసుకుందాం. దాంతో పాటు ఝాల్‌ముఢీ కూడా పంచుతాం. ఈ మధ్యే నేను విన్నాను. ఝాల్ ముఢీ కొందరికి షాక్ కొట్టించింది. అది నేను తింటే మంట మాత్రం టీఎంసీకి తగిలిందని వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. అయిదు దశాబ్దా లుగా రాజకీయాల్లో ఉన్నానని, ఈ ఎన్నికల్లో మాత్రమే హింస తక్కువగా జరిగిందని పేర్కొన్నారు. ఎన్నికలు ఇంత ప్రశాంతమైన వాతావరణంలో కొనసాగడం కీలకమైన పరిణామం అన్నారు. పశ్చిబెంగాల్ లో అధికారంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్ కి ఝుల్మురి భయంకరమైన షాక్ ఇచ్చిందని ప్రధాని మోడీ అన్నారు. టిఎంసి చొరబాటు దారులకు ఆశ్రయం కల్పించడం, మహా జంగల్ రాజ్‌ను పోత్సహి స్తోందని మోడీ ఆరోపించారు. బిజెపి అధికారంలోకి వస్తే మతువా, నమశూద్ర వర్గాలకు ఆశ్రయం కల్పిస్తామని మోడీ కృష్ణానగర్లో జరిగిన ఎన్నికల ర్యాలీలో హామీనిచచ్చారు. 2లో



### నేటి నుంచి స్కూళ్లకు

## వేసవి సెలవులు

**తిరిగి జూన్ 12న పాఠశాలలు ప్రారంభం**

**ఆర్టీసీ సమ్మెతో గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి**

హైదరాబాద్ : తెలంగాణలోని పాఠశాల విద్యార్థులకు వేసవి సెలవుల సందడి మొదలైంది. పెరుగుతున్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. గురువారం 23తో ప్రస్తుత విద్యా సంవత్సరం అధికారికంగా ముగిసింది. శుక్రవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వేసవి విరామం ప్రారంభం కానుంది. ప్రభుత్వ క్యాలెండర్ ప్రకారం, ఏప్రిల్ 24నుంచి జూన్ 11 వరకు 2లో

## బెంగాల్లో ఇక అధికారం బిజెపిదే



### చొరబాట్లను పూర్తిగా నిరోధిస్తాం

### ఎన్నికల ప్రచారంలో అమిత్‌షా కీలక వ్యాఖ్యలు

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లో ఈసారి అధికారం భాజపాదేనని కేంద్ర హోంమంత్రి అమిత్ షా విశ్వాసం వ్యక్తం చేశారు. తొలి విడత పోలింగ్ ముగుస్తున్న తరుణంలో బెంగాల్‌లో తాము పూర్తి మెజార్టీతో ప్రభుత్వం ఏర్పాటు చేయబోతున్నామని వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వం రాగానే చొరబాట్లను 2లో

### కాళేశ్వరం పేరుతో తెలంగాణ

## సొమ్ము నాశనం



### హైకోర్టు తీర్పుపై ఎందుకు సంబరాలు చేస్తున్నారు

### త్వరలోనే సంరాల రాంబాబులను లోపలేయడం ఖాయం

### మీడియా సమావేశంలో ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి

2లో



### రెండు రాష్ట్రాల్లో

## ముగిసిన పోలింగ్

### ప్రశాంతంగా ముగిసిన ఓటింగ్

### భారీగా పోలింగ్ శాతం నమోదు

న్యూఢిల్లీ : దేశంలో కీలక రాష్ట్రాలైన్ర తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికల తొలి దశ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ కేంద్రాల వద్ద సాయంత్రం 6 గంటల వరకు క్యూలో ఉన్న ఓటర్లకు ఓటు వేసే అవకాశం కల్పించారు. ఈ దశలో రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదు కావడం విశేషంగా మారింది. రెండు రాష్ట్రాల్లోనూ రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదైంది. ఈ సాయంత్రం 5గంటల వరకు తమిళనాడులో 82.24శాతం పోలింగ్ నమోదు కాగా 2లో



### 2029 నుంచే

## మహిళా బిల్లు

### అమలుకు ప్రధాని మోడీ చర్యలు

### అడ్డుకున్న విపక్షాలను మహిళలు నిలదీయాలి

### కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ

విజయవాడ : మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ను 2029 ఎన్నికల నుంచే అమలు చేసేలా ఎన్డీఏ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. 25 ఏళ్లుగా ఈ బిల్లును అడ్డుకున్న విపక్షాలు మరోసారి ఆటంకపరుస్తున్నాయని మండిపడ్డారు. ఈ మేరకు మహిళా రిజర్వేషన్ బిల్లుపై కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధానిగా నరేంద్ర మోదీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కార్యక్రమాల్లో 'నారీ శక్తి వందన్ అధినియం' ఒకటని అన్నారు. విజయవాడలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. మహిళలకు చట్టసభల్లో సముచిత ప్రాతినిధ్యం కల్పించాలనే ఉద్దేశంతో ఈ చట్టాన్ని ముందుకు తీసుకొచ్చామని చెప్పారు. తరువాయి 2లో

## హంతకుల్ని తయారు చేసే ఫ్యాక్టరీ వైసీపీ

### మంత్రి సవిత సంచలన వ్యాఖ్యలు



అమరావతి : సమాజం కోసం మంచి చేసే నాయకుల్ని తయారు చేసే ఫ్యాక్టరీ తెలుగుదేశం అయితే హంతకుల్ని తయారు చేసే ఫ్యాక్టరీ వైసీపీ అంటూ మంత్రి సవిత వ్యాఖ్యానించారు. హత్యలు చేయటం, సాక్షుల్ని బెదిరించటం, రేటు మాట్లాడటం, కుటుంబసభ్యులను, జడ్జిలను కూడా బెదిరించాలని చూడటం జగన్‌కు అలవాటు అంటూ మండిపడ్డారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. జగన్ తరహాలోనే వైసీపీ నాయకులు శవరాజకీయాలు చేస్తున్నారని విరుచుకుపడ్డారు.


# గ్రీన్ ఎనర్జీతోనే ఏపీకి భవిష్యత్తు

### మరో రంగారెడ్డి కానున్న అనకాపల్లి

### పరిశ్రమల రాకతో మెండుగా ఉద్యోగావకాశాలు

### ఉపాధి కోసం హైదరాబాద్ వెళ్లాల్సిన పనిలేదు

### రెన్యూ ఎనర్జీ ప్లాంట్‌కు శంకుస్థాపనలో సిఎం చంద్రబాబు



అనకాపల్లి : విశాఖకు ఎక్కువ పరిశ్రమలు వస్తున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ఇక్కడ పరిశ్రమలో ఈ ప్రాంతం అభివృద్ధికి అవకాశాలు పెరిగాయని, నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు వస్తున్నాయని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. గురువారం అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో పర్యటించిన సీఎం.. రెన్యూ ఎనర్జీ ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. గ్రీన్ ఎనర్జీతోనే ఏపీకి భవిష్యత్తు అని స్పష్టం చేశారు. ఆర్టీసీ బస్సులను ఎలక్ట్రిక్ బస్సులుగా మారుస్తామని.. అన్ని బస్సులను ఏసీ బస్సులుగా మారుస్తామని చెప్పారు. అనకాపల్లిని మరో రంగారెడ్డి జిల్లా చేస్తామని అన్నారు. ఈ జిల్లాను అదృష్టం వరించిందని.. భారీగా పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. దేశంలోనే అనకాపల్లి నంబర్‌వన్ అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. 2లో

# రెండోరోజూ కొనసాగిన ఆర్టీసీ సమ్మె

పోలీసుల పహారాలో బస్సుకు ఒక కానిస్టేబుల్‌ను పెట్టి బలవంతంగా బస్సులను నడుపాలని చూస్తున్నది. అయినప్పటికీ ఆర్టీసీ కార్మికులు తెల్లవారుజాము నుంచే బస్సుల వద్దకు చేరి ఒక్క బస్సును కూడా కదలనీయలేదు. పోలీసులు బలవంతంగా ఆర్టీసీ కార్మికులను అరెస్ట్ చేసినా ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు. బస్సులు లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్న ప్రజలను ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణికులు అధిక ధరలు చెల్లించ ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. మెదక్ ఆర్టీసీ డిపో నుంచి ఈరోజు తెల్లవారుజామున బస్సులు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు ప్రయత్నం చేయగా కార్మికులు అడ్డుకోవడంతో పోలీసులు వారిని అరెస్టు చేశారు. గురువారం తెల్లవారుజామున ఆర్టీసీ అధికారులు పోలీసు బందోబస్తు మధ్య బస్సులు నడిపేందుకు డిపో నుంచి బస్టాండ్ వరకు బస్సులు తీసుకురాగా కార్మికులు సమాచారం తెలుసుకొని భారీ సంఖ్యలో చేరుకొని అడ్డుకున్నారు. ఆర్టీసీ బస్సులను అడ్డుకోవడంతో పోలీసులు కార్మికులను బలవంతంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 9డిపోల్లో 600 వందల బస్సులు నిలిచి పోయాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా సమ్మె కొనసాగుతున్నది. కామరెడ్డి జిల్లాలో ఆర్టీసీ కార్మికుల టెంట్‌ను పోలీసులు తొలగించడంతో వివాదం చోటు చేసుకుంది. ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా రెండో రోజు బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. సిద్దిపేట జిల్లాలోని సిద్దిపేట, హుస్నాబాద్, దుబ్బాక, గజ్వేల్ డిపోల ఎదుట ఆర్టీసీ కార్మికులు డిపోల ఎదుట ధర్నా చేపట్టారు. నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో బస్సులు నడుపాలని చూడగా ఆర్టీసీ కార్మికులు అడ్డుకున్నారు. మహబూబా బాద్ జిల్లాలో ఆర్టీసీ కార్మికులపై పోలీసుల అత్యుత్సాహం ప్రదర్శించారు. రెండో రోజు సమ్మె కొనసాగు తుండగా తొర్రూరు డిపో వద్ద భారీగా పోలీసు బలగాలను మోహరించారు. విధులకు రాని 21 మంది కార్మికులపై కేసు నమోదు చేశారు. సమ్మెలో పాల్గొనేందుకు డిపో వద్దకు వస్తున్న కార్మికులను పోలీసులు అరెస్టు చేశారు. ఆర్టీసీ ఉద్యోగులను అరెస్ట్ చేసి కేసులు నమోదు చేయడంపై ఉద్యోగ సంఘాల నేతలు మండిపడుతున్నారు. తక్షణమే వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## ఉత్తరప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

ఈ క్రమంలో కంటైనర్ దానిముందు ప్రయాణికులతో వెళుతున్న ఓ బొలేరును ఢీకొట్టడంతో మంటలు చెలరేగాయి. దీంతో బొలేరోలోని 11 మంది ప్రయాణికులు మంటల్లో చిక్కుకొని సజీవదహనం అయ్యారు. ఈ ప్రమాదానికి కారణమైన ట్రక్కు డ్రైవర్ కూడా తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక దళాలు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలను అదుపులోకి తీసుకొచ్చి.. డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. మృతుల వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయని, ఈ ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తును కూడా ప్రారంభించినట్లు తెలిపారు. ప్రమాదం నేపథ్యంలో ఈ ప్రాంతంలో వాహనాల రాకపోకలకు ఆటంకం కలగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

## బెంగాల్లో ఇక అధికారం బిజెపిదే

పూర్తిగా కట్టడి చేస్తామని అన్నారు. ఇంతకాలం మమతా బెనర్జీ చొనబాట్లను ప్రోత్సహిస్తూ దేశ బవిష్యత్‌కు సవాల్ విసిరారని మండిపడ్డారు. హుగ్లీ జిల్లాలోని బాలాగఢ్‌లో ఏర్పాటు చేసిన రెండో విడత ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. మే 5న దీదీ ఆట ముగుస్తుంది. భాజపా ప్రభుత్వం పూర్తి మెజార్టీతో ఏర్పాటవుతుంది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ, భద్రతకు చొరబాటుదారులు హాని కలిగిస్తున్నారు. బెంగాల్ యువత ఉద్యోగాలు, పేదల రేషన్‌ను దోపిడీ చేయడంతో పాటు దేశ భద్రతను దెబ్బతీసేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఏప్రిల్ 29న (రెండో విడత ఎన్నికల్లో) కమలం గుర్తుపై ఓటేయండి. ఇది మీరు కేవలం ఎవరో ఒకరిని ఎమ్మెల్యేని చేసేందుకో, భాజపా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికో కాదు.. చొరబాటుదారుల నుంచి బెంగాల్‌కు విముక్తి కల్పించడానికి. ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక బెంగాల్‌లోకి ఎవరూ చొరబడలేరు. ఇప్పటికే అక్రమ వలసదారులను భాజపా బయటకు పంపిస్తోందని అన్నారు. మరోవైపు, బెంగాల్‌లో జరుగుతున్న తొలి విడత ఎన్నికల్లో భారీగా పోలింగ్ నమోదైంది. మధ్యాహ్నం 3గంటల సమయానికి 78.77శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. మొత్తం 16 జిల్లాల పరిధిలోని 152 నియోజకవర్గాల్లో ఈ రోజు ఉదయం 7గంటలకు పోలింగ్ మొదలైన విషయం తెలిసిందే. చివరి వార్తలు అందేసరికి బెంగాల్లో 79శాతం ఓటింగ్ నమోదైనట్లు తెలుస్తోంది.

## మూడోరోజు సింగపూర్‌లో మంత్రుల పర్యటన

### ప్రతిష్టాత్మకమైన పీఎస్ఏను సందర్శించిన బృందం

అమరావతి,ఏప్రిల్23 : ఆంధ్రప్రదేశ్ మంత్రుల బృందం సింగపూర్‌లో మూడో రోజు గురువారం పర్యటిస్తోంది. ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన పీఎస్ఏను సందర్శించింది. పోర్టు నిర్వహణలో అత్యాధునిక సాంకేతికతను ఏ విధంగా వినియోగిస్తున్నారో మంత్రులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సింగపూర్‌లోని ఖాం ఆధ్వర్యంలో నడుస్తున్న టువాస్ (÷ుజం÷ూ) పోర్ట్.. 2040 నాటికి ప్రపంచంలోనే అతిపెద్ద ఆటోమేటెడ్ టెర్మినల్‌గా రికార్డు సృష్టించబోతోంది. ఈ పోర్టులో అమలవుతున్న వినూత్న పద్ధతులను మంత్రుల బృందం ప్రత్యేకంగా అధ్యయనం చేసింది. పోర్టులో కంటైనర్లను ఒక చోటు నుంచి మరొక చోటికి తరలించడానికి ఉపయోగిస్తున్న డ్రైవర్ లేని ఎలక్ట్రిక్ వాహనాల పనితీరును చూసి మంత్రులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. భారీ క్రేన్లను ఆపరేటర్లు నేరుగా కాకుండా.. రిమోట్ కంట్రోల్ ద్వారా నియంత్రించే విధానాన్ని పరిశీలించారు. షిప్పింగ్, లాజిస్టిక్స్ రంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, స్మార్ట్ వ్యవస్థల ద్వారా కార్యకలాపాలను ఎలా వేగవంతం చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఈ అధ్యయన పర్యటనలో రాష్ట్ర మంత్రులు నారాయణ, బి.సి. జనార్దన్ రెడ్డి, అచ్చెన్నాయుడు, వంగలపూడి అనిత, సత్యకుమార్ యాదవ్, అనగాని సత్యప్రసాద్ పాల్గొన్నారు.

## హంతకుల్ని తయారు చేసే ఫ్యాక్టరీ వైసీపీ

తండ్రి శవం పెట్టుకుని రాజకీయం చేయటం, బాబాయ్ గొడ్డలి పోటు ఘటనలను ఇప్పటికే చూశామని మంత్రి తెలిపారు. చంపటం, రౌడీలను, గూండాలను తయారు చేయటమే వైసీపీ పనిగా పెట్టుకుందన్నారు మంత్రి. అనంత బాబును జగన్ నెత్తిన పెట్టుకోవటంతోనే దళితుడైన సుబ్రహ్మణ్యంను హత్య చేసి డోర్ డెలివరీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ సైకో తనానికి పరాకాష్టగా అనంత బాబు వ్యవహారం ఉందన్నారు. సుబ్రహ్మణ్యం హత్య కేసు నిందితులను ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రభుత్వం వదలదని స్పష్టం చేశారు. గతంలో ఏమరపాటు ఉండి ఉండొచ్చేమో కానీ ఇప్పుడు ప్రభుత్వం పూర్తి అప్రమత్తతో ఉందన్నారు. జగన్ వల్ల బలయ్యేవారిలో బీసీలు, దళితులే ఎక్కువ మంది ఉన్నారని మంత్రి సవిత పేర్కొన్నారు.



# బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపాదే విజయం

ఈ ర్యాలీలో మోడీ ప్రసంగించారు. 'మీరు బిజెపి- ఎన్డిఎ విజయ పతాకాన్ని ఎగురవేయాలి. మే 4న బెంగాల్లో బిజెపి విజయోత్సవాలు జరుగుతాయి. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేస్తారు. ఝల్మురిని కూడా అందజేస్తారు. ఝల్మురి కొంతమందికి పిడుగులాంటి షాక్ ఇచ్చింది. నేను ఝల్మురి తిన్నాను. కానీ ఆ ఝల్ (మసాలా) టిఎంసిని తాకింది' అని అన్నారు. బెంగాల్ ప్రజలు టిఎంసి పాలనను వ్యతిరేకిస్తున్నారు. 15 ఏళ్ల క్రితం కమ్యూనిస్టులను వ్యతిరేకించారు. ఇప్పుడు టిఎంసి జంగిల్ రాజ్ కి వ్యతిరేకంగా నిలబడ్డారు. దీనికి అణచివేతదారులు, అవినీతిపరులే జవాబుదారీగా ఉంటారు. మా మంత్రం సబ్కా సాథ్, సబ్కా వికాస్ అని మీకు తెలుసు. మే 4వ తేదీ తర్వాత పశ్చిమ బెంగాల్లో సుపరిపాలనకు కొత్త హామీ ప్రారంభం కానుందని అన్నారు. మతువా సమాజం, నమశ్రూద సమాజం, శరణార్థి కుటుంబాలు టిఎంసికి భయపడాల్సిన పనిలేదు. మీకు ఎవరు హానీ చేయలేరు. ఆశ్రయం, గౌరవం కోరుతూ భారతదేశానికి వచ్చిన వారందరికీ తాను అండగా నిలుస్తారని మోడీ హామీనిచ్చారు. బెంగాల్లో ఏర్పడే బిజెపి ప్రభుత్వం సిఎఎ కింద పౌరసత్వం మంజూరు చేసే ప్రక్రియను వేగవంతం చేస్తోందని మోడీ అన్నారు. దేశంలోని ప్రతి భారత పౌరుడికి దక్కాల్సిన ప్రతి హక్కు, ప్రయోజనం మీకు లభిస్తుందని మోడీ హామీనిచ్చారు. నేడు బెంగాల్లో మొదటి దశ ఎన్నికలు జరుగుతున్నాయి. నేడు తమిళనాడులో కూడా జరుగుతున్నాయి. ఓటర్లందరికీ శుభాకాంక్షలు. ఈసారి ప్రతి ఒక్కరూ కొత్త ఓటింగ్ రికార్డులు సృష్టించాలని మోడీ ఓటర్లను కోరారు. బెంగాల్ లో గత 50 ఏళ్లలో హింసను కనిష్ట స్థాయికి పరిమితం చేసిన మొదటి ఎన్నిక ఇదే అని మోడీ చెప్పారు. లేకపోతే, ఇక్కడ ప్రతి వారం ఎవరో ఒకరిని ఉరితీయడం, దానిని ఆ తర్వాత ఆత్మహత్యగా చిత్రీకరించడం చేసేవారు. ఒకరకమైన గూండాల పాలన ప్రబలింది. ప్రజాస్వామ్య స్ఫూర్తిని మరోసారి నిలబెట్టినందుకు ఎన్నికల సంఘానికి తాను హృదయపూర్వక అభినందలు తెలిపారు.

## రెండు రాష్ట్రాల్లో ముగిసిన పోలింగ్

పశ్చిమ బెంగాల్ తొలి విడత ఎన్నికల్లో 89.93శాతం నమోదైనట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. చెన్నైలో 81.34శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. అలాగే, బెంగాల్‌లోని దక్షిణ్ దినాజ్‌పుర్‌లో అత్యధికంగా 93.12శాతం పోలింగ్ నమోదైనట్లు వెల్లడించారు. సాయంత్రం 6గంటలతో పోలింగ్ సమయం ముగియగా.. ఇప్పటికే క్యూలైన్లలో ఉన్న వారికి ఓటు వేసేందుకు అనుమతించారు. ప్రజలు భారీ సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తాజా సమాచారం ప్రకారం, తమిళనాడులో సాయంత్రం 5 గంటల వరకు 82.24 శాతం పోలింగ్ నమోదైంది. అదే సమయంలో పశ్చిమ బెంగాల్‌లో 89.93 శాతం పోలింగ్ నమోదు కావడం గమనార్హం. మొత్తం 294 స్థానాలు ఉండగా తొలి విడతలో 152 సీట్లకు ఎన్నికలు జరిగాయి. తమిళనాడులోని మొత్తం 234 అసెంబ్లీ స్థానాలకు ఒకే దశలో పోలింగ్ జరిగింది. ఎన్నికల అధికారులు పోలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించారు. రెండు రాష్ట్రాల్లోని ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన మే 4 సోమవారం వెల్లడిస్తారు. ఆయా రాష్ట్రాల్లో నమోదైన పోలింగ్ శాతాన్ని ఖచ్చితంగా ఇసి వెల్లడించనుంది. తమిళనాట మొత్తం 234 స్థానాలు, పశ్చిమ బెంగాల్‌లో తొలివిడతలో భాగంగా 152 స్థానాలకు పోలింగ్ జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ ఉదయం 7గంటలకే ప్రారంభమైన పోలింగ్ ప్రారంభం కాగా.. ఎండను సైతం లెక్క చేయకుండా భారీ సంఖ్యలో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. తొలి గంటల్లోనే పలువురు ప్రముఖులు పోలింగ్ కేంద్రాలకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## కాళేశ్వరం పేరుతో తెలంగాణ సొమ్ము నాశనం

హైదరాబాద్ : కాళేశ్వరం అంశంలో హైకోర్టు తీర్పుపై మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు ఎందుకు సంబరాలు చేసుకుంటున్నారని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రశ్నించారు. త్వరలోనే సంబరాల రాంబాబులను లోపలేస్తామని హెచ్చరించారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ... కేటీఆర్, హరీశ్.. ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. హైకోర్టు తీర్పుపై బీఆర్ఎస్ నాయకులు అబద్దాలు చెబుతున్నారన్నారు. కాళేశ్వరం కేసులో హైకోర్టు ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదని ఎంపీ తెలిపారు. కాళేశ్వరంలో దోపిడీ చేసిన వాళ్లను వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. తన సొంత బ్రాండ్ కోసమే కేసీఆర్ కాళేశ్వరం కట్టారని.. తెలంగాణ సొమ్మును నాశనం చేశారని ఆరోపించారు. బ్రాండ్ కోసమే కేసీఆర్ తట్టెడు అబద్దాలు, పిట్ట కథలు చెప్పారని మండిపడ్డారు. రెండు సంవత్సరాలకే కాళేశ్వరం ఎందుకు కుంగిపోయిందని ఎంపీ ప్రశ్నించారు. '24 గంటల్లో సినిమా చూపిస్తామన్న బీజేపీ ఎక్కడికి పోయిందన్నారు. సీబీఐ విచారణ ఎందుకు ఆలస్యం అవుతోందన్నారు. బీజేపీ నాయకులు వెంటనే సీబీఐతో విచారణ చేయించండని డిమాండ్ చేశారు. మానిపోయిన గాయానికి మళ్లీ మందు పెట్టేందుకు కేసీఆర్ బయటకు వచ్చారని వ్యాఖ్యానించారు. సెంటిమెంట్ డైలాగులతో ప్రజలను మళ్లీ మోసం చేస్తున్నారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో మేడిగడ్డ గుండెకాయ అన్నారని.. మేడిగడ్డ కుంగిపోయాక కాళేశ్వరం కూలిపోయినట్టే కదా అని ఎంపీ అడిగారు. మేడిగడ్డలో నీళ్లు నింపితే ప్రమాదమని ఎన్‌డీఎస్ఏ చెప్పిందన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే కాళేశ్వరం కూలిపోయిందన్నారు. నాణ్యత పాటించకుండా ప్రాజెక్ట్ కట్టి.. కూలిపోగానే కాంగ్రెస్‌పై కేసులు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషన్ ఏర్పాటును కోర్టు తప్పు పట్టలేదని తెలిపారు. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా విచారణకు రమ్మన్న అంశంపై మాత్రమే కోర్టు అభ్యంతరం తెలిపిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు అప్పు పుట్టకపోతే కార్పొరేషన్ ఏర్పాటు చేసి అప్పు తెచ్చారని చామల కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## గ్రీన్ ఎనర్జీతోనే ఏపీకి భవిష్యత్తు

భారీ పెట్టుబడులతో అనకాపల్లి జిల్లా అదరగొడుతోందని, దేశంలోనే నంబర్ వన్ జిల్లాగా తయారవుతుందని తెలిపారు. రాంబిల్లిలో రూ.5,400 కోట్ల పెట్టుబడితో రెన్యువబుల్ ఎనర్జీ సంస్థ నిర్మిస్తున్న క్లీన్ ఎనర్జీ ప్లాంట్‌కు సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఇటీవలే రూ.1.36 లక్షల కోట్లతో ఆర్సెలర్ మిత్తల్ స్టీల్ కంపెనీకి శంకుస్థాపన చేసినట్లు గుర్తుచేశారు. క్లీన్ ఎనర్జీ ప్లాంట్ ప్రాజెక్టు ద్వారా 2,100 మందికి ప్రత్యక్ష ఉపాధి లభిస్తుంది. అత్యంత వెనుకబడిన తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా దేశంలో ధనిక జిల్లాగా మారింది. ఇప్పటికే విశాఖలో పూర్తిగా పరిశ్రమలు వచ్చాయి. ఇకపై ఏ పెట్టుబడులు వచ్చినా అనకాపల్లి జిల్లాకే వస్తాయి. అనకాపల్లిని మరో రంగారెడ్డి జిల్లాగా చేసే బాధ్యత నాది. రాష్ట్రంలో పెద్దఎత్తున అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. రాంబిల్లిలోని సోలార్ ఇన్‌ఘాట్ వేఫర్ ఉత్పత్తితో విదేశాలపై ఆధారపడే పరిస్థితి పోతుంది. ప్రధాని మోదీ ఆత్మనిర్భర్ భారత్ కలల సాకారానికి ఇదే నిదర్శనం అన్నారు. ఇటీవలే ఆర్సెలార్ స్టీల్ కంపెనీ వచ్చిందన్నారు. ఉత్తరాంధ్రకు ఎన్నో పరిశ్రమలు వస్తున్నాయని.. ఇక ఉద్యోగాల కోసం హైదరాబాద్ వెళ్లాల్సిన అవసరం ఉండదని సీఎం అన్నారు. ఉద్యోగాల కోసం ఏపీకి రావాల్సిన పరిస్థితి తీసుకొస్తామని తెలిపారు. ఏడాదిలోగా ఉత్తరాంధ్రకు గోదావరి నీళ్లు తీసుకొస్తామన్నారు. జులైలో భోగాపురం ఎయిర్‌పోర్టును ప్రారంభిస్తామని సీఎం వెల్లడించారు. వైసీపీ పాలనలో ఎక్కడ చూసినా అవినీతే జరిగిందని ముఖ్యమంత్రి ఆరోపించారు. 2019-24 మధ్య ఏపీలో విధ్వంసం జరిగిందని విమర్శించారు. విద్యుత్ రంగాన్ని వైసీపీ కుప్పకూల్చిందని మండిపడ్డారు. జగన్ పాలనలో విద్యుత్ ఛార్జీలు పెంచారని.. ఉచితంగా కరెంట్ వచ్చే సోలార్‌ను వినియోగించుకోలేదన్నారు. విద్యుత్ సంస్థలపై రూ.12 వేల కోట్ల భారం మోపారన్నారు. వైసీపీ హయాంలో పరిశ్రమలు వెనక్కిపోయాయని సీఎం అన్నారు. సొంత బాబాయ్‌నే చంపిన చిల్లర పార్టీ వైసీపీ అంటూ మండిపడ్డారు. గుండెపోటుతో వివేకా చనిపోయారని చెప్పారని.. పోస్టుమార్టం తర్వాత గొడ్డలిపోటుగా తేలిందన్నారు. వాళ్లే నేరం చేసి.. ఆ పాపాన్ని తమపై మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మనం నేరస్తులతో రాజకీయం చేస్తున్నాం' అని సీఎం వ్యాఖ్యానించారు. 'ఏపీ పునర్‌నిర్మాణం చేస్తామని చెప్పాం.. చేస్తున్నాం' అని సీఎం చంద్రబాబు తెలిపారు. ప్రజలు తమపై నమ్మకంతో అత్యధిక మెజారిటీతో గెలిపించారన్నారు. కరెంట్ ఛార్జీలు పెంచబోమని చెప్పామన్నారు. తక్కువ ఖర్చుతో కరెంట్ ఉత్పత్తి జరగాలని.. సోలార్ ఎనర్జీకి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. రైతులే కరెంట్ ఉత్పత్తి చేసుకునే పరిస్థితి రావాలని చెప్పుకొచ్చారు. రెండుమూడేళ్లలో 40 లక్షల ఇళ్లకు రూఫ్‌టాప్ కరెంట్ అందిస్తామని అన్నారు. భవిష్యత్తులో 5 వేల ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఏపీకి ఇప్పటికే రూ.5 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులు వచ్చాయని.. 22 నెలల్లో 800కి పైగా ప్రాజెక్టులు వచ్చాయని సీఎం తెలిపారు. రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 2 కిలోవాట్ల వరకు ఉచితంగా ఇస్తామని తెలిపారు. 'ప్రతి ఇంటిపై సోలార్ అమర్చుకోండి.. రాయితీ ఇస్తాం' అని ప్రకటించారు. 23 లక్షల మంది రైతులకు 9 గంటల ఉచిత విద్యుత్, 22 లక్షల మంది ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. రూ.4 వేల కోట్లకుపైగా ట్రూడౌన్ ఛార్జీల భారం తగ్గించామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. 2000లోనే విద్యుత్ రంగ సంస్కరణలు మొదలుపెట్టాం. 2019-24 మధ్య కాలంలో విద్యుత్ రంగం కుప్పకూలింది. ఉచిత సోలార్ కరెంటు వాడకుండా రూ.9వేల కోట్లు చెల్లించారు. విద్యుత్ సంస్థలపై రూ.1.12 లక్షల కోట్లు భారం మోపారు. విద్యుత్ ఛార్జీలు తొమ్మిదిసార్లు పెంచి ప్రజలపై రూ.32వేల కోట్ల భారం మోపారు. కేంద్రం 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యంగా సాగుతుంటే.. ఏపీ 160 గిగావాట్ల ఉత్పత్తి లక్ష్యంగా ముందుకెళ్తోంది. గ్రీన్ ఎనర్జీ వల్ల రూ.10 లక్షల కోట్ల మేర పెట్టుబడులు వస్తాయి. 22 నెలల వ్యవధిలో 117 ప్రాజెక్టులు క్లియర్ చేశాం. రూ.5.95 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. మొత్తం 4.76 లక్షల మందికి ఉపాధి లభిస్తుంది. ఇప్పటికే 160 గిగావాట్లలో 90 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ తయారీకి అనుమతులు మంజూరు చేశాం. గ్రీన్ ఎనర్జీలో ఎన్టీపీసీ రూ.1.85 లక్షల కోట్లు ఖర్చు పెట్టబోతోంది. వచ్చే ఏడాది ఈ పనులు కూడా ప్రారంభమవుతాయి. త్వరలో 1,050 ఎలక్ట్రిక్ బస్సులు తీసుకొస్తున్నాం. వెయ్యికిపైగా ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశాం. త్వరలో మరో 444 ఎలక్ట్రిక్ బస్సులు వస్తాయి. మూడేళ్లలో 5 వేలకుపైగా ఛార్జింగ్ స్టేషన్లు వస్తాయి. రాబోయే రోజుల్లో ఆర్టీసీ బస్సులన్నీ ఎలక్ట్రిక్‌వే వస్తాయని చంద్రబాబు అన్నారు.

## 2029 నుంచే మహిళా బిల్లు




మూడు దశాబ్దాలుగా మహిళా రిజర్వేషన్ ఉండాలని అంటూనే.. 2014కి ముందు ఉన్న ప్రభుత్వాలు దీనిని అమలు చేయకుండా సాకులు చెప్పాయని విమర్శించారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాలతో చర్చించి, అత్యధిక మెజారిటీతో మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిందన్నారు. మహిళలు పార్లమెంట్‌కు విచ్చేసి గ్యాలరీలో కూర్చుని ఎదురు చూశారని తెలిపారు. 84 ఓట్ల తేడాతో బిల్లును కాంగ్రెస్ పార్టీ దాని మిత్రపక్షాలు, ఇతర ప్రతిపక్ష పార్టీలు కలిసి ఓడించాయని ఆరోపించారు. పెద్ద ఎత్తున మహిళా సాధికారత సాధించాలనే ఉద్దేశంతో బిల్లును ప్రవేశపెట్టామని.. బిల్లును వ్యతిరేకించిన పార్టీల వైఖరిని ఎండగట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. 25 ఏళ్లుగా 33 శాతం పదవులను మహిళలకు కేటాయించిన పార్టీ బీజేపీ అని చెప్పుకొచ్చారు. దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని కొన్ని పార్టీలు ప్రచారం చేసి బిల్లును తాత్కాలికంగా ఓడించాయని కేంద్ర మంత్రి విమర్శించారు. రాబోయే రోజుల్లో ప్రధాని మోదీ నాయకత్వం లో ఎన్డీయే ప్రభుత్వం ఈ బిల్లును ముందుకు తీసుకెళుందని స్పష్టం చేశారు. లోక్‌సభ స్థానాల పెంపుతో దక్షిణాది రాష్ట్రాల వాటా పెరుగుతుందని తెలిపారు. పార్లమెంట్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇదే విషయాన్ని వెల్లడించినప్పటికీ ప్రతిపక్షాలు అబద్దాలు ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. మహిళల్లో రాజకీయ చైతన్యం రావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ నిర్ణయాల్లో మహిళలు భాగస్వామ్యం కావాలని ఆయన అభిప్రాయపడ్డారు. కొన్ని పార్టీలలో కుటుంబ సభ్యులకే ప్రాధాన్యం ఇస్తూ.. సాధారణ మహిళలకు అవకాశాలు ఇవ్వడంలేదని ఆరోపించారు. 2029 ఎన్నికల్లోనే మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు జరిగేలా ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో అందరం కలిసి నడుద్దామని భూపతిరాజు శ్రీనివాస వర్మ పిలుపునిచ్చారు. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు ఇటీవల మహిళా బిల్లును అడ్డుకున్నాయని, కానీ.. మహిళా హక్కులను అవి కాలరాయలేవని శ్రీనివాసవర్మ అన్నారు. దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగు తుందంటూ విపక్షాలు ఇటీవల పార్లమెంటులో మహిళా బిల్లును అడ్డుకోవడాన్ని ఖండించారు. రానున్న రోజుల్లో ప్రధాని మోదీ హయాంలోనే మరోసారి బిల్లును ప్రవేశపెట్టి మహిళలకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. 2029 ఎన్నికల్లోనే మహిళా రిజర్వేషన్ అమలు చేయాలనే సదుద్దేశంతో ఇటీవల బిల్లు ప్రవేశపెట్టాం. కానీ.. పాలనలో మహిళల భాగస్వామ్యాన్ని ప్రతిపక్షాలు కుట్రపూరితంగా వ్యతిరేకించాయి. ఈ పార్టీల నిజ స్వరూపాన్ని ప్రజలకు తెలియజెప్పేలా.. ముఖ్యంగా మహిళా లోకానికి తెలిసేలా దేశవ్యాప్తంగా జన ఆక్రోశ ర్యాలీలు, సభలు నిర్వహించనున్నాం. మహిళా రిజర్వేషన్ విషయంలో ఎన్డీయే కూటమికి చిత్తశుద్ధి ఉందని తెలిపారు.

## నేటి నుంచి స్కూళ్లకు వేసవి సెలవులు

సెలవులు కొనసాగుతాయి. దాదాపు 50 రోజుల సుదీర్ఘ విరామం తర్వాత, జూన్ 12న పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతాయి. సాధారణంగా ఏప్రిల్ నెలాఖరు వరకు తరగతులు నిర్వహించేవారు, కానీ ఈసారి ఎండలు తీవ్రమవుతుండటంతో విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తుగానే సెలవులు ప్రకటించారు. విద్యా సంవత్సరం చివరి రోజైన గురువారంతో తరగతులు ముగియనుండటంతో, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టరేట్ ఒక ముఖ్యమైన ఆదేశాన్ని జారీ చేసింది. అన్ని ప్రభుత్వ స్కూళ్లు, మోడల్ స్కూళ్లు , కేజీబీవీలలో 'తల్లిదండ్రుల-ఉపాధ్యాయుల సమావేశం' నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశాల్లో విద్యార్థుల ప్రగతి నివేదికలను అందజేయడమే కాకుండా.. వేసవి కాలాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలో చర్చించారు. వరుస పరీక్షల ఒత్తిడి తర్వాత విద్యార్థులకు ఈ 50 రోజుల సెలవులు గొప్ప ఉపశమనాన్ని ఇస్తాయి. అయితే ఎండలు ఎక్కువగా ఉన్నందున, పిల్లలు బయట తిరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు. మొత్తానికి సందడి, కేరింతల మధ్య పిల్లల వేసవి విడిది రేపటి నుంచే ప్రారంభం కాబోతోంది. అయితే ఆర్టీసీ సమ్మెతో గ్రామాలకు వెళ్లాలనుకున్న వారికి తీవ్రనిరాశ ఎదురయ్యింది. సమ్మెతో ఊళ్లకి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. సమ్మె ముగిస్తేనే ఎక్కడికైనా వెళ్లడానికి అవకాశం ఉంటుంది.

## తెలంగాణ భవిష్యత్ కెసిఆర్‌కే సాధ్యం

### మీడియా సమావేశంలో జీవన్ రెడ్డి

రాజన్నసిరిసిల్ల,ఏప్రిల్23 : కుట్రలు, కుతంత్రాలతో పాలన కొనసాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి తెలంగాణ భవిష్యత్‌ను కాపాడటమే కేసీఆర్ లక్ష్యమని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. సిరిసిల్ల బీఆర్ఎస్ కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జరిగిన జగిత్యాల సభ తెలంగాణ సమాజానికి దిక్సూచిగా నిలిచిందని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి పోవాలే కేసీఆర్ రావాలేనని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు యావత్ తెలంగాణ ప్రజలకు జీవధార అని వెల్లడించారు. హైకోర్టు తీర్పు రేవంత్ రెడ్డికి చెంప పెట్టు అని వివరించారు. కేసీఆర్, హరీశ్‌రావు, అధికారులను కేసులో ఇరికించాలని చేసిన కుట్రలు పటాపంచలయ్యాయని అన్నారు. ప్రతి రోజు రేవంత్ రెడ్డికి కలలో కేసీఆర్ కనపడుతున్నాడని తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, మండల పార్టీ అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, గ్రామ శాఖ అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఇంధన భద్రతపై భారత్ దృష్టి

### గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిపై ప్రణాళికలు

న్యూఢిల్లీ,ఏప్రిల్23 : ఇంధన భద్రతకు భారత్ పెద్ద పీట వేస్తోంది. సబ్సిడీలు ఇచ్చి దేశీయంగా డిమాండ్‌ను పెంచడంపై దృష్టి పెట్టింది. భవిష్యత్ ఇంధనంగా రూపొందనున్న హరిత హైడ్రోజన్ రంగంపై పట్టు సాధించేందుకు చైనా, భారత్‌లు చాలా వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నాయి. పెద్ద ఎత్తున గ్రీన్ హైడ్రోజన్ అంటే పునర్వినియోగ ఇంధనాన్ని ఉపయోగించడం ద్వారా నీటి ఎలక్ట్రాలసిస్ ద్వారా ఉత్పత్తయ్యే హైడ్రోజన్ ఉత్పత్తి సామర్ధ్యాన్ని నిర్మించుకునేందుకు ఇరు దేశాలు పెద్ద మొత్తంలో నిధులను ఖర్చు చేస్తున్నాయి. అయితే పారిశ్రామిక ఆధిపత్యాన్ని నిలుపుకోవడంపై చైనా దృష్టి కేంద్రీకరించగా, పశ్చిమ దేశాల్లో ఈ రంగంలో కొంత స్తబ్దత నెలకొన్న నేపథ్యంలో ఇరు దేశాలు ఈ రంగంలో తమ మార్కెట్‌ను పెంచుకోవడానికి చూస్తున్నాయి. ఇందుకు అవసరమైన రాజకీయ సంకల్పం, ఆర్థిక తోడ్పాటు సమకూర్చుకుంటున్నాయి. వాతావరణ కాలుష్యానికి ఇతోధికంగా దోహదపడుతున్న బొగ్గుకు దూరంగా వెళ్లాలని చైనా ప్రయత్నిస్తోంది. ఇందుకోసం 200కోట్ల డాలర్ల ప్రాజెక్టులో భాగమైంది. భారత్ దాదాపుగా 210కోట్ల డాలర్ల విలువ చేసే సబ్సిడీల తోడ్పాటుతో 2030కల్లా ఏటా 50లక్షల మెట్రిక్ టన్నుల హరిత హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇది ప్రస్తుత గ్లోబల్ మార్కెట్‌కు ఐదు రెట్లు ఎక్కువగా వుంది. అప్పటికి చైనా ఉత్పత్తికి దాదాపుగా రెట్టింపని అంచనా వేస్తున్నారు. హించిన దానికన్నా మరింత అధికంగా వ్యయ పరిమితులు నెలకొంటూ వుండడంతో ఈ దశాబ్దం ప్రారంభంలో పెట్టుకున్న గ్రీన్ హైడ్రోజన్ లక్ష్యాలకు దూరంగా పశ్చిమ దేశాలు వెనక్కి మళ్ళుతున్నాయి. అదే సమయంలో ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన చైనా, భారత్‌లు పెద్ద ఎత్తున ఉత్పత్తికి నడుం బిగించాయి. ఈ రంగంలో రెండు దేశాల లక్ష్యాలు వేర్వేరైనా ఇరు దేశాలకు ఉమ్మడిగా వున్నది రాజకీయ సంకల్పం, అధికారం. పెద్ద ఎత్తున తయారుచేయడం ద్వారా వ్యయం తగ్గేలా, డిమాండ్ పెరిగేలా మార్కెట్‌ను ఉనికిలోకి తీసుకురావడంపై దృష్టి పెట్టాయి. ర్గి÷నైరీలు, ఎరువుల ప్లాంట్లు, ఉక్కు తయారీ సంస్థల నుండి హామీలకు సబ్సిడీలను ముడిపెడుతూ ప్రైవేటు పెట్టుబడులను భారత్ రాబడుతోంది. ఇక్కడ ఇంధన భద్రత వుండాలనే భారత్ లక్ష్యం చాలా స్పష్టంగా వుంది. భారత్‌లో హైడ్రోజన్‌ను ప్రధానంగా దిగుమతి చేసుకున్న ఖనిజవాయువు నుండి తయారుచేస్తారు. అయితే పశ్చిమాసియాలో తాజా పరిణామాలతో నేచురల్ గ్యాస్ సరఫరా ఇబ్బందుల్లో పడింది. మరోవైపు చైనా ప్రభుత్వ రంగంలోని దిగ్గజాలను లేదా ప్రైవేటు సంస్థలను రంగంలోకి దింపడం ద్వారా పెద్ద ఎత్తున పారిశ్రామిక ప్రాజెక్టులకు సిద్ధమవుతోంది. పరిశుద్ధమైన ఇంధనం దిశగా మళ్ళాలని యావత్ పారిశ్రామిక రంగం అడుగులు వేసే తరుణంలో హైడ్రోజన్ ఉత్పత్తిలో తన ఆధిపత్యాన్ని పరిరక్షించుకోవాలని చైనా లక్ష్యంగా పెట్టుకుంది.

## యువ టెక్ మేధస్సుల కోసం 'టినీ టెక్కీస్-2కే26' టెక్నో స్కిల్స్ బూట్‌క్యాంప్



కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 23(ది క్రైమ్ న్యూస్)సాంకేతిక రంగంలో మారుతున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దే లక్ష్యంతో రోహేలాస్ టెక్ ఐటీ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో 'టినీ టెక్కీస్-2ఖ26' పేరుతో ప్రత్యేక టెక్నో స్కిల్స్ బూట్‌క్యాంప్‌ను నిర్వహిస్తున్నారు. 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఈ కార్యక్రమం ద్వారా టెక్నాలజీపై అవగాహన కల్పించనున్నారు. యువతలోని టెక్ మేధస్సుకు పదును పెట్టి, వారిని భవిష్యత్తు సవాళ్లకు సిద్ధం చేయడం ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి విచ్చేసిన అతిథులకు వివిధ రంగాలకు చెందిన నిపుణులైన వక్తలకు రోహేలాస్ టెక్ యాజమాన్యం ఘన స్వాగతం పలికింది. విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించడం. 6వ తరగతి నుండి 10వ తరగతి విద్యార్థులు, రోహేలాస్ టెక్ ఐటీ సొల్యూషన్స్ సాంకేతిక పట్ల ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

## అసంపూర్తి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలి: ఎమ్మెల్యే కవ్వంపల్లి



తిమ్మాపూర్, ఎప్రిల్ 23(ది క్రైం న్యూస్):కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్.ఎం.డీలోని క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్ శాఖ అధికారులతో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ గురువారం సమీక్ష నిర్వహించారు. ఆరు మండలాల్లో అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయించేందుకు సత్వరమే చర్యలు తీసుకోవాలని, పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. అసంపూర్తిగా ఉండటంతో ఇబ్బందులు తలెత్తి ప్రజల్లో అపోహలకు ఆస్కారం కలిగించినట్టు అవుతుందన్నారు. అందుకే పనులను సత్వరమే పూర్తి చేయించాల్సిన బాధ్యత ఇంజనీరింగ్ అధికారులదేనని,ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని కొత్త పనులకు సంబంధించి అంచనాలతో కూడిన ప్రణాళికలు తయారు చేయాలని ఆయన కోరతూ గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఎదురైతే తన దృష్టికి తీసుకు రావాలని ఎమ్మెల్యే సూచించారు. ఆర్డీఓ శ్రీనివాస్, పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజినీర్ బి.గిరీష్ బాబు, కార్యనిర్వాహక ఇంజినీర్ ఎం.ఏ రహమాన్, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్లు ఎం.వెంకటాచార్యులు, ఎస్.మంజులభార్గవి, పి.శ్రీనివాస్,కె.రవిప్రసాద్, ఏఈఈలు బి.సింధుజా, ఏ.రాజేష్, ఏఈలు కె.తిరుపతిరెడ్డి, జి.మల్లేశం, ఎం.ప్రవీణ్, కె.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## 8మంది పేకాట రాయుళ్లపై కేసు నమోదు....



ఇల్లంతకుంట ఎప్రిల్ 23(ది క్రైం. న్యూస్): రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం తాళ్లపల్లిలో గురువారం పేకాట ఆడుతున్న 8మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సిరిసిల్ల అశోక్ తెలిపారు. గ్రామ శివారులో పేకాట ఆడుతున్న చిన్నకోడూరు మండలం కిష్టాపూర్ కు చెందిన సింగోజి రాజు, బెజ్జంకి మండలం కల్లేపల్లికి చెందిన అన్నాను శ్రీనివాస్, రేపాకకు చెందిన మీసాల బాబు, తాళ్ళల్లపల్లికి చెందిన నూనె హరీష్ అనే నలుగురు పట్టుబడి గొర్ల శ్రీకాంత్, చిలాపూర్ శ్రీకాంత్, కొలువుల శ్రీకాంత్, జోగు గోపాల్ అనే మరో నలుగురు పారిపోయారు. పట్టుబడ్డ వాళ్ళ నుండి 19,700/- నగదు, ఐదు మోటార్ సైకిల్స్ ఐదు చరవాణిలను స్వాధీనం చేసుకుని అందరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## నాసిరకం ఐస్‌క్రీమ్ అమ్మితే 5వేలు జరిమాన

### హంగర్గ గ్రామ కూడలిలో ఫ్లెక్సీ ఏర్పాటు

నిజామాబాద్,ఏప్రిల్23 : తమ గ్రామంలో నాసిరకం ఐస్‌క్రీమ్ అమ్మితే జరిమానా విధిస్తామని గ్రామస్తులు, గ్రామ సర్పంచ్ హెచ్చరించారు. ఈమేరకు నిజామాబాద్ జిల్లా పోతంగల్ హంగర్గ గ్రామానికి వెళ్లే ప్రధాన కూడలి వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. సర్పంచ్ ఉదయ్ భాస్కర్ మాట్లాడుతూ బయటి నుంచి వచ్చే తోపుడు బండ్లలో నాణ్యత లేని, రంగు,రసాయనాలు కలిపిన ఐస్‌క్రీమ్‌లు అమ్ముతున్నారని వీటి వల్ల పిల్లలకు అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఒకవేళ నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.5 వేల జరిమానా విధిస్తామని అన్నారు.

# నాలుగు జిల్లాల చెత్తతో హుజురాబాద్ భవిష్యత్తును బొంద పెడతారా

### బిజెపి శాసనమండలి సభ్యులు అంజిరెడ్డి



కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 23(ది క్రైమ్ న్యూస్) హుజురాబాద్ రూరల్ మండలం సిర్సపల్లి శివారులో దాదాపు 125 ఎకరాలలో నాలుగు జిల్లాలకు సంబంధించిన చెత్తను ఇక్కడ డంపింగ్ చేయడానికి యార్డు ఏర్పాటు చేస్తే , చుట్టుపక్క గ్రామాలు, హుజురాబాద్ ప్రజలకు, ఈ ప్రాంత భవిష్యత్తుకు తీవ్ర ప్రమాదం వాటిల్లుతుందని, ప్రభుత్వం నాలుగు జిల్లాల చెత్తతో ఇక్కడ డంపింగ్ యార్డును ఏర్పాటు చేసి హుజురాబాద్ భవిష్యత్తును బొంద పెడతారా అని బిజెపి శాసనమండలి సభ్యులు అంజిరెడ్డి ఘాటుగా వ్యాఖ్యానించారు. గురువారం రోజున బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, హుజురాబాద్ బిజెపి నేతలతో కలిసి ఎమ్మెల్సీ అంజిరెడ్డి డంపింగ్ యార్డ్ స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ ఏర్పాటు విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం సరికాదని, ప్రజల అభీష్టానికి అనుగుణంగా పనిచేయాల్సిన ప్రభుత్వం తమకు తోచినట్టు వ్యవహరించడం మంచి పద్ధతి కాదన్నారు. నాలుగు జిల్లాల చెత్తను తీసుకొచ్చి ఒక్క ప్రాంతంలో వేస్తే ఇక్కడి ప్రజల పరిస్థితి ఏంటి.? వాళ్లు ఎలా జీవిస్తారు..? వ్యవసాయాన్ని నమ్ముకున్న రైతుల పరిస్థితి ఏంటి..? అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం డంపింగ్ యార్డ్ ఏర్పాటు విషయంలో మొండిగా నిర్ణయం తీసుకొని ఇక్కడి ప్రాంతంలో యార్డ్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టడం భావ్యం కాదన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకు మంచి చేయకపోయినా పర్వాలేదు కానీ, కీడు, హాని తలపెట్టే కార్యక్రమాలు చేపట్టవద్దన్నారు. ప్రశాంతంగా ఉన్న హుజురాబాద్ ప్రాంత ప్రజలను బాధ పెడుతుందన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం సమస్యలను సృష్టించడం సరికాదన్నారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేస్తామనే ప్రకటన, నిర్ణయంతో హుజురాబాద్ ప్రాంతంలో నెల రోజులుగా గందరగోళ పరిస్థితులు వచ్చాయన్నారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటు వద్దని నెల రోజులుగా ప్రజలు ఆందోళలు నిరసన కార్యక్రమాలు, రిలే నిరాహార దీక్షలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా మొండి వైఖరి తోనే ఉండడం సరికాదన్నారు.. ప్రజలంతా ఒక్కటై, అన్ని పార్టీలు ,అన్ని సంఘాలు ఒక్కటై జేఏసీగా ఏర్పడి ముక్తకంఠంతో నినదించిన ప్రభుత్వం స్పందించకపోవడం దారుణం అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటికైనా మొండి వైఖరిని మార్చుకొని ,డంపింగ్ యార్డ్ ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, డంపింగ్ యార్డ్ రద్దు ప్రకటన చేయాలన్నారు. విత్తన కేంద్రంగా ఉన్న ఈ హుజురాబాద్ ఏరియాలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం ఏంటి? అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బిజెపి హుజురాబాద్ పట్టణ, మండల అధ్యక్షులు, తుర్పాటి రాజు, పారిపెల్లి కొండాల్ రెడ్డి, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి, ఇళ్ళంతకుంట మండల అధ్యక్షులు బైరెడ్డి రమణారెడ్డి, కౌన్సిలర్స్,మొలుగురి సుమలత, పంజాల మనోజ్ దామర అనూష తూర్పాటి లక్ష్మీ దుర్గ కొండ ప్రశాంతి కందుగుల సర్పంచ్ ముప్పు మహేష్ బిజెపి సీనియర్ నాయకులు పైల్ల వెంకట్ రెడ్డి గంగిశెట్టి ప్రభాకర్ ,తూముల శ్రీనివాస్ ,నరాల రాజశకర్ తిప్పబతిని రాజు, యాంశాని శశిధర్, సబ్బని రమేష్, అనురాగ్,మంచికట్ల మురళీ, పదారి సుమన్, గంట సంపత్, కొలిపాక వెంకటేష్, ఇనుగొండ తిరుపతిరెడ్డి, వెంకట్రావు, బైరెడి సంపత్ రెడ్డి, సహదేవ్ క్యాస వెంకటేష్,ఎర్ర శ్రీదర్,నల్ల అజయ్,పద్దం విజయ్, నగేష్,నాయకులు , కార్యకర్తలు తది తరులు పాల్గొన్నారు..

## జీవన్ రెడ్డిని విమర్శించే అర్హత నిన్న, మొన్న పార్టీలోకచ్చిన మీ ఇద్దరికీ లేదు

**థంబింగ్ విధానం రద్దు కాకపోతే రైతులతో మరో ఉద్యమం తప్పదు**

**మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్**



తిమ్మాపూర్, ఎప్రిల్ 23(ది క్రైం న్యూస్):కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలకేంద్రంలోని బిఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ మండలాధ్యక్షుడు రావుల రమేష్ ఆధ్వర్యంలో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ హాజరై మాట్లాడుతూ... కాళేశ్వరం ప్రాజెక్ట్ పై పిసి ఘోష్ కమీషన్ నివేదికను రద్దు చేస్తూ కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసిఆర్ రైతులకు మూడు పంటలకు నీరందించాలనే సంకల్పంతో కాళేశ్వరం ప్రాజెక్ట్ ను ఐదేండ్లలో పూర్తి చేసి లక్షల ఎరాలకు నిరందిస్తే కుంగిన ఫిల్లర్లకు మరమ్మత్తులు చేయించకుండా కాళేశ్వరాన్ని కూలేశ్వరమని ఎగతాళి చేస్తూ రెండున్నర ఏండ్లుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాలయాపన చేశాడని ఎద్దేవా చేశారు. అంబేద్కర్ విగ్రహాలు తాను ఏర్పాటు చేయించినవేనని, శిలాఫలకంలో దాతల పేర్లు లేకుండా దళితులను అగౌరవ పరిచేలా విగ్రహాలను ఆవిష్కరించడం తగదని హెచ్చరించారు. 40ఏండ్లు కాంగ్రెస్ జెండా మోసిన జీవన్ రెడ్డిని విమర్శించే స్థాయి నిన్న మొన్న కాంగ్రెస్ లోకి అడుగు పెట్టిన ఎమ్మెల్యే కవ్వంపల్లి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇద్దరికీ లేదని,ఎన్.ఎస్.యూఐ నాయకుడిగా ఉన్న మంత్రి అడ్లూరిని జెడ్పీటీసీని, జెడ్పీ చైర్మన్ గా చేసిందే జీవన్ రెడ్డి అని గుర్తు చేశారు. మక్కల క్వింటాలుకు 2300 ఉండగా 1600-1700ధర పెట్టడమే కాక బస్తాకు 45కిలోలే నింపుతూ 2కిలోలు మిల్లర్లకు,3కిలోలు క్యాంపు కార్యాలయానికి అంటూ ఇదోరకంగా రైతులను ఎమ్మెల్యే ముంచుతున్నాడని ఆరోపిస్తూ రసమయి ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు థంబింగ్ విధానం ఏర్పాటు చేయడంపై మండిపడుతూ కౌలుదారులకు,పంట పండించే రైతులకు ఓటీపీ విధానాన్ని ఏర్పాటు చేయాలిగాని థంబింగ్ తో రైతుల ఆత్మహత్యలకు కారణమయ్యేలా ప్రభుత్వ పరిపాలన విధానంపై ఆశ్చర్యానికి లోనైయ్యారు. వడ్ల కొనుగోలు కేంద్రాల ప్రారంభాలపై గతేడాది చూపిన శ్రద్ధ ఈ ఏడాది ప్రారంభాల్లో ఎమ్మెల్యే ఎందుకు చూపించడం లేదని కేంద్రాలు ప్రారంభమైనా కొనుగోల్లలో ఆలస్యమెందుకంటూ ప్రశ్నిస్తూ థంబింగ్ విధానాన్ని రద్దు చేయకుంటే రైతుల పక్షాన ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జివి రామకృష్ణారావు, మండలాధ్యక్షుడు రావుల రమేష్, రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్, జిల్లా అధికార ప్రతినిధి శాతరాజు యాదగిరి,నాయకులు పాశం అశోక్ రెడ్డి, పాకాల మహిపాల్ రెడ్డి,తాళ్ళపల్లి శేఖర్ గౌడ్,గంప వెంకన్న, అంతడుపుల సంపత్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

## రైతును రాజు చేయడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

**- రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్ముకోవాలి**

**- రామగిరి మండలం నాగేపల్లి గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం**

**- మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్**



రామగిరి, ఏప్రిల్ 23(ది క్రైమ్ న్యూస్) :- రామగిరి మండలం నాగేపల్లి గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ఐకేపీ సెంటర్ ను నాగేపల్లి సర్పంచ్ దివ్య- సుధాకర్, కమాన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వైనాలా రాజు, కాంగ్రెస్ నాయకులు, రైతులతో కలిసి మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా తొట్ల తిరుపతి యాదవ్ మాట్లాడుతూ..... రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని, ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా నిర్వహిస్తామని, అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రైతును రాజుగా నిలబెట్టడమే తెలంగాణ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తెలంగాణ ఐటీ ఑ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు రైతు సంక్షేమానికి అంకితభావంతో పనిచేస్తున్నారని చెప్పారు. తెలంగాణ దేశానికే అన్నం పెట్టే ధాన్యాగారంగా రూపుదిద్దుకుంటోందని, రైతులు పండించిన ప్రతి ధాన్య గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని హెచ్చరిస్తూ, తమ ధాన్యాన్ని నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాగేపల్లి గ్రామ అధ్యక్షులు తీగల సదయ్య, సర్పంచ్ రొడ్డ మౌనిక కుమార్, ఆదివారం పేట సర్పంచ్ ఇల్లందుల సంజీవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సిద్ధం మురళి, శ్రీనివాస్, ప్రవీణ్,మాజీ ఉప సర్పంచ్ నరేష్ యాదవ్ నాగేపల్లి ఉప సర్పంచ్ సతీష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొల్లపల్లి రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి చదరంగం క్రీడా పోటీలకు ఎంపికైన జీనియస్ చెస్ అకాడమీ క్రీడాకారులు





కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 23(ది క్రైమ్ న్యూస్) : పెద్దపల్లి అమర్చంద్ కళ్యాణమండపం లో ఈనెల 22న నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా అండర్ 7 మరియు అండర్ 11 చదరంగం పోటీలలో కరీంనగర్ చెందిన జీనియస్ చెస్ అకాడమీ క్రీడాకారులు అండర్ 7 బాలికల విభాగంలో ఎం సాన్విత, కే అద్వైత, ఎన్ సాన్విత, బాలుర విభాగంలో శ్రీ హన్సిత్, కే శ్రేయాన్స్, ఏ శ్రేయన్స్, అండర్ 11 బాలికల విభాగంలో ఎస్ నేహిత, జి తన్వి, లక్ష్మీ నందిని, అండర్ 11 బాలుర విభాగంలో ఎన్ అశ్విన్, జతిన్ సిద్ధార్థ, సహర్ష్, రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులను గురువారం జ్యోతి నగర్ లోని జీనియస్ చెస్ అకాడమీలో వ్యవస్థాపక అధ్యక్షులు కంకటి కనకయ్య అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 26 హైదరాబాదులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలో ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జీనియస్ చెస్ అకాడమీ డైరెక్టర్ సీనియర్ కోచ్ కంకటి అనూప్ కుమార్, జీనియస్ చెస్ అకాడమీ కో డైరెక్టర్ కంకటి సుజన్ కుమార్, కరీంనగర్ డిస్ట్రిక్ట్ డెమొక్రటిక్ చెస్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి తాటిపల్లి సతీష్ బాబు అకాడమీ కోచ్ లు అభిరామ్, రేవిక్, స్వాతి, శ్రీనిజ, చదరంగం క్రీడాకారులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## శ్రీరాంపల్లిలో శోకసంద్రంలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచిన పాండన్న...

**మానవత్వానికి నిదర్శనం.......**

**అనిత, సునీతలకు ధైర్యం చెప్పి ఓదార్చారు**



నల్గొండ జిల్లా ప్రతినిధి : ది క్రైమ్ న్యూస్ : నాగార్జునసాగర్ నియోజకవర్గం, తిరుమలగిరి సాగర్ మండలం శ్రీరాంపల్లి గ్రామంలో మృతురాలు మల్లేపల్లి ఎల్లమ్మ కుటుంబాన్ని బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ పాండన్న పరామర్శించారు. ఎల్లమ్మ మరణంతో బాధలో ఉన్న కుటుంబ సభ్యులకు ఆయన తన సానుభూతి వ్యక్తం చేస్తూ ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎల్లమ్మ కుమార్తెలు అనూష, సునీతలను ధైర్యం చెప్పి, అవసరమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపల్లి ఉప సర్పంచ్ గజ్జల శివారెడ్డి, వడిత్య విజయ్, తిరుమలగిరి సాగర్ మండలం మాజీ వైస్ ఎంపీపీ యడవెల్లి దిలీప్ కుమార్ రెడ్డి, కొత్తపల్లి ఫ్యాక్స్ మాజీ వైస్ చైర్మన్ గజ్జల శ్రీనివాస్ రెడ్డి, తిరుమలనాథ గుడి మాజీ చైర్మన్ బుర్రి రామిరెడ్డి, పెద్దవూర మండలం బీఆర్ఎస్వి అధ్యక్షులు రమావత్ రమేష్ నాయక్, అలుగుబెల్లి ఆదిరెడ్డి, కోడుమూరు వెంకటరెడ్డి, రాహుల్, రైడర్ ధనుష్, ఇస్రం ప్రశాంత్, ఇస్రం లింగస్వామి, షేక్ అబ్దుల్ కరీం, గజ్జల నాగార్జున రెడ్డి, ఇస్రం లక్ష్మమ్మ, ఇస్రం ఎల్లమ్మ (మాజీ ఉప సర్పంచ్), ఇస్రం ఇద్దమ్మ, కురాకుల నాగమ్మ, కంభంపాటి రజిత, ఇస్రం నర్సమ్మ, బరిగల వెంకటమ్మ, ఆపంగుల వెంకటమ్మ, గార్లపాటి మారమ్మ, కందుల ఎల్లమ్మ, ఇస్రం మంగమ్మ, ఇస్రం కాశమ్మ, బరిగల సాగరయ్య, ఇస్రం చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లు భారత మహిళల ఆత్మగౌరవానికి ప్రతీకగా



రవికుమార్ యాదవ్ (క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి) : మహిళా రిజర్వేషన్ బిల్లు భారత మహిళల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని, దానిని అడ్డుకున్న కాంగ్రెస్ పార్టీకి రానున్న ఎన్నికల్లో ప్రజలు గట్టి పాఠం చెబుతారని రవికుమార్ యాదవ్ పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్‌లో బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో మహిళా ఆక్రోష్ ర్యాలీ ఘనంగా జరిగింది. ట్యాంక్ బండ్ జిహెచ్ఎంసి కార్యాలయం నుండి ఇందిరాపార్క్ వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో శేరిలింగంపల్లి నియోజకవర్గం సహా వివిధ ప్రాంతాల నుండి వేలాది మహిళలు పాల్గొని తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి ఇంచార్జ్ మారబోయిన రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవడంలో కాంగ్రెస్ కూటమి పాత్రపై తీవ్ర విమర్శలు గుప్పించారు. మహిళలు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న 33 శాతం రిజర్వేషన్ బిల్లును కాంగ్రెస్ సపోర్ట్ చేయకుండా నిలిపివేసిందని ఆరోపించారు. నియోజకవర్గాల పునర్విభజన అంశంలో కూడా రాజకీయ లాభనష్టాల కోసం కాంగ్రెస్ వ్యవహరించిందని, బీజేపీ బలపడుతుందనే భయంతో మహిళా బిల్లును అడ్డుకుందని ఆయన అన్నారు. ఈ బిల్లు అమలైతే మహిళలు రాజకీయాలతో పాటు అన్ని రంగాల్లో ముందడుగు వేయగలిగేవారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రాధాకృష్ణ యాదవ్, సీనియర్ నాయకులు వసంత్ యాదవ్, ఎల్లేష్, రాజు శెట్టి, విష్ణుదత్తు తదితర నాయకులు, అలాగే పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## ప్రగతి చక్రంపై నిర్లక్ష్యపు చీడ !

అధికారంలోకి రావడానికి అనేక హామీలు గుప్పించడం, తరవాత వాటిని విస్మరించడం పరిపాటిగా మారింది. అలవికాని హామీలు ఇవ్వడం, ప్రజలను మోసం చేయడం అలవాటు చేసుకున్నారు. బిఆర్ఎస్ బాటలోనే ఇప్పుడు కాంగ్రెస్ కూడా మోసాల దారిలో నడుస్తోంది. ఇచ్చిన హామీలను అమలు చేయలేక చతికిల పడింది.రాష్ట్ర ఆదాయం మొత్తాన్ని వడ్డీలు కట్టడానికే అన్నట్లుగా అప్పులు చేసి చూపారు. అప్పులతో తెలంగాణ చితికి పోతోంది. ఇందులో అన్ని పార్టీలతది ఒకటే దారిగా ఉంది. తెలంగాణ ఏర్పడ్డాక కెసిఆర్ ప్రభుత్వ హాయంలో ఆర్టీసి దాదాపు రెండునెలల పాటు సమ్మెకు దిగింది. వారిని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేస్తామన్న హామిని ఆనాడు కెసిఆర్, ఈనాడు రేవంత్ రెడ్డి ఇద్దరూ నిలబెట్టుకోలేక పోయారు. దూరదృష్టి లేక రవాణా శాఖ.. సమ్మెకు కారణమయ్యారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం, వేతన సవరణ, బకాయిల చెల్లింపు సహా మొత్తం 32 అంశాలపై కార్మిక సంఘాల జేఏసీ ఏడాది కాలంగా ప్రభుత్వ పెద్దలకు, ఆర్టీసీ యాజమాన్యానికి వినతిపత్రాలు ఇచ్చింది.. విజ్ఞాపనలు చేసింది. సమ్మెకు వేళయిన తరుణంలో మంగళవారం ఆగమేఘాలపై అధికారుల కమిటీ పేరుతో ప్రభుత్వం ఓ కంటి తుడుపు ప్రతిపాదనను తెరపైకి తెచ్చింది. ఏడాదిగా పట్టింపులేనితనం ప్రదర్శించి, ఇప్పుడు నాలుగు వారాల గడువు కోరటం విడ్డూరం.ఇలాంటి కాలయాపన కమిటీతో ఒరిగేదేమీ లేదని భావించిన కార్మికులు, సమస్యలు పరిష్కరించే వరకు వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని తేల్చిచెప్పి, మంగళవారం అర్ధరాత్రి నుంచే సమ్మెకు వెళ్లారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్సు చక్రాలు ఆగిపోయాయి. 6,000 బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. ప్రతి రోజూ 60 లక్షల మంది ప్రయాణించే ఆర్టీసీలో సమ్మెతో ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఓ వైపు ఎండలు మండిపోతుంటే ప్రైవేటు వాహనాలు అందుబాటులో లేక ప్రయాణాలు ప్రయాసగా మారాయి. విద్యార్థులు, రోజువారీ, కూలీలు, ఉద్యోగులు, తక్కువ ఖర్చుతో కూడిన ప్రజా రవాణాను ఆశ్రయించే ఇతర ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. డిపోల వద్ద కార్మికుల ధర్నాలు, పోలీసులు అడ్డుకోవడంతో పలుచోట్ల ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది.మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ నష్టాల్లో సాగుతోంది. ఆర్టీసీ కార్మికులను ఒప్పించలేక, మెప్పించలేక చతికిలపడిన తీరు రేవంత్ సర్కార్ అసమర్థతకు నిదర్శనంగా చూడాలి. మాటలు, ఆవేశంతో కూడిన ప్రసంగాలతో ప్రజలను ఎల్లకాలం బురిడీ కొట్టించలేమని అధికార కాంగ్రెస్ నేతలు గుర్తించాలి. నిత్యం అరకోటి మందికి పైగా ప్రయాణించే ప్రజారవాణా వ్యవస్థలో సమస్యల పరిష్కారం చూపడంలో రెండున్నరేళ్లుగా నిర్లక్ష్యం వహించారు. ప్రభుత్వం ఇంకా దాటవేత ధోరణి అవలంబించి సమస్యను జటిలం చేయకుండా సమ్మెకు కారణాలను గుర్తించి పరిష్కరించాలి. ఆర్టీసీ కార్మికుల,రాష్ట్ర ప్రజల విస్తృత ప్రయోజనాల దృష్ట్యా సమ్మెకు సత్వరమే పరిష్కారం కనుగొనాలి. ఈ దిశగా సర్కార్ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఎన్నికల్లో డిక్లరేషన్లు, మ్యానిఫెస్టోలో హామీలు గుప్పించి, ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన హస్తం నేతలు పాలనను గాలికి వదిలేసి రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేస్తున్నారు. ఇప్పుడు ప్రజా రవాణా వ్యవస్థ కూడా ఆ జాబితాలో చేరిపోయింది. హామీల అమలు, సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ కార్మిక సంఘాలు సమ్మెబాట పట్టాయి. అధికారంలోకి రావటానికి కాంగ్రెస్ నేతలు ఇచ్చిన హామీలను ఇప్పుడు మరచిపోయి మాట్లాడుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం కోసం ప్రణాళికను ప్రకటించినా ఆచరణలో పెట్టలేకపోయింది. తాము అధికారంలోకి వస్తే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు పీఆర్సీ పరిధిలోకి తీసుకొస్తామని, ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తామని, ఖాళీలను భర్తీ చేస్తామని కాంగ్రెస్ హామీల మీద హామీలు గుప్పించింది. దీంతో ఆర్టీసీ కార్మికులు కాంగ్రెస్ మాటలనునమ్మారు. రెండున్నరేండ్లు గడిచినా కాంగ్రెస్ సర్కార్ ఆర్టీసీ గురించి పట్టించుకోవట్లేదు. ఆరు గ్యారెంటీల్లోని ఒక గ్యారెంటీ అయిన మహాలక్ష్మి పథకంలో ఒక భాగమైన 'మహిళలకు ఆర్టీసీలో బస్సుల్లో ఉచిత ప్రయాణ పథకం' తీసుకొచ్చింది. కానీ ఆర్టీసీకి ప్రభుత్వం నిధులు ఇవ్వటంలేదు. ఇప్పుడు కార్మిక సంఘాల జేఏసీ అడుగుతున్న డిమాండ్లలో ఫ్రీ బస్ పథకం నిధుల విడుదల అంశం కీలకమైనది కావడం గమనార్హం. మహిళలకు ఉచిత ప్రయాణంతో ఆర్టీసీ లాభాల్లోకి దూసుకెళ్లిందని చెప్పుకొంటున్న ప్రభుత్వ పెద్దలు.. కార్మికుల సమస్యలు ఎందుకు పరిష్కరించటంలేదో చెప్పాలి. ఇకపోతే ఎన్నికల ముందు కాంగ్రెస్ నిరుద్యోగ మ్యానిఫెస్టోను ప్రకటించింది. తమ ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోగా 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని చిక్కడపల్లి లైబ్రరీకి తీసుకువచ్చి నిరుద్యోగుల్లో ఆశలు పెంచింది. ప్రియాంక గాంధీతో సరూర్‌నగర్ స్టేడియంలో యూత్ డిక్లరేషన్ ప్రకటించి నిరుద్యోగులను తమ వైపు తిప్పుకున్నది. 2 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని నిరుద్యోగుల్లో ఆశలు కల్పించారు. అది నిజమని నమ్మిన ఎంతోమంది బస్సు యాత్రలు నిర్వహించి ఆ పార్టీకి అనుకూలంగా ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో ఆ పార్టీకి ఓటు వేయడమే కాదు, ఏకంగా పత్తి చేలు, వ్యవసాయ బావుల వద్ద కూలీలు, రైతులను కలిసి, కాళ్లు మొక్కి కాంగ్రెస్‌కు ఓట్లు వేయించేలా తమ వంతు ప్రయత్నించారు. పదేండ్లపాటు అధికారానికి దూరంగా ఉన్న కాంగ్రెస్ నాయకులకు ఉద్యోగాలు వచ్చాయి తప్ప నిరుద్యోగులకు ఒక్క ఉద్యోగమూ రాలేదు. ఇలా అనేక హామీలను ఇచ్చి, వాటిని మరిచారు. ఇప్పుడు గత ప్రభుత్వాన్ని తిట్టడం తప్ప రెండున్నరేళ్లుగా గట్టిగా చేసిన కార్యక్రమం ఒక్కటీ లేదు. హామీల అమలులో నిజాయితీ లేకుంటా గత బిఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుంది. పదేళ్లపాటు అధికారంలో ఉంటామన్న భరోసాకు ప్రజలు చెల్లచీటీ పలుకుతారని గుర్తించాలి.

# బెంగాల్ ఎన్నికల వైపు అందరి చూపు



మొత్తం 294 నియోజకవర్గాలున్న పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో మొదటి దఫా 152 నియోజకవర్గాలకు గురువారం ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. సముద్ర మట్టానికి అత్యంత ఎత్తులో ఉండే డార్జిలింగ్ నియోజకవర్గంతోపాటు సముద్ర తీరానికి ఆనుకుని ఉన్న తూర్పు మిద్నపూర్ నియోజకవర్గాలు కూడా మొదటి దఫా ఎన్నికలకు సిద్ధమయ్యాయి. తొమ్మిది జిల్లాల్లోని ఏడు జిల్లాలు బంగ్లాదేశ్ సరిహద్దులో భాగంగా ఉంటున్నాయి. అవి ముర్షిదాబాద్, మాల్డా, ఉత్తర దినాజ్‌పూర్, దక్షిణ దినాజ్‌పూర్, కూచ్ బీహార్, జలపాయ్‌గురి, డార్జిలింగ్ నియోజకవర్గాలకు గురువారం ఎన్నికలు జరుగుతాయి. అంచనాలకు విరుద్ధంగా స్థానిక ప్రభుత్వంపై వ్యతిరేకత గత 2021 అసెంబ్లీ ఎన్నికల నాటి కన్నా ఇప్పుడు బలంగానే కనిపిస్తోంది. అయినా ఈ ఎన్నికల్లో అది ప్రాధాన్యమైన అంశం కాదు. ఇప్పుడు ఓటర్ల దృష్టి సన్నిహితం, వ్యక్తిగతంపైనే కేంద్రీకరించబడింది. ఓటర్ల జాబితాల్లోంచి ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ ద్వారా కొన్ని లక్షల మంది ఓటర్ల పేర్లను పాత నిబంధనలను పక్కన పెట్టి కొత్త నిబంధనలతో ఎన్నికల కమిషన్ తొలగించడం, వారికి ఈ ఎన్నికల్లో ఓటు వేసే హక్కును లేకుండా చేయడంపైనే ఓటర్లు చాలా తీవ్రంగా ఉన్నారు. ఏరోజుకారోజు కొత్త నిబంధనలను రూపొందించి అమలు చేయడం, ఆటంకాలు ఇవన్నీ ఆయా సంస్థలకు అసాధారణమనిపిస్తోంది. బిజెపి ఉన్నతాధికారం, అక్రమ వలసదారులకు, కపట ఓటర్లకు వ్యతిరేకంగా బిజెపి సాగించిన భారీ ప్రచారం ప్రభావం ఎంతవరకు ఈ ఎన్నికల్లో పనిచేస్తుందో అంచనా వేయడం కష్టం. టిఎంసి, దాని పాలిత వర్గాల నాయకులు ఓటర్లకు ఎలాంటి అన్యాయం జరగనివ్వబోమని మద్దతు కల్పించారు. రాష్ట్రంలో తాము అధికారం చేపట్టిన ఆరునెలల్లోనే ఉమ్మడి పౌరస్మృతి అమలులోకి తెస్తామని బిజెపి స్పష్టం చేసింది. అయితే ఈ పరిణామం ఓటర్లపై ఏమాత్రం ప్రభావం చూపించడం లేదు. ఈ ఉమ్మడి పౌరస్మృతి అంశం ఓటరను విభజించి, ఉద్రిక్తతలు స్పష్టంగా తెలిసేలా చేసినట్టు అనిపించడం లేదు. ఉద్రిక్తత మాత్రం కనిపిస్తోంది. 31 లక్షల ఓటర్ల భవిష్యత్తు ఎటూ తేలక పెండింగ్‌లో పడడం ఓటర్లను కుంగదీస్తోంది. వీరికి పూర్తి న్యాయం చేకూర్చాలన్న నిశ్చయంతో రాజ్యాంగం లోని 142 ఆర్టికల్ ఉపయోగించి అసాధారణ అధికారాలతో ఈ నెల 21 నాటికి వీరి వివాదాలు పరిష్కరించాలని సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల్లో పాల్గొన లేకుండా 34 లక్షల మంది ఓటర్లను మినహాయించడం, తమ ప్రతినిధులను ఎన్నుకోడానికి వారి ఓటుహక్కు లేకుండా చేయడం అన్యాయమే అని సుప్రీం కోర్టు భావిస్తోంది. ఈ ఎన్నికల్లో 6.44 కోట్ల ఓటర్లు ఓటువేయడానికి అర్హులైనప్పుడు, 34 లక్షలు అన్నది పెద్ద సంఖ్యేమీ కాదు. కానీ ఈ చెప్పుకోతగిన సంఖ్యలో ఉన్న ఓటర్ల భావోద్వేగాలు మమతా బెనర్జీకి లాభదాయకమవుతాయి. వీరి భవిష్యత్తుపై దృష్టి కేంద్రీకరించడం ప్రధాన అంశం అవుతుంది. ప్రజాస్వామ్యాల సాధారణ నియమాల ప్రకారం ప్రభుత్వాలు మారడం అత్యంత సహజం. అదేం వినాశనకరమైన లేదా అత్యంత భయంకరమైన పరిణామం ఏదీ కాదు. గత ఐదేళ్లుగా ప్రస్తుత ప్రభుత్వం మారాలని, ముఖ్యమంత్రి మమతా బెనర్జీని తొలగించాలని, ఢిల్లీ నియంత్రణలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఏర్పడాలన్న అభిప్రాయం తొంగిచూస్తోంది. ఈ తరుణం లో వామపక్ష ప్రభుత్వం ఏర్పడుతుందా? కాంగ్రెస్ తిరిగి అవతరిస్తుందా? అన్న ప్రశ్నలు ఎదురవుతున్నాయి. 91 లక్షల మంది ఓటర్లను జాబితాల్లోంచి తొలగించి ఎన్నికల కమిషన్ గందరగోళం సృష్టించడం హిందూ మద్దతుదారులకు, బిజెపి వర్గాలకు తప్ప మిగతా వారికి నచ్చడం లేదు. ఈ విధంగా తొలగించడంలో తప్పేమీ లేదని, కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ఉన్నా మరే ప్రభుత్వం ఉన్నా ఇదే పనిచేస్తుందని బిజెపి వర్గాలు సమర్థించుకుంటున్నాయి. కానీ గత ఆరునెలలుగా ప్రత్యేక సమగ్ర సవరణ ద్వారా ఎన్నికల కమిషన్ ఓటర్లను బాధపెడుతుండడం బెంగాల్‌లో తీవ్ర ఆందోళనలను రేకెత్తిస్తోంది. కూలీనాలీ చేసుకునే గిగ్ వర్కర్లు తమ పనులు కోల్పోయి ఎన్నికల కమిషన్ చుట్టూ తిరగవలసి వచ్చింది. ఇది ఒక విధంగా కేంద్రంలో ఉన్న ఎన్‌డిఎ ప్రభుత్వానికి, రాష్ట్రంలోని బిజెపి వర్గాలకు నష్టదాయకమనే చెప్పవచ్చు. వాస్తవానికి ఈ ఎన్నికలు ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాజకీయ జీవితంలో అగ్నిపరీక్ష వంటివి. బిజెపిని ఓడించడం తనకే సాధ్యమని ధీమా పడుతున్న బెనర్జీకి ఇండియా కూటమి లోని పార్టీల నుంచి కూడా సవాళ్లు ఎదురవుతున్నాయి. ప్రభుత్వంపై ప్రజావ్యతిరేకత కూడా పెరుగుతోంది. ప్రభుత్వంలో అవినీతి హద్దులు దాటిందన్న అపకీర్తి వెంటాడుతోంది. 2021 నాటి అసెంబ్లీ ఎన్నికలకు, ఇప్పటి అసెంబ్లీ ఎన్నికలకు మధ్య రాజకీయ పరిస్థితులు, ఇతర పరిస్థితుల్లో చాలా తేడా వచ్చింది. గత ఐదేళ్లలో ఎన్నో ఉత్కంఠభరితమైన సంచలనాత్మక సంఘటనలు జరిగాయి. మహిళలపై హింసాత్మక, హత్య, అత్యాచార సంఘనలు విపరీతంగా పెరిగాయి. ప్రభుత్వ నిర్వహణ లోని ఆస్పత్రిలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, ఆపై హత్యాకాండ ఎంతటి సంచలనం కలిగించిందో తెలిసిందే. దేశంలోనే కాదు ప్రపంచవ్యాప్తంగా ఈ సంఘటనపై తీవ్ర ఆగ్రహం పెల్లుబికింది. మమత ప్రభుత్వానికి ఇది తీరని కళంకంగా మారింది. 2025 డిసెంబర్ 13న క్రీడాకారుడు లియోనిల్ మెస్సీ కోల్‌కతా పర్యటన సమయంలో నిర్వహణ లోపంతో అల్లర్లు, గందరగోళం చెలరేగాయి. అలాగే యునెస్కో గుర్తింపు పొందిన పశ్చిమబెంగాల్ సాంస్కృతిక వారసత్వ వేడుక దుర్గాపూజ నిర్వహణకు మమతా బెనర్జీ ప్రభుత్వం అడ్డంకులు సృష్టించిందన్న ఆరోపణలు బిజెపి చేసింది. ఇవన్నీ మమత ప్రభుత్వానికి కళంకాలని చెప్పవచ్చు. ఈ తరుణంలో ఓటర్ల తీర్పు ఎలా ఉంటుందో అన్న ఉత్కంఠ అందరిలో నెలకొంది.

## అద్దె బస్సులను నడిపేందుకు యత్నం

### సమ్మెను విచ్ఛిన్నం చేయవద్దని వేడుకున్న కార్మికుడు

జనగామ,ఏప్రిల్ 23 : రాష్ట్ర వ్యాప్తంగా రెండో రోజు ఆర్టీసీ కార్మికుల సమ్మె కొనసాగుతున్నది. పోలీసుల పహారా మధ్య బలవంతంగా అద్దె బస్సులను నడిపేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుండగా ఆర్టీసీ కార్మికులు ఎక్కడి కక్కడ అడ్డుకుంటున్నారు. తాజాగా జనగామ జిల్లాలో నిరసనకు దిగిన ఆర్టీసీ కార్మికులను అడ్డుకోవద్దంటు ఓ ఆర్టీసీ కార్మికుడు పోలీసుల కాళ్లు పట్టుకుని వేడుకున్న సంఘటన ప్రతి ఒక్కరిని కదలించింది. జనగామ ఆర్టీసీ డిపో ఎదుట సీఐ సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నడుమ జనగామ డిపో నుండి వివిధ ప్రాంతాలకు బస్ కు ఒక కానిస్టేబుల్‌ను పెట్టి పంపిస్తున్నారు. ఈ క్రమంలో న్యాయమైన తమ డిమాండ్ల కోసం రోడ్డెకిన తమను అడ్డుకోవద్దంటూ పోలీసుల కాళ్లు మొక్కి వేడుకున్నాడు. కాగా, డిమాండ్స్ నెరవేర్చే వరకు సమ్మె ఆపేదే లేదని ఆర్టీసీ కార్మికులు స్పష్టం చేస్తున్నారు.

## ఆర్టీసీ సమ్మెపై కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి

### ఇచ్చిన హామీ మేరకు నడుచుకోవాలి

### మాజీమంత్రి వేముల ప్రశాంతరెడ్డి డిమాండ్



నిజామాబాద్,ఏప్రిల్ 23 : ఆర్టీసీ కార్మికుల సమ్మె డిమాండ్లను పరిష్కరించకపోతే తెలంగాణలో 'మరో సకల జనుల సమ్మె' తప్పదని బిఆర్ఎస్ నేతలు హెచ్చరించారు. కమిటీలతో ఇంకా ఎంతకాలం తమను మభ్యపెడుతూ, కాలయాపన చేస్తారని ప్రశ్నించారు. రాష్ట్ర సాధనలో అగ్రభాగా ఉన్న ఆర్టీసీ కార్మికులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తున్నదని ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి విమర్శించారు. ఆర్టీసీని ప్రైవేట్‌పరం చేయడానికి ఈ ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని ధ్వజమెత్తారు. ఒక్కసారి ఆర్టీసీ ప్రైవేట్‌పరమైతే ప్రజలకు భారం తప్పదని హెచ్చరించారు. ఇది ఒక ఆర్టీసీ కార్మికుల సమస్య కాదని, యావత్తు తెలంగాణ ప్రజల సమస్య అని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల విలీనంపై సర్కార్ వైఖరేమిటో చెప్పాలని ప్రశ్నించారు. అధికారుల కమిటీ ఎలాంటి సమస్యలకూ పరిష్కారం చూపలేదని తెలిపారు. తమను పిలిచిన చర్చల్లో ఒక్క మంత్రి లేరని, అందుకే ఐఏఎస్ అధికారుల కమిటీ చేతులెత్తేసిందని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెకు రాష్ట్రవ్యాప్తంగా సకల జనుల మద్దతు ఉన్నదని తేల్చి చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటలతో కాలయాపన చేయకుండా చేతల్లో తమ పనితనం చూపించాలని డిమాండ్ చేశారు. నాడు ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలపై ఇప్పుడు వైఖరి ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు.

## తొలిదశ ఎన్నికల వేళ


### పోలింగ్ కేంద్రం వద్ద నాటు బాంబుతో దాడి

కోల్‌కతా,ఏప్రిల్23 : తొలిదశ ఎన్నికల వేళ పశ్చిమబెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లాలో పోలింగ్ వేళ తాజాగా నాటు బాంబుతో దాడి జరగడం కలకలానికి దారి తీసింది. జిల్లాలోని నవోదా ప్రాంతంలోగల ఒక పోలింగ్ బూత్ సమీపంలో ఈ ఘటన జరిగింది. గుర్తుతెలియని వ్యక్తి ఒకరు పోలింగ్ బూత్ సమీపంలో బాంబు విసరడంతో పలువురు గాయాలపాలయ్యారు. దీంతో, తీవ్ర భయాందోళనలకు లోనైన ఇతర ఓటర్లు పరుగులు తీశారు. ఈ ఘటనలో గాయపడ్డ వారిని సమీప ఆసుపత్రులకు తరలించినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఘటన సమాచారం అందగానే ఆ ప్రాంతానికి చేరుకున్న భద్రతా దళాలు తనిఖీలు చేపట్టాయి. బాంబు విసిరినది ఎవరో గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నాయి. పోలింగ్‌కు అడ్డంకి సృష్టించేందుకు ఈ దాడి జరిగిందా? అనే కోణంలో విచారణ చేస్తున్నాయి. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. పశ్చిమబెంగాల్‌లో ప్రస్తుతం తొలి దశలో భాగంగా 152 స్థానాల్లో పోలింగ్ జరుగుతోంది. 16 జిల్లాలోని స్థానాలకు జరుగుతున్న అసెంబ్లీ ఈ ఎన్నికల్లో మొత్తం 1,478 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. వచ్చే వారం మిగిలిన 142 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. పశ్చిమబెంగాల్ అధికార పార్టీ తృణమూల్, ప్రతిపక్ష బీజేపీ ఈ ఎన్నికల్లో హోరాహోరీగా తలపడుతున్న విషయం తెలిసిందే.



## నైపుణ్యమే యోగం

'అర్జునా! ఎవరైతే బుద్ధితో విచారించి, ఫలితాపేక్ష లేకుండా, వివేకంతో కర్మలను ఆచరిస్తాడో.. అతను తన కర్మలకు సంబంధించిన మంచిచెడు ఫలితాలను ఈ జన్మలోనే వదిలేస్తాడు. అందువల్ల నైపుణ్యంతో పనిచేయడం అనేది యోగం' అంటాడు కృష్ణుడు. 'అర్జునా! ఎవరైతే బుద్ధితో విచారించి, ఫలితాపేక్ష లేకుండా, వివేకంతో కర్మలను ఆచరిస్తాడో.. అతను తన కర్మలకు సంబంధించిన మంచిచెడు ఫలితాలను ఈ జన్మలోనే వదిలేస్తాడు. అందువల్ల నైపుణ్యంతో పనిచేయడం అనేది యోగం' అంటాడు కృష్ణుడు. కర్మాచరణకు ప్రేరణ ఆ పనిలో పొందే ఫలితమే కదా.. అప్పుడా పలితాన్ని అపేక్షించకుంటే, పొందకుంటే.. కార్యనిర్వహణపై ఆసక్తిగాని, ప్రేరణగాని ఉత్సాహం గాని రాదు సరికదా.. పని చేయాలనే కోరికే నశిస్తుందన్న ప్రశ్న ఉదయిస్తుంది. నిజానికి ఎవరైనా ఫలితానికి బందీ అయితే తమ కర్తవ్యాన్ని సమత్వ బుద్ధితో నిర్వహించడం కష్టమవుతుంది. ఆశించిన ఫలితం వస్తుందో రాదో అనే భయం, ఆందోళన, చికాకు, ఉద్విగ్నత పనితనంపై ప్రభావాన్ని చూపుతూ.. గరిష్ఠ నైపుణ్య సామర్థ్యంతో పని చేయలేక పోవచ్చు. స్వార్థ ప్రయోజనాలను విడిచి పనిచేస్తే, మనపని లోని నాణ్యత ఏ మాత్రం తగ్గకపోగా, మరింత ఉన్నత ప్రమాణాలతో కార్య నిర్వహణ సాధ్యపడుతుందంటాడు కృష్ణుడు. 'కౌశలం' అంటే పనిలో నిబద్ధతతో కూడిన నేర్పు లేదా నైపుణ్యం. దానినే యోగం అంటుంది గీత. ప్రక్రియ ఆధారంగా చేసే పనిలో ఫలితం ఏదైనా సమానంగా తీసుకోవడమే సమత్వం. ఒక దొంగలో నైపుణ్యం ఉన్నా అది ఆదరణీయమా అంటే.. కాదనే చెప్పాల్సి వస్తుంది. నైతిక విలువలు లేని నైపుణ్యాలను గీత ఆదరించదు. సరైన పనిని, సరైన విధానంలో నిర్వహించాలి. దానికి సరైన కారణం ఉండాలి. దానినే కౌశలం అంటారు. భగవద్గీత బద్ధకస్తుడైన సాధారణ వ్యక్తిని, అసాధారణ కార్యసాధనా దక్షునిగా తీర్చిదిద్దేందుకు ఉపకరిస్తుంది.



ఆధ్యాత్మికం

# పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు





**సుల్తానాబాద్, ఏప్రిల్ 23(ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలోని చిన్నబొంకూర్ గ్రామంలో నేడు పండుగ వాతావరణం నెలకొంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా నిర్మించుకున్న నూతన గృహాలకు లబ్ధిదారులు సామూహికంగా గృహప్రవేశాలు చేశారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ విప్ , పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు ముఖ్య అతిథిగా విచ్చేసి, రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నిరుపేదలకు పక్కా గృహం కల్పించాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. చిన్నబొంకూర్ గ్రామానికి చెందిన కూన రాజు శంకర్ - శారద దంపతులు తమ నూతన ఇందిరమ్మ ఇంట్లోకి ప్రవేశించడం సంతోషదాయకమని, అర్హులైన ప్రతి పేదవానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అబ్బోజు కవిత బ్రహ్మాచారి, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు , కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. తమ ఆహ్వానాన్ని మన్నించి విచ్చేసిన ఎమ్మెల్యే విజయ రమణారావు కి లబ్ధిదారులు, గ్రామస్తులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు, అభినందనలు తెలియజేశారు.

## ప్రధాని మోదీపై ఖర్గే వ్యాఖ్యలకు నిరసనగా బీజేపీ ధర్నా: దిష్టిబొమ్మ దహనానికి యత్నం



**సుల్తానాబాద్, (ది క్రైమ్ న్యూస్):** ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ, సుల్తానాబాద్ మండల బీజేపీ శాఖ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. మండల అధ్యక్షులు కందుల శ్రీనివాస్ నేతృత్వంలో బీజేపీ నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మల్లికార్జున ఖర్గే దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ప్రయత్నించగా, పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ నేతలు మాట్లాడుతూ, ప్రధానిని 'టెర్రరిస్ట్' అనడం కాంగ్రెస్ పార్టీ దివాళాకోరుతనానికి పరాకాష్ట అని మండిపడ్డారు. 140 కోట్ల మంది ప్రజల ఆశీర్వాదంతో వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన ప్రధానిని అవమానించడం అంటే ప్రజాస్వామ్యాన్ని, ప్రజా తీర్పును కాలితో తన్నడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టికల్ 370 రద్దు, రామమందిర నిర్మాణం, చంద్రయాన్ వంటి చారిత్రక ఘనతలను జీర్ణించుకోలేకనే కాంగ్రెస్ ఇలాంటి నీచమైన రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించారు. గతంలో 'చాయ్‌వాలా', 'మౌత్ కే సౌదాగర్' వంటి పదాలతో ప్రధానిని కించపరిచిన కాంగ్రెస్, ఇప్పుడు మరోసారి తన అసలు సంస్కృతిని బయటపెట్టుకుందని నేతలు ధ్వజమెత్తారు. ఖర్గే వెంటనే దేశ ప్రజలకు, భారతమాతకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో 2029 ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి అశోక్ రావు, ఉపాధ్యక్షులు సౌదరి మహేందర్ యాదవ్, కోశాధికారి రాజేంద్రప్రసాద్, మాజీ మండల అధ్యక్షులు వేల్పుల రాజన్న పటేల్, కొమ్ము తిరుపతి యాదవ్, మండల ప్రధాన కార్యదర్శులు కోట నాగేశ్వర్, కొల్లూరి సంతోష్ కుమార్ పాల్గొన్నారు. వీరితో పాటు ఉపాధ్యక్షులు దొంగల శ్రీనివాస్ రెడ్డి, దాసరి వెంకటేష్, ఎర్రం సంతోష్ రెడ్డి, యువ మోర్చా నేతలు కొమ్మిడి రాజేందర్ రెడ్డి, ఉషణ అన్వేష్, వడ్లకొండ శశి వర్ధన్ , సీనియర్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జాతీయ స్థాయిలో గోదావరిఖని నారాయణ విద్యార్థుల ప్రభంజనం

- సీనాప్స్ పోటీలలో బంగారు పతకాలు, ల్యాప్‌టాప్‌లు కైవసం




**గోదావరిఖని ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** స్థానిక గోదావరిఖని నారాయణ పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలలో అద్భుత ప్రతిభ కనబరిచి తమ సత్తా చాటారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి వేదికగా మంగళవారం నిర్వహించిన 3వ సీనాప్స్ వార్షికోత్సవ వేడుకలలో భాగంగా జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో గోదావరిఖని నారాయణ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించి అందరి ప్రశంసలు అందుకున్నారు. ఈ పోటీలలో జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు 4వ తరగతి ( ఐ ఎస్ ఈ ఓ విభాగం)ఎస్. శ్రీ వైష్ణవి ఆల్ ఇండియా 1వ ర్యాంక్ సాధించి సంచలనం సృష్టించింది. బి. శ్రీహన్ ఆల్ ఇండియా 4వ ర్యాంక్ సాధించారు. డి. ఆయాన్ కిషన్ ఆల్ ఇండియా 5వ ర్యాంక్ కైవసం చేసుకున్నారు. 7వ తరగతి ( ఆర్ ఓ ఎం విభాగం) సాహిష్ణవ్ జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి ఆల్ ఇండియా 7వ ర్యాంక్ సాధించారు. జాతీయ స్థాయి విజేతలకు నిర్వాహకులు బంగారు పతకాలు , ల్యాప్‌టాప్‌లు ప్రశంసా పత్రాలను అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ, విద్యార్థుల కఠోర శ్రమ, క్రమశిక్షణతో పాటు ఉపాధ్యాయులు అందించిన నాణ్యమైన శిక్షణే ఈ విజయాలకు కారణమని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో తమ పాఠశాల విద్యార్థులు ఇంతటి ఘనత సాధించడం గర్వకారణంగా ఉందని, రాబోయే రోజుల్లో వీరు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ విజేతలకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జీఎం గోపాల్ రెడ్డి తో పాటుగా డీజీఎం వెంకటరమణారెడ్డి, కరీంనగర్ జోన్ ఏజీఎం చైతన్య రావు, ఆర్ ఐ సత్యం రావు, గోదావరిఖని నారాయణ పాఠశాల ప్రిన్సిపల్ ఏ. రజిని, అకాడమిక్ డీన్ గర్రెపల్లి ఆంజనేయులు, విద్యార్థుల వారి తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## డీఎంహెచ్ఓ కార్యాలయ సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

- జీతాల బిల్లులు ప్రాసెస్ చేయడానికి నగదు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు - జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జిల్లా వైద్య ఆరోగ్య అధికారి (డి ఎం హెచ్ ఓ) కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.డి. అజీమ్ ఖాన్‌తో పాటు సీనియర్ అసిస్టెంట్ ఓ. రాము ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఉత్తర్వులు జారీ చేశారు. పెద్దపల్లి జిల్లాలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న కొత్తగా నియమితులైన ల్యాబ్ టెక్నీషియన్ల జీతాలు పోర్టల్‌లో ప్రాసెస్ చేయడం కోసం సంబంధిత అధికారులచే నగదు డిమాండ్ చేసినట్లు ఫిర్యాదులు అందినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ ఫిర్యాదులపై ప్రాథమిక విచారణ నిర్వహించగా, సూపరింటెండెంట్ ఎం.డి. అజీమ్ ఖాన్ మరియు సీనియర్ అసిస్టెంట్ ఓ. రాము జీత బిల్లులు సిద్ధం చేయడం, ప్రాసెస్ చేయడం విషయంలో అక్రమాలు, అధికార దుర్వినియోగం చేసినట్లు తేలినట్లు పేర్కొన్నారు. విచారణలో భాగంగా ల్యాబ్ టెక్నీషియన్ల నుంచి నగదు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు రావడంతో పాటు, సంబంధిత వివరాల్లో అవకతవకలు గుర్తించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు ప్రారంభించినట్లు కలెక్టర్ వెల్లడించారు. అందుబాటులో ఉన్న సాక్ష్యాధారాల పరిశీలన మేరకు, సూపరింటెండెంట్ ఎం.డి. అజీమ్ ఖాన్ మరియు సీనియర్ అసిస్టెంట్ ఓ. రాము ను తక్షణ ప్రభావంతో సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. సస్పెన్షన్ కాలంలో సంబంధిత అధికారులు ముందస్తు అనుమతి లేకుండా హెడ్‌క్వార్టర్స్‌ను వీడరాదని, నిబంధనల ప్రకారం సబ్సిస్టెన్స్ అలవెన్స్ చెల్లించబడుతుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## వడదెబ్బతో ఫోటోగ్రాఫర్ మృతి

**రామగిరి , ఏప్రిల్ 23(ది క్రైమ్ న్యూస్):-** మంథని పట్టణానికి చెందిన శ్రీ రామ ఫోటో స్టూడియో యజమాని గంధం నగేష్ (55) వడదెబ్బతో ఆకస్మికంగా మృతి చెందాడు. గురువారం విధినిర్వహణలో ముత్తారం మండలం రామకృష్ణాపూర్ గ్రామానికి ద్విచక్ర వాహనం పై వెళ్లి కర్ణ వేద కార్యక్రమానికి ఫోటోలు తీసి మధ్యాహ్నం రెండు గంటలకు ఇంటికి వచ్చి అకస్మాత్తుగా పడిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు మంథని ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించగా అప్పటికప్పుడే మృతి చెందారని వైద్యులు ధ్రువీకరించారు. ఫోటోగ్రాఫర్ మూర్తి పట్ల మంథని పట్టణంలోని ఫోటోగ్రాఫర్ల యూనియన్ నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## కరీంనగర్‌లో గజానంద్స్ నాస్టిక్ 'సహజ ఫ్రూట్ పాప్స్' ఘన ప్రారంభం





**కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 23(ది క్రైమ్ న్యూస్):** ప్రకృతి స్వచ్ఛతకు ప్రతీకగా, పూర్తిగా సహజమైన పండ్లతో తయారు చేసిన 'గజానంద్స్ నాస్టిక్' ఫ్రూట్ పాప్స్ విక్రయ కేంద్రాన్ని కరీంనగర్ నగరంలోని భగత్ నగర్, గోదాంగడ్డ రోడ్ వరాహి బాంక్వెట్ హాల్ సమీపంలో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా, మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, సూడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి హాజరై, రిబ్బన్ కట్ చేసి షాపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి మేలు చేసేలా ఎటువంటి రసాయనాలు లేకుండా సహజ సిద్ధమైన పండ్లతో ఇక్కడ రకరకాల ఐస్‌క్రీమ్‌లు, ఫ్రూట్ పాప్స్ అందుబాటులోకి రావడం సంతోషకరమని అన్నారు. నగర వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. షాప్ నిర్వాహకులు సాయినాథ్, సంపత్ మాట్లాడుతూ భాగస్వామ్యంతో ఈ నూతన కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తూ వినియోగదారులకు మేలైన రుచులను అందిస్తామని తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రవళి, వెంకటేష్, శ్రీమాన్, హరీష్, రమేష్, కిరణ్, రాజేశం, సందీప్, రాజమౌళి తదితరులు పాల్గొని నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

## రిపోర్టర్ విశ్వనాథం మాతృమూర్తికి నివాళులర్పించిన డాక్టర్ ఏగోలపు సదయ్య గౌడ్



**సుల్తానాబాద్, ఏప్రిల్ 23(ది క్రైమ్ న్యూస్):** సుల్తానాబాద్ పట్టణానికి చెందిన రాజ్ న్యూస్ , ఎస్ ఛానల్ రిపోర్టర్ చిలగాని విశ్వనాథం మాతృమూర్తి చిలగాని వరలక్ష్మి ఇటీవల మరణించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు డాక్టర్ ఏగోలపు సదయ్య గౌడ్ గురువారం వారి నివాసానికి చేరుకుని, మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు శోకసంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు శ్రవణ్ అయ్యగారు, చిలగాని శివ శరణం, ప్రవీణ్ కుమార్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలు ప్రజల సమిష్టి ఆస్తి ఉత్తమ ఉపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య

- ఊషన్నపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా పిటిఎం
- ప్రతిభావంతులకు పురస్కారాలు






**సుల్తానాబాద్, ఏప్రిల్ 23(ది క్రైమ్ న్యూస్):** ప్రభుత్వ పాఠశాలలు ప్రజల సమిష్టి ఆస్తి అని, ప్రజల సహకారంతోనే అవి ఉన్నత శిఖరాలకు చేరుకుంటాయని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, ఊషన్నపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య అన్నారు. గురువారం పాఠశాల చివరి పని దినాన్ని పురస్కరించుకుని పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. రాష్ట్రస్థాయి తెలుగు పద్యాల పోటీల్లో గెలుపొందిన పొన్నాల శ్రీనిధి, తోట ఆరూహిలకు, అలాగే గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షలో సీట్లు సాధించిన తోట ఆరాధ్య, తోట ఆరూహి, బండారి స్వేచ్ఛ, చీర రుతిక, రితికలకు ప్రత్యేక ప్రశంసా పత్రాలను అందజేశారు. అత్యధిక హాజరు శాతం ఉన్న విద్యార్థులను కూడా అభినందించారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి పాఠశాలను పూర్తిస్థాయిలో ఆధునీకరించనున్నట్లు సమ్మయ్య వెల్లడించారు. 10 కంప్యూటర్లతో కంప్యూటర్ విద్య 1.07 లక్షల విలువైన ఇంటరాక్టివ్ పానెల్ (స్మార్ట్ టీవీ) ద్వారా బోధన. స్మైల్ ఫౌండేషన్ ద్వారా 7 లక్షల విలువైన సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు. విద్యార్థుల సౌకర్యార్థం ప్రతి తరగతి గదిలో ఏసీలు, భద్రత కోసం సీసీ కెమెరాలు. అనంతరం పాఠశాలకు విద్యా సేవలు అందించిన గోపిశెట్టి సుప్రియ, బండారి సరితలను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్పర్సన్ పెండ్లి స్వరూప, ఉపాధ్యాయులు అమృత సురేష్ కుమార్, మంద శ్రీవాణి, ఎడ్ల స్రవంతి, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## హాలియా పురపాలక సంఘం నుంచి దుకాణదారులకు హెచ్చరిక నోటీసులు





**నల్గొండ (ది క్రైమ్ న్యూస్):** హాలియా పురపాలక సంఘం ఆధ్వర్యంలో పట్టణ పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ దుకాణదారులకు నోటీసులు పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి గారి ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి దుకాణదారుడు తమ దుకాణాల నుండి వచ్చే వ్యర్థాలను తడి, పొడి చెత్తగా వేరు చేసి మున్సిపల్ వాహనానికి అందించాలని సూచించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో వ్యాపారులు భాగస్వాములు కావాలని కోరారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే తెలంగాణ మున్సిపాలిటీ చట్టం--2019 సెక్షన్ 123(1),(2), సెక్షన్ 162 మరియు సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ నిబంధనలు--2016 ప్రకారం రూ.1,000 నుంచి రూ.5,000 వరకు జరిమానాలు విధించడంతో పాటు షాప్ లైసెన్స్ రద్దు చేసే చర్యలు తీసుకుంటామని నోటీసులో స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ అంజయ్య, పర్యావరణ ఇంజనీర్ రవికుమార్, జవాన్ అశోక్ తదితర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘోష్ కమిషన్‌పై హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు

**● కాళేశ్వరం పై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం బహిర్గతం ● పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహార్ రెడ్డి**

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ కక్ష సాధింపు చర్యలతో చేసిన తప్పుడు ప్రచారాలకు హైకోర్టు తీర్పు చెంపపెట్టని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహార్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి మనోహార్ రెడ్డి మాట్లాడుతూ ఘోష్ కమిషన్‌పై హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు అని, పై తీర్పు ద్వారా కాళేశ్వరం ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారం బహిర్గతం అయిందన్నారు. గౌరవ హైకోర్టు కమిషన్ నివేదిక సహజ న్యాయ సూత్రాలు, ప్రాథమిక హక్కులు మరియు ఎంక్వైరీ యాక్ట్-1952కు విరుద్ధంగా ఉందని స్పష్టంగా పేర్కొనడం ద్వారా కమిషన్ ఏర్పాటు వెనుక ఉన్న ఉద్దేశాలు బయటపడ్డాయని ఆయన అన్నారు. ఈ తీర్పు రాష్ట్ర ప్రభుత్వానికి గట్టి హెచ్చరికగా నిలిచిందని వ్యాఖ్యానించారు.కాళేశ్వరం ప్రాజెక్టుపై రాజకీయ కక్ష సాధింపుతోనే తప్పుడు ఆరోపణలు చేసి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గారిని అపకీర్తి పరచాలనే ప్రయత్నం జరిగిందని విమర్శించారు. కోర్టు తీర్పుతో ఈ ఆరోపణలు అసత్యమని తేటతెల్లమైందని చెప్పారు.కాళేశ్వరం ప్రాజెక్టు ప్రపంచంలోనే అతిపెద్ద మల్టీ స్టేజ్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులలో ఒకటిగా నిలిచిందని, మూడు బ్యారేజీలు, అనేక రిజర్వాయర్లు, లిఫ్ట్ వ్యవస్థలతో లక్షల ఎకరాలకు సాగునీరు అందించే సామర్థ్యం కలిగి ఉందని వివరించారు. అదేవిధంగా హైదరాబాద్‌కు త్రాగునీరు, పరిశ్రమలకు నీటి సరఫరాలో కూడా ఇది కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.కేవలం మేడిగడ్డ బారేజీ రెండు పిల్లర్ల లోని కొన్ని సాంకేతిక లోపాలను చూపిస్తూ మొత్తం ప్రాజెక్టును తప్పుబట్టడం సరైంది కాదని, దీన్ని రాజకీయంగా ఉపయోగించుకోవడం దురదృష్టకరమని అన్నారు. ఒకవైపు "కూలేశ్వరం" అని విమర్శలు చేయడం, మరోవైపు దానిని పునరుద్ధరిస్తామని చెప్పడం ప్రభుత్వ వైఖరిలో ఉన్న విరుద్ధతను చూపుతోందని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా తప్పుడు ప్రచారాన్ని మానుకుని, కాళేశ్వరం ప్రాజెక్టును



త్వరితగతిన మరమ్మతులు చేసి ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం, సాగునీరు, త్రాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. హైకోర్టు తీర్పుతో సత్యం వెలుగులోకి వచ్చిందని, ఇకపై ప్రజలను మభ్యపెట్టే రాజకీయాలకు తెరపడాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఠాకూర్ రఘువీర్ సింగ్, పెద్దపల్లి పట్టణ అధ్యక్షులు ఉప్పు రాజ్ కుమార్, కౌన్సిలర్ వెన్నం రవీందర్ సుజాత, నాయకులు వంగల తిరుపతిరెడ్డి, నునేటి సంపత్, తానిపర్తి మోహన్ రావు, సందీప్ రావు, బైరెడ్డి రాంరెడ్డి, బోయిని రాజమల్లు, సలేంద్ర రాములు ,సర్పంచులు సర్పంచులు పోల్ రాజు కనకమ్మ, శ్రీనివాస్, బోయిన్ శీను,ఒజ్జ సంపత్, సుల్తానాబాద్ అధ్యక్షుడు గుణపతి, ముత్యాల రాజయ్య,మల్లారం నారాయణ,పెంచల శ్రీధర్, పూదరి చంద్రశేఖర్, కిషోర్, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# రేవంత్‌రెడ్డి అహంకారానికి హైకోర్టు తీర్పు పరాకాష్ట

- హైకోర్టు తీర్పుతోనైనా సీఎం కళ్లు తెరువాలి
- అబద్దాలు మాని పరిపాలనపై దృష్టి పెట్టాలి
- కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్దరణ బాధ్యత దుద్దిళ్ల తీసుకోవాలి
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** సిఎం రేవంత్‌రెడ్డి అహాంకారానికి హైకోర్టు తీర్పు పరాకాష్టగా నిలుస్తుందని, ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ కళ్లు తెరువాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. మంథని పట్టణంలోని రాజగృహాలో హైకోర్టు తీర్పుపై హర్షం వ్యక్తం చేస్తూ స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైకోర్టు తీర్పు తర్వాత పీసీ ఘోష్ కమీషన్ రిపోర్ట్ పీసీసీ స్ట్రిఫ్‌గా నిర్ధారించబడిందని అన్నారు. రేవంత్‌రెడ్డి గొంతుపెద్దగా ఉందని ఒర్రుడు బంద్ చేసి అబద్దాలు ఆడుడు మానేసి పరిపాలనపై దృష్టి పెట్లాలని ఆయన డిమాండ్ చేశారు. గత మూడేళ్లుగా అడ్డూఅదుపు లేకుండా ఒర్రిన సీఎం రేవంత్ రెడ్డి హైకోర్టు తీర్పుతోనైనా కళ్లు తెరువాలని ఆయన అడుగులకు మడుగులు ఒత్తే మంథని ఎమ్మెల్యే కళ్లు తెరుస్తాడని బావిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఏదైనా ప్రాంతానికి ప్రాజెక్టు వస్తే ఆహ్వానించాల్సిన ఆ ప్రాంత ప్రతినిధి కాళేశ్వర ప్రాజెక్టును వ్యతిరేకించడం దుర్మార్గం దౌర్భాగ్యమన్నారు. దాంట్లో ముందు వరుసలో దుద్దిళ్ల శ్రీధర్ నిలబడటం ఆశ్చర్యకరమన్నారు. 150 కిలోమీటర్ల విస్తీర్ణంలో నియోజకవర్గంలోనే నీళ్లు నిలబడి ఉంటున్న ఇంత పెద్ద ప్రాజెక్టుతో పశ్చిమ తూర్పు గోదావరిని తలపించే విధంగా ఈ ప్రాంతం మారుతున్న క్రమంలో ఇద్దరు ఐరల్ లెగ్‌లు రేవంత్‌రెడ్డి, శ్రీధర్‌లు అధికారంలోకి వచ్చి కళ్లలో కారం పోసుకున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ఆనాడు తమ్మిడిశెట్టి వద్ద ప్రాజెక్టు కడితే బాగుంటదని మాట్లాడిన నాయకులు మూడేళ్లయినా ప్రతిపాదన చేయలేదని తట్టెడు మట్టి తీయలేదన్నారు. తమ్మిడిశెట్టి నుంచి మేడిగడ్డకు కేసీఆర్ ఒకరి ఆలోచన కాదని, క్యాబినెట్ నిర్ణయంతో పాటు ఇంజనీరింగ్ నిపుణుల కమిటి లోతైన అధ్యయనం చేసి రిపోర్ట్ ఇచ్చిన తర్వాతనే కేసీఆర్ ప్రభుత్వం మేడిగడ్డ వద్ద బ్యారేజీ మొదలు పెట్టిందని హైకోర్టు తేల్చి చెప్పిందని, ఈ విషయంలో ఇకనైనా అజ్ఞానులకు జ్ఞానం రావాలని ఆయన కోరుకున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై చేస్తున్న దుష్ప్రచారంపై హైకోర్టు కుడా మందలించిందని, కేసీఆర్ అనుమతి లేకుండా ఆయనను అబాసుపాలు చేసేలా దుష్ప్రచారం చేయడం చట్ట విరుద్ధమని, కేసీఆర్, హరీష్‌రావుతో పాటు ఆనాడు పని చేసిన అధికారులను బదనాం చేయడం కూడా చట్ట విరుద్ధమని హైకోర్టు చెప్పినట్లు ఆయన గుర్తు చేశారు. హైకోర్టు తేల్చి చెప్పినా సీఎం రేవంత్‌రెడ్డి కళ్లు తెరువడని, అందుకే రేవంత్‌రెడ్డి బ్యాచ్‌ను దండుపాళం బ్యాచ్ అని కేటీఆర్ అన్నడన్నారు. కాళేశ్వరం పూర్తిగా కొట్టుకుపోయిందని బదనాం చేసినోళ్లు ఈనాడు మేడిగడ్డకు కాన్వాయ్‌తో బ్యారేజ్‌మీద నుంచి పోయి పగుళ్లను చూసి వచ్చి మళ్లీ సభలో మేడిగడ్డ కూలిపోయిందని అనడం హస్యాస్పదన్నారు. రేవంత్‌రెడ్డి కళ్లున్న కబోదిలా మాట్లాడుతున్నాడని అన్నారు. మూడు సార్లు బారీ వర్షాలు, లక్ష క్యూసెక్కుల వరద నీటి తట్టుకుని నిలబడ్డదని, కుంగిపోయింది కానీ ఇంత పెద్ద వరదలు వచ్చినా ఇంచు కదలలేదని ఆయన తెలిపారు.కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో బదనాం చేసిన కాంగ్రెస్ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త నుంచి కేసీఆర్ వరకు దుష్పచారం చేసి అదికారంలోకి వచ్చిండ్లని ఆయన అన్నారు. అయితే ఈసారి వర్షాలు తక్కువగా ఉంటయని నీళ్లకు ఇబ్బంది ఏర్పడుతుందని వాతావరణశాఖ హెచ్చరించినా కాళేశ్వరం ప్రాజెక్టులో నీళ్లు ఆపడం లేదని, ఇప్పటికైనా కాళేశ్వరం ప్రాజెక్టును పునరుద్దరించి రైతులకు, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. ఇంత పెద్ద సమాజం ఓట్లు వేసి గెలిపిస్తే మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ ఈ ప్రాంత ప్రజలు, రైతుల గురించి కనీసం ఆలోచన చేయడం లేదని, వ్యవసాయం, రైతులు అంటే ఆయనకు తెలియదని ఎద్దేవా చేశారు. అనేక ఏండ్లుగా మానేరు, గోదావరినది ద్వారా నీళ్లు వృదాగా పోతున్నా ఈ ప్రాంత ఎమ్మెల్యేగా పరివాహక ప్రాంతాలకు నీళ్లు అందించాలని ఏనాడు ఆలోచన చేయలేదని విమర్శించారు. హైకోర్టు తీర్పుతోనైనా రేవంత్‌రెడ్డి, ఆయన క్యాబినెట్ కళ్లు తెరువాలని, కాళేశ్వరం ప్రాజెక్టు అందరికి శ్రీరామ రక్ష అని గ్రహించి ప్రాజెక్టు పునరుద్దరణకు మంథని ఎమ్మెల్యే పూర్తి బాధ్యత తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలకు అర్థమయ్యే విధంగా బోధన చేయాలి

**● పోటీ ప్రపంచానికి సిద్ధం చేసే బాధ్యత ఉపాధ్యాయులపై ఉంది ● ఎల్కలపల్లి ఎంపీపీ ఎస్ పాఠశాలలో పేరెంట్స్ ● టీచర్స్ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పిల్లలకు వంద శాతం అర్థమయ్యే విధంగా బోధన చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు.పాలకుర్తి మండలం ఎల్కలపల్లి గ్రామంలోని ఎంపీపీ ఎస్ పాఠశాలలో నిర్వహించిన పేరెంట్స్-టీచర్స్ సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థికి 100% అర్థమయ్యే విధంగా పాఠాలు బోధించాలని, దేశ, రాష్ట్ర స్థాయిలో ఎక్కడైనా పోటీలో ముందుండేలా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఇటీవల రాష్ట్ర స్థాయిలో అవార్డు లభించిన నేపథ్యంలో ఉపాధ్యాయులపై బాధ్యతలు మరింత పెరిగాయని, విద్యార్థులు బాగా చదువుతున్నారని, గ్రామస్తులు కూడా ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. ఉపాధ్యాయులు ఇదే ఉత్సాహంతో పనిచేయాలని సూచించారు.విద్యార్థుల చదువు పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, వారి ప్రతిభను వెలికితీయాలని ఉపాధ్యాయులకు సూచించారు. తల్లిదండ్రులు పిల్లలు పాఠశాల నుండి ఇంటికి వచ్చిన తర్వాత చదవడం, రాయడం విషయాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, రోజుకు కనీసం ఒక గంట




ఇంట్లో చదివేలా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడానికి ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని, అందరూ కలిసి పని చేస్తే పాఠశాలలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా గుడిపల్లి శ్రీనివాస్ (ఎన్ఆర్ఐ, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్) రూ.20,000 విలువైన సౌండ్ సిస్టమ్‌ను పాఠశాలకు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఇఓ శారద, కవిత, ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా భగీరథ మహర్షి జయంతి వేడుకలు



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** భగీరథ మహర్షి జయంతిని పురస్కరించుకొని గురువారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ప్రకాష్ నగర్ కాలనీలో 'సాగర సంగం' ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాలింగ్ గౌతమ్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టుదలతో కూడిన కఠోర దీక్షకు భగీరథ మహర్షి నిదర్శనమని, గంగను భూమిపైకి తీసుకువచ్చిన ఆ మహనీయుని ఆశయాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సాగర సంగం సభ్యులు, కాలనీవాసులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఐడీఓసీ పెద్దపల్లిలో ఘనంగా భగీరథ మహర్షి జయంతి

**- భగీరథ మహర్షి సేవలు సమాజానికి ఆదర్శం - అదనపు కలెక్టర్ డి. వేణు**



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ఐడీఓసీ పెద్దపల్లిలో భగీరథ మహర్షి జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో అదనపు కలెక్టర్ డి. వేణు భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డి. వేణు మాట్లాడుతూ, సమాజ హితం కోసం ఆనాడు భగీరథుడు అవిశ్రాంతంగా కృషి చేసి నేటి సమాజానికి కూడా ఆదర్శప్రాయుడయ్యారని కొనియాడారు. మహానీయులను స్మరించుకుంటూ వారి స్ఫూర్తితో ముందుకు సాగేందుకు వీలుగా తెలంగాణ ప్రభుత్వం వారి జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీసీ అభివృద్ధి అధికారి రంగారెడ్డి, అధికారులు, సంఘ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో 'ధి లావిస్' రెస్టారెంట్ రెండో బ్రాంచ్ ప్రారంభం





**కరీంనగర్ టౌన్,ఏప్రిల్ 23(ది క్రైమ్ న్యూస్):** నగరంలోని ముకరంపూర్ సర్కస్ గ్రౌండ్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన 'ధి లావిస్' రెస్టారెంట్ రెండో బ్రాంచ్‌ను కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ గురువారం ఘనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ,డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, 64వ డివిజన్ కార్పొరేటర్ శ్రీజ-అజయ్ తదితరులు పాల్గొన్నారు. రిబ్బన్ కట్ చేసి రెస్టారెంట్‌ను ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నగర ప్రజలకు నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందించేందుకు ఇలాంటి మరిన్ని సంస్థలు రావడం అభినందనీయమన్నారు. యాజమాన్యం రెస్టారెంట్ నిర్వాహకులు మాట్లాడుతూ తమ రెస్టారెంట్‌లో భోజన ప్రియుల కోసం ప్రత్యేకంగా 5 రకాల బిర్యానీలతో పాటు విభిన్న రకాల వంటకాలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. నాణ్యతతో పాటు రుచికి ప్రాధాన్యతనిస్తూ నగర ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తామని అన్నారు.

## పెద్దపల్లిలో రానున్నది బహుజన రాజ్యమే

**- ఏఐఎఫ్ బీ పెద్దపల్లి జిల్లా కన్వీనర్ కొలిపాక శ్రీనివాస్**



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లిలో రానున్నది బహుజన రాజ్యమేనని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ పెద్దపల్లి జిల్లా కన్వీనర్ కొలిపాక శ్రీనివాస్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహ్మద్ మెహరాజ్ కు పార్టీ కండువా కప్పి అలిండియా ఫార్వార్డ్ బ్లాక్ పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కొలిపాక శ్రీనివాస్ మాట్లాడుతూ భవిష్యత్తులో పెద్దపెల్లి నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలందరూ ఏకమై బహుజన రాజ్యాధికార దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. బహుజనులందరిని ఏకం చేసి, వారి ఆశీర్వాదంతో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పెద్దపల్లి ఎమ్మెల్యేగా బరిలో ఉంటానని తెలిపారు. బహుజన బిడ్డనైనా నన్ను దీవించి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త మహమ్మద్ మెహరాజ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందని, అందుకే బహుజన రాజ్యం కోసం ఫార్వర్డ్ పార్టీలో చేరానన్నారు. కొలిపాక శ్రీనివాస్ ఆధ్వర్యంలో బహుజనలంతా ఏకం చేసి ఒక బీసీ బిడ్డ ఎమ్మెల్యేగా చేసే వరకు తన పోరాటం ఆగదన్నారు. ఈ కార్యక్రమంలో కుక్క శ్రావణ్ కుమార్, గులాం ఖాజా పాషా, కుక్క కనకరాజు బొంకూరి నరేందర్, కుక్క అశోక్, ఇరుగురాల రాజు, కుక్క శ్రీనాథ్, వడ్డేపల్లి తిరుమల్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికులకు అండగా ఉంటాం

**- మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య**



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** మున్సిపల్ కార్మికులకు మున్సిపల్ కౌన్సిల్ ఎల్లవేళలా అండగా ఉంటుందని మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య అన్నారు. గత 35 సంవత్సరాలుగా గ్రామ పంచాయతీ అప్పటి నుండి నేటి మున్సిపల్ వరకు శానిటేషన్ కార్మికునిగా సేవలందించిన రెడ్డిమల్ల రాజేశం అనారోగ్య కారణాలతో మరణించగా గురువారం దినకర్మ సందర్బంగా వారి స్వగ్రామం పాలితంలో వారి చిత్రపటానికి పూలమాలలు వేసిన చైర్మన్ నూగిళ్ల మల్లయ్య కార్మికుని కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి సొంతగా 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా మున్సిపల్ సానిటేషన్ కార్మికులు ఉదయం నుండి సాయంత్రం వరకు పెద్దపల్లి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో వారి శ్రమ అభినందనీయమని అందుకుగాను వారి కుటుంబాలకు మున్సిపల్ కౌన్సిల్ ఎల్లవేళలా తోడుంటామని, ఇక నుండి మున్సిపల్ కార్మికుడు ఎవరు చనిపోయిన తనవంతు సహాయంగా 5000 రూపాయలుఅందిస్తానని అన్నారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ జవాన్ జయరాజ్, కార్మికులు సాగర్, రాజయ్య, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులకు అండగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం...

● గింజ కటింగ్ లేకుండా వరి ధాన్యం కొనుగోలు చేస్తాం... ● కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై హైకోర్టు ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదు
● వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణరావు







**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** గింజ కటింగ్ లేకుండా వరి ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. గురువారం కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని మడిపల్లి కాలనీ, పెగడపల్లి, గంగారం, పందిళ్ళ, లక్ష్మీపురం, ఇప్పలపల్లి, అరేపల్లి, తారుపల్లి, మిర్జంపేట తదితర గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్ట్ అవినీతిపై రాష్ట్ర ప్రభుత్వం సిబిఐ విచారణకు అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీర్మానం చేస్తే కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం బిఆర్ఎస్ నాయకులను కాపాడేందుకు ఈ విచారణను కాలయాపన చేస్తుందని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయ రమణరావు అన్నారు. ప్రాజెక్టు విషయంపై కోర్టు ఇచ్చిన తీర్పుతో బిఆర్ఎస్ నాయకులు జబ్బులు చరుచుకుంటున్నారని, కోర్టు తీర్పులో కమిటీ వేయడంలో ప్రభుత్వం తప్పు లేదని, కమిటీ రిపోర్ట్ వాస్తవాలు, అవాస్తవాలు గ్రహించామని కెసిఆర్ హరీష్ రావులను ఇప్పుడే అరెస్టు చేయకండి అని తీర్పు ఇచ్చిందని ప్రభుత్వమును కోర్టు ఎక్కడ తప్పు పట్టలేదన్నారు. మళ్ళీ దానిమీద క్షుణ్ణంగా ఆలోచించండని కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం, కడితే అందులో బుంగలు పడ్డది నిజము కాదా అని ఎమ్మెల్యే విజయ రమణ రావు సూటిగా ప్రశ్నించారు. ఎమ్మెల్యే ఎన్నికల్లో కాళేశ్వరం ప్రాజెక్టు కృంగిన విషయంపై అక్కడికి ఎవరు పోకుండా వారి తప్పులు కప్పిపుచ్చుకోవడానికి బి ఆర్ ఎస్ పారా మిలటరీ దళాలను పెట్టింది కూడా నిజము కాదా అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి ఉమ్మడి జిల్లాల్లో కనీసం 1000 ఎకరాలకు కూడా సాగునీరు ఇవ్వలేదు అన్నారు. మెదక్ జిల్లా కోసం మల్లన్న సాగర్, కొండ పోచమ్మ రిజర్వాయర్ కట్టుకొని ఇక్కడ నీళ్లను తీసుకపోవడానికి ప్రయత్నం చేశారు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినాక కాళేశ్వరం నుంచి చుక్క నీరు కూడా రాలేదని కాంగ్రెస్ ప్రభుత్వం కట్టిన ఎస్సారెస్పీ ప్రాజెక్టు నుంచే సాగునీరు అందుతుంది అన్నారు. ఎస్సారెస్పీ షెటర్లు పోతే గత ప్రభుత్వం ఎక్కడ కూడా ఒక్క షెటర్ కూడా పెట్టలేదు అన్నారు. ఎస్సారెస్పీ ప్రాజెక్ట్ జవహర్ లాల్ నెహ్రూ శంకుస్థాపన చేస్తే ఇందిరాగాంధీ ప్రాజెక్టు ప్రారంభించి కాల్వలను తవ్వించడం జరిగిందని అదే కాలువలకు టిడిపి ప్రభుత్వం లైనింగ్ వేసింది అన్నారు. మీరు ఏమి చేశారన్నది హరీష్ రావు, కేసీఆర్, కేటీఆర్ బహిరంగ చర్చకు రమ్మని అని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే శ్రీపాద ఎల్లంపల్లి, మీడ్ మానేరు, కడెం, ఎస్సారెస్పీ, ప్రాజెక్టులు కట్టడంతో పాటు వరద కాలువలు కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే తవ్వించింది అన్నారు. బండి సంజయ్, కిషన్ రెడ్డి కేంద్ర మంత్రులు కాళేశ్వరం ప్రాజెక్టుపై సిబిఐ విచారణ చేయించండని అన్నారు. బిఆర్ఎస్, బిజెపి ఈ రెండు పార్టీలు ఒకటేనని ఆయన అన్నారు. నేషనల్ డ్యాం అథారిటీ అధికారి కాళేశ్వరం సందర్శిస్తే కేంద్ర మంత్రి బండి సంజయ్ నువ్వెందుకు పోయినావు అనడం హాస్యాస్పదంగా ఉంది అన్నారు. కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని చిత్తశుద్ధి లేని మాటలు, మీ మాటలు వింటుంటే బిఆర్ఎస్, బిజెపి కలిసి పోవాలని ఉన్నట్టుంది అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కూలింది నిజము కాదా దీనికి కిషన్ రెడ్డి బండి సంజయ్ సమాధానం చెప్పాలి అన్నారు. ఈ రాష్ట్రంలో 70 శాతం రైతులు వరి పండిస్తే ఈ వేసంగి లో ఆ వరి బాయిల్డ్ రైస్ తప్ప రా రైస్ కాదని , కానీ కేంద్రం రా రైస్ కొంటాం అంటుందని, ఏ తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఇద్దరు కేంద్ర మంత్రులు ఆరుగురు బిజెపి ఎంపీలు ఉన్న రైతుల పట్ల మీకు ఎలాంటి చిత్త శుద్ధి లేదు అన్నారు. సెంటిమెంట్ రగిలిస్తూ బిజెపి కేంద్రంలో అధికారం చేపడుతుందని రాష్ట్రంలో కేసీఆర్ కూడా సెంటిమెంటుతో 10 సంవత్సరాలు పరిపాలన చేశాడని ఈ సెంటిమెంట్ ఎన్ని రోజులు ఉండదని రాబోయే రోజుల్లో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుంది అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ అవినీతి జరిగిందని సుప్రీం కోర్టు రిటైర్డ్ జడ్జి నివేదిక ఇచ్చారని ఈ నివేదికపై సీఎం రేవంత్ రెడ్డి మంత్రి మండలితో కూర్చొని మాట్లాడడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్ ప్యాక్స్ స్పెషల్ ఆఫీసర్ పి .సురేందర్ రెడ్డి, మానిటరింగ్ అధికారి ఇమ్రాన్ మహమ్మద్, సీఈవో కోలేటి శ్రీనివాస్, ఏ పీఎం లవ కుమార్, మార్కెట్ సెక్రటరీ ప్రేమ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాజన వేన సదయ్య, ఆయా గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచ్ లు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఐకెపి సీసీలు,పలు గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# దేశంలో కనికరం లేని పార్టీ కాంగ్రెస్ పార్టీనే...

**- మానిఫెస్టో హామీలను తుంగలో తొక్కుతున్న మంథని ఎమ్మెల్యే - ఆర్టీసీ కార్మికుల న్యాయబద్ధమైన డిమాండ్లు నెరవేర్చాలే - మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**





**రామగిరి, ఏప్రిల్ 23(ది క్రైమ్ న్యూస్):-** దేశంలో కనికరం లేని పార్టీ ఏదైనా ఉంటే అంటే అది కాంగ్రెస్ పార్టీనేనని, పాకిస్తాన్ తీవ్రవాదుల కంటే ప్రమాదకరమైందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మెకు ఆయన సంఘీబావం తెలుపుతూ గురువారం సమ్మె శిభిరాన్ని ఆయన భూపాలపల్లి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జక్కు శ్రీహర్షిణి తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాకిస్తాన్ తీవ్రవాదులు కనికరం చూపుతారేమో కానీ కాంగ్రెస్ పార్టీ మాత్రం కనికరం చూపదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేనప్పుడు ఎలా ఉంటుందో అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ విధంగా ఉంటుందో చూస్తున్నామని అన్నారు. ఈనాడు ఇంత ప్రజా చైతన్యం, ఏఐ వస్తున్న క్రమంతో పాటు సోషల్ మీడియా ప్రభావం ఉన్నా కూడా కాంగ్రెస్ పార్టీ అవలీలగా అన్యాయం చేస్తుందన్నారు. కళ్ల ముందే అనేక అక్రమాలు, అన్యాయాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఆనాడు ఇందిరాగాంధీ ఎమర్జెన్సీలో ఉన్నట్లుగా ఉందన్నారు. ఎన్నికల సమయంలో మానిఫెస్టోలో అనేక అంశాలతో పాటు ఆర్టీసీ కార్మికులకు సంబంధించిన అంశాలను పొందుపర్చి ఈనాడు వాటిని అమలు చేయకుండా తుంగలో తొక్కుతున్నారని అన్నారు. ప్రజాస్వామ్య రాజ్యాంగ బద్దంగానే పని చేస్తూ మన హక్కుల సాధన కోసం చేస్తున్న పోరాటంలో న్యాయ బద్దత ఉందని, ఈ క్రమంలో పోలీసులు ఇబ్బంది పెట్టడం బాధాకరమని అన్నారు. మట్టిపనికైనా ఇంటోడు కావాలన్నట్లు మనల్ని పాలించే వారు కూడా మనోడే కావాలని ఆయన అన్నారు. ఆనాడు మానిఫెస్టోలో అనేక హామీలు ఇచ్చి మోసం చేసి అధికారంలోకి వచ్చారని, ఇందులో మంథని ఎమ్మెల్యే పాత్ర కీలకమైందన్నారు. దోచుకోవడం దాచుకోవడం...అధికారం పోతే కన్నీళ్లు పెట్టుకోవడం కాంగ్రెస్‌కు అలవాటేనని ఆయన ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ మూలాలను ఏనాడు మర్చిపోవద్దని, అవి ఎన్నటికి మారవని, వాళ్ల మాటలను నమ్మితే నట్టేట ముంచుతరని ముందే చెప్పారని ఆయన గుర్తు చేశారు. మూడు ఓట్లు లేని దుద్దిళ్ల కుటుంబంలో ఐదుసార్లు మంథని ఎమ్మెల్యేగా శ్రీధర్‌ను, ఆయన తండ్రిని మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించి 40 ఏండ్లు అధికారం ఇస్తే ప్రజలను మోసం చేస్తున్న తీరునుద చూసే మానిఫెస్టో కమిటి చైర్మన్‌గా నియమించారని ఆయన విమర్శించారు. మానిఫెస్టో రాసి ఇటు మంథని నియోజకవర్గ ప్రజలతో పాటు యావత్ రాష్ట్ర ప్రజలను మోసం చేసిన చరిత్ర మంథని ఎమ్మెల్యేదని ఆయన అన్నారు.ఆనాడు మానిఫెస్టోలో ఆర్టీసీ కార్మికుల సంక్షేమాన్ని కోరుతూ ప్రభుత్వ అధికారులతో సమానంగా వేతనాలు ఇస్తమని, రెండు పీఆర్సీలు ఇస్తమని, యూనియన్‌లను పునరుద్దరిస్తమని అన్నారని, కానీ ఈనాడు మానిఫెస్టో కమిటి చైర్మన్‌కు ఆ హామీలు గుర్తుకు లేవని విమర్శించారు. మంథని ఎమ్మెల్యే చదువుకున్న వ్యక్తివి అయితే మానిఫెస్టోను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.... ఎన్ని రోజులైనా మీతో పాటే మేముంటాం...జక్కు శ్రీహర్షిణీ రాకేష్, జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ భూపాలపల్లి తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన సమ్మె ఎన్ని రోజులు జరిగినా మీతో పాటే మేం అండగా ఉంటామని భూపాలపల్లి జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ జక్కు శ్రీహర్షిణీ రాకేష్ అన్నారు, మంథని ఆర్టీసీ డిపో ఎదుట సమ్మె చేపట్టిన కార్మికులకు మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్‌తో కలిసి ఆమె సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంథని ఎమ్మెల్యే మానీఫెస్టో కమిటి చైర్మన్‌గా ఆర్టీసీ కార్మికులకు హామీలు ఇచ్చి అవి అమలు చేయడంలో విఫలం అయ్యాడని విమర్శించారు. ఆర్టీసీ కార్మికులు ఏనాడు తమ సమస్యలు విన్నవించుకోలేదని, కానీ కాంగ్రెస్ పార్టీ అధికారం కోసం ఆర్టీసీ కార్మికులకు హామీలు ఇచ్చి మోసం చేశారని అన్నారు. ఆనాడు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేలా గెజిట్ తీసుకువచ్చారని, 95శాతం పూర్తి కాగా మిగిలిన ఐదు శాతం పూర్తి చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఈనాడు మహలక్ష్మి పథకం అమలులోకి వచ్చిన తర్వాత ఆర్టీసీ కార్మికులతో వెట్టి చాకిరి చేయిస్తున్నారని ఆమె దుయ్యబట్టారు. తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం అయ్యే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని ఆమె ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# నేషనల్ ఉర్దూ, ఇంగ్లీష్ మీడియం స్కూల్ వార్షికోత్సవ వేడులు






**కరీంనగర్ టౌన్,ఏప్రిల్ 23(ది క్రైమ్ న్యూస్):** నగరంలోని హుస్సేనిపురలో గల నేషనల్ ఉర్దూ,ఇంగ్లీష్ మీడియం స్కూల్ గ్రాడ్యుయేషన్ వేడుకలు వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాఠశాల విద్యార్థుల ప్రతిభను అభినందించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికేట్లు ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సామీ, స్థానిక కార్పొరేటర్ షేక్ యూసుఫ్, 32వ డివిజన్ కార్పొరేటర్ ఎస్.డి. ముఖద్దర్ హుస్సేన్, 65వ డివిజన్ కార్పొరేటర్ మోసిన్ మోహియుద్దీన్, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# హాలియాలో డిజిటల్ జనాభా గణనకు ఏర్పాట్లు

**- ప్రజలకు సెల్ఫ్ ఎన్యూమరేషన్ అవకాశం**



**నల్గొండ జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 24 ( ది క్రైమ్ న్యూస్):** నల్గొండ జిల్లా హాలియా మున్సిపాలిటీలో జనాభా గణన కార్యక్రమానికి అధికారులు సన్నాహాలు ప్రారంభించారు. ఒక దేశంలోని నిర్దిష్ట ప్రాంతంలో నివసించే ప్రజల సంఖ్యతో పాటు వారి సామాజిక, ఆర్థిక, జీవన ప్రమాణాలకు సంబంధించిన వివరాలను సేకరించి ప్రచురించడాన్ని జనాభా గణనగా పేర్కొంటారు. భారతదేశంలో మొదటి జనాభా గణన 1872లో నిర్వహించబడగా, చట్టబద్ధత లేకుండా జరిగింది. అప్పటి నుండి ఇప్పటివరకు 15 సార్లు గణన పూర్తయింది. ఈ సంవత్సరం నిర్వహించనున్న గణన 16వదిగా నిలవనుంది. స్వాతంత్ర్యం తర్వాత ఇది 8వ జనాభా గణన కావడం విశేషం. ఈసారి తొలిసారిగా డిజిటల్ పద్ధతిలో జనాభా గణన చేపట్టడం మరో ప్రత్యేకతగా నిలిచింది. దేశవ్యాప్తంగా జనాభా గణనను రెండు దశల్లో నిర్వహించనున్నారు. మొదటి దశలో మే 11, 2026 నుండి జూన్ 9, 2026 వరకు ఇళ్ల గణన చేపడతారు. రెండవ దశలో ఫిబ్రవరి 9, 2027 నుండి ఫిబ్రవరి 28, 2027 వరకు వ్యక్తిగత వివరాలను సేకరించనున్నారు. ఈసారి ప్రజలకు స్వయంగా తమ వివరాలను నమోదు చేసుకునే 'సెల్ఫ్ ఎన్యూమరేషన్' సౌకర్యం కల్పించారు. ఏప్రిల్ 26, 2026 నుండి మే 10, 2026 వరకు 15 రోజులపాటు ఈ అవకాశం అందుబాటులో ఉంటుంది. ఇందుకోసం అధికారిక వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. సెల్ఫ్ ఎన్యూమరేషన్ పూర్తిచేసిన వారికి "ఎ" అక్షరంతో ప్రారంభమయ్యే 11 అంకెల కోడ్ లభిస్తుంది. ఎన్యూమరేటర్ ఇంటికి వచ్చినప్పుడు ఆ కోడ్‌ను అందజేస్తే వివరాలు ధృవీకరించి తుది నమోదు పూర్తి చేస్తారు. హాలియా మున్సిపాలిటీ ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ముందుగానే తమ వివరాలను నమోదు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి కోరినారు.

# విధుల్లో నిర్లక్ష్యం, చైన్ మ్యాన్ రఘుకు ఒక ఇన్‌క్రిమెంట్ నిలిపివేత

**- అనధికార గైర్హాజరు భాగంగా రుజువుశాఖాపరమైన విచారణ అనంతరం చర్యలు - ప్రభుత్వ ఉద్యోగులు క్రమశిక్షణ పాటించాలని హెచ్చరిక - జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన చైన్ మ్యాన్ ఈ. రఘు పై శాఖాపరమైన విచారణ పూర్తి చేసి "ఒక ఇన్‌క్రిమెంట్ నిలిపివేత (క్యూములేటివ్ ఎఫెక్ట్ లేకుండా)" శిక్ష విధిస్తూ జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం మంథని రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయంలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న ఈ. రఘు విధుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శిస్తూ, అనుమతి లేకుండా జనవరి 13, 2026 నుండి విధులకు గైర్హాజరైనట్లు గుర్తించామని తెలిపారు. పలు మార్లు మెమోలు జారీ చేసినప్పటికీ ఆయన ప్రవర్తనలో మార్పు కనిపించలేదని పేర్కొన్నారు. ఈ ఘటనపై నిర్వహించిన శాఖాపరమైన విచారణలో, జనవరి 13 మరియు 16 తేదీలకు క్యాజువల్ లీవ్ నమోదు చేయబడినట్లు, జనవరి 14, 15 తేదీలు సెలవు దినాలుగా ఉన్నట్లు తేలిందని, అందువల్ల జనవరి 17, 2026 నుండి అనధికార గైర్హాజరు నిర్ధారణకు వచ్చినట్లు వివరించారు. విచారణలో ఆరోపణలు భాగంగా రుజువైన నేపథ్యంలో సంబంధిత అధికారిపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. దీననుసరించి, తెలంగాణ సివిల్ సర్వీసెస్ (సీసీఏ) నిబంధనల ప్రకారం పై శిక్ష విధించడమే కాకుండా, గైర్హాజరు కాలాన్ని అర్హత గల సెలవులతో సమన్వయం చేసి సర్వీస్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.ప్రభుత్వ ఉద్యోగులు విధుల పట్ల బాధ్యతతో వ్యవహరించాలని, నిర్లక్ష్యం ప్రదర్శించే వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు.

# ఆర్టీసీ కార్మికుల సమ్మెకు సంపూర్ణ మద్దతు

**- హామీలు అమలు చేయాలి - మాటలు గాలిలో కలిసాయా? - ఆర్టీసీ కార్మికుల ఆవేదన - పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొంటా- కట్కూరి సందీప్**



**బ్యూరో,(ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా రాజకీయ వర్గాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మెకు పెద్దపల్లి పార్లమెంట్ ఎంపీ కంటెస్టెడ్ అభ్యర్థి కట్కూరి సందీప్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ కార్మికులకు పలు కీలక హామీలు ఇచ్చిందని ఆయన గుర్తుచేశారు. ఆ హామీలలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ బకాయిలను వెంటనే చెల్లించడం, ప్రభుత్వ ఉద్యోగులతో సమాన వసతులు కల్పించడం, యూనియన్ల పునరుద్ధరణ వంటి అంశాలు ఉన్నాయని తెలిపారు. ప్రజా పాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఆర్టీసీ కార్మికుల ఆశలను నెరవేర్చడంలో విఫలమైందని సందీప్ తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోందని, కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆర్టీసీ కార్మికులు తమ హక్కుల కోసం చేపట్టిన ఈ సమ్మె న్యాయబద్ధమైనదని పేర్కొంటూ, వారి పోరాటానికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. అంతేకాకుండా, కార్మికుల ఆందోళనల్లో తాను ప్రత్యక్షంగా పాల్గొంటానని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆర్టీసీ కార్మికుల సమ్మె రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారగా, రాజకీయ నాయకుల మద్దతు ఈ పోరాటానికి మరింత ఊపునిస్తుందనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

# బేగంపేట గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం

**-గ్రామ సర్పంచ్ మంతెన చంటి**



**రామగిరి, ఏప్రిల్ 23(ది క్రైమ్ న్యూస్):-** రామగిరి మండలం బేగంపేట గ్రామపంచాయతీ పరిధిలోని వడ్ల కొనుగోలు కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ మంతెన చంటి, ఉప సర్పంచ్ సందేల రేణుక కుమార్ స్వామి ఆధ్వర్యంలో ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యానికి సరైన ధర లభించేలా, కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా సాగేందుకు ఈ కేంద్రం ఉపయోగపడుతుందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మంతెన చంటి, ఉప సర్పంచ్ సందేల రేణుక కుమార్ స్వామి, వార్డు సభ్యులు ప్రశాంత్, సౌందర్య, సంజీవ్, సతీష్, శ్రీనివాస్, కిరణ్, గ్రామ ప్రజలు, గ్రామ రైతులు హమాలి సంఘం అందరూ పాల్గొనడం జరిగింది.

# కాటారం డిజాస్టర్.. జగిత్యాల బ్లాక్ బస్టర్

● ఒకేరోజు అగ్ర హీరోల రెండు సినిమాలు రిలీజ్ ● తూర్పులో కాటారం రైతు మహోత్సవం ● పశ్చిమలో జగిత్యాల జనగర్జన - ఒకటి డిజాస్టర్ ఫస్ట్ షో కే ఫ్లాప్ ● రెండోది హౌస్ ఫుల్ ఫస్ట్ డే రికార్డ్ ఇండస్ట్రీ హిట్ ● అధికారం ఉంటే హిట్టు రాదు ● కంటెంట్ తోనే కలెక్షన్ ● రాజకీయరంగంలో బాహుబలి ఎవరు? ● ఇరుపక్షాల అగ్ర నేతల భారీ బహిరంగ సభలపై ది క్రైమ్ న్యూస్ ప్రత్యేక కథనం...

**బ్యూరో,(ది క్రైమ్ న్యూస్):** పండగల సీజన్లో అగ్ర కథానాయకుల సినిమాలు రావడం మనందరికీ తెలుసు. సరిగ్గా అలాంటిదే రాజకీయ రంగస్థలం మీద ఇద్దరు రాటు తేలిన అగ్ర నాయకుల సినిమాలు( సభలు ) ఒకేసారి విడుదలై తెలంగాణ పొలిటికల్ బాక్సాఫీస్ వార్ సాగింది.

ఒకవైపు కాంగ్రెస్ ఆర్ట్ క్రియేషన్స్ బ్యానర్ పై వచ్చిన "కాటారం రైతు ఉత్సవాలు"... మరోవైపు బిఆర్ఎస్ ప్రొడక్షన్స్ నుంచి రిలీజ్ అయిన "జగిత్యాల జనగర్జన ". ఇద్దరూ స్టార్ హీరోలే... ఒకరు రేవంత్ రెడ్డి మరొకరు కెసిఆర్... బడా సెటప్... భారీ అంచనాలు, కానీ ఫలితం మాత్రం భూమికి ఆకాశానికి ఉన్నంత తేడా!

కాటారం సినిమా మొదలయ్యాక మొదట్లో కాస్త సైలెన్స్, ఇంకా ఏదైనా ఉంటుందేమో! అనుకున్న ప్రేక్షకులు పేర్లు పడేదాకా ప్రశాంతంగానే కూర్చున్నారు. కానీ హీరో తెరమీదకు రాగానే ఆక్రోషంతో ఊగిపోతూ... టైటిల్ కు- కథకు సంబంధం లేకుండా తేల్చుకుందాం, చూసుకుందాం, పాతరేస్తా, లేకుంట చేస్తా, రాకుంట చూస్తా ఇదే నా శపథం అంటూ నాలుగు భారీ డైలాగులు( శాపనార్ధాలు ) చెప్పగానే... ఇది సినిమా కాదు బాబోయ్ టైటిల్ కు తగ్గట్టు కంటెంట్ లేదంటూ ప్రేక్షకులు అందరూ టిక్కెట్లు చింపి బయటకు తోసుకుంటూ పరుగులు తీశారు. గేట్లు మూసి ఉంటే నెట్టుకొని మరి అవతలపడ్డారు. అదే సమయంలో జగిత్యాల సినిమా థియేటర్లో మాత్రం సీన్ రివర్స్. హీరో స్టేజ్ ఎక్కినప్పటి నుంచి ఇంకేం చెబుతాడో అన్న ఆసక్తి, క్లైమాక్స్ వరకు కళ్ళు మూయకుండా చూసిన జనం, శుభం కార్డు పడేదాకా ఫుల్ సిట్టింగ్. కేరింతలు, సప్పట్లతో జన గర్జన అనే పేరుకు




తగ్గట్టుగా ప్రజల సమస్యలు, భావోద్వేగాలతో థియేటర్ మారు మోగిపోయింది. ఒరిజినల్ సినిమా రంగంలో స్టార్ హీరోలు కూడా ముహూర్తాలు చూసుకుని రిలీజ్ డేట్స్ మార్చుకుంటారు. ఒకరి మీద ఒకరికి పోటీ ఉన్నా కూడా వ్యాపారం దెబ్బతినేలాగా వ్యవహరించరు. ఎందుకంటే వాళ్ళది బిజినెస్ మైండ్. కానీ రాజకీయాల్లో మాత్రం అలా ఉండదు.ఇక్కడ ఈగో రిలీజ్ అయింది. జగిత్యాల జనగర్జన సినిమా డేట్స్ ముందే ఫిక్స్ అయ్యిందని తెలిసినా... కాటారం టీమ్ హడావిడిగా స్క్రిప్టు, డైలాగులు, మ్యూజిక్ అన్నీ ఆఖరి నిమిషం ఎడిటింగ్ లా కూర్చి ఆగ మేఘాల మీద అదే రోజు రిలీజ్ చేసింది. ఫలితం.. పంచ్ డైలాగులు లేవు, హిట్ సాంగ్స్ లేవు, హీరోలో గ్లామర్ లేదు, కథలో బలం లేదు. కానీ జగిత్యాల మూవీ మాత్రం పక్కా ప్లానింగ్ తో రిలీజ్ అయింది. సెంటిమెంటుకు అధిక ప్రాధాన్యతను ఇచ్చే జగిత్యాల మూవీ హీరో బలమైన స్క్రిప్ట్ రాసుకున్నాడు, అంతే కాదు అనుభవజ్ఞుడైన డైరెక్టర్, మాస్ తో కలిపి క్లాస్ మ్యూజిక్, ఇదే కాకుండా జనాలతో ఈజీగా కనెక్ట్ అయ్యే కథ ఎంచుకోవడంతో అసాధారణ హిట్ కొట్టింది. బాహుబలి రేంజ్ రాజకీయ బ్లాక్ బస్టర్ సినిమా అయింది. ఇప్పుడు గ్రామాల్లో రచ్చబండల దగ్గర చెట్ల కింద ఇదే టాపిక్ నడుస్తున్నది.

కాటారం సినిమా పోస్టర్ హిట్- కంటెంట్ ఫ్లాప్. జగిత్యాల సినిమా కంటెంట్ హిట్- కలెక్షన్స్ బంపర్ అంటూ ముచ్చట్లు పెట్టుకుంటున్నారు. చెడపకురా చెడేవు అన్నట్టు ఇతరుల స్క్రిప్ట్ చూసి రిలీజ్ డేట్ ఫిక్స్ చేస్తే బాక్స్ ఆఫీస్ దగ్గర బోల్తా పడటం ఖాయం అనడంతో పాటు, జగిత్యాల సినిమా హీరోనే రాజకీయ బాహుబలి అంటున్నారు ఇదంతా గమనించిన సామాన్య జనాలు.

# కార్మికుల సమస్యలు సేకరించి పరిష్కారానికి కృషి చేస్తాం

● ప్రాతినిధ్య సంఘం ప్రతినిధులతో ఏరియా స్థాయి నిర్మాణాత్మక సమావేశం ● అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు

**రామగిరి, ఏప్రిల్ 23(ది క్రైమ్ న్యూస్):-** రామగుండం-త్రీ , అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలో ప్రాతినిధ్య సంఘం అయినటువంటి సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ ఐఎన్టియుసి ప్రతినిధులతో గురువారం జి.యం. కార్యాలయంలో ఏరియా స్థాయి నిర్మాణాత్మక సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో భాగంగా ఏరియాకు సంబంధించిన పలు అంశాలపై అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు తో ప్రాతినిధ్య సంఘం ఏరియా ఉపాధ్యక్షులు కోట రవీందర్ రెడ్డి, ఇతర సభ్యులు చర్చించారు. ఈ సమావేశంలో సెంటినరీ కాలనీ రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణం నందు గల సి ఈ ఆర్ క్లబ్ కొరకు రూములు ఏర్పాటు చేయడం, ఇండోర్ స్టేడియం పక్కన డైనింగ్ హాల్, బాత్రూంలో ఏర్పాటు చేయడం, ఓసిపి-టు లో ఆధునిక పద్ధతిలో ల్యాంప్ రూమ్ ఏర్పాటు చేయడం, సెంటినరీ కాలనీలోని జోన్-వన్ , జోన్-త్రీ , క్వార్టర్లలో ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేయడం, ఓసిపి-వన్ సిహెచ్ పి చెక్ పోస్ట్ నుండి సైట్ ఆఫీస్ వరకు వెళ్లే రోడ్డుకి డాంబర్ కోటింగ్ వేయించడం, ఉద్యోగులందరికీ సీఎం పిఎఫ్ చిట్టీలు ఇవ్వడం, స్థానిక రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణం లో వాకింగ్ ట్రాక్ కొరకు పోసిన మట్టిలో బండలు తొలగించడం, ఓసిపి-టు ఉపరితల గనిలో గల 12 డోజర్లలో ఏసీలు పనిచేసే విధంగా చూడడం, వాటిని బ్రేక్ డౌన్ కాకుండా చర్యలు తీసుకోవడం, ఆర్ జి త్రీ, ఏపీ ఏ ఎరియాలో లాంప్ రూమ్ సి ఎస్ ఎల్ పోస్టును నోటిఫికేషన్ వేసి ఖాళీలను భర్తీ చేయడం, ఓసిపి-టు క్యాంటీన్, ఆఫీస్ కొరకు ఫర్నిచర్ సాంక్షన్ అయి ఉంది వెంటనే కొనుగోలు చేయడం, జీఎం కార్యాలయం నందు టూ వీలర్, ఫోర్ వీలర్ పార్కింగ్ షెడ్ పాడైపోయి ఉంది దానిని మరమ్మతులు చేయించడం లాంటి అంశాలపై చర్చించారు. ఈ



సందర్భంగా జిఎం మాట్లాడుతూ ఏరియా పరిధిలో ఉన్న సమస్యలను సంబంధిత అధికారుల ద్వారా వివరాలను సేకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. అదేవిధంగా కార్పోరేట్ కార్యాలయ పరిధిలో ఉన్న సమస్యలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.ఈ సమావేశంలో స్ట్రక్చరల్ కమిటీ సభ్యులు రామారావు, సాయికృష్ణ, శ్రీనివాస్ రావు, ఎస్వోటుజిఎం బి.వి.సత్య నారాయణ, ఏరియా ఇంజినీర్ సుధాకర్ రెడ్డి, ప్రాజెక్ట్ ఆఫీసర్లు ప్రవీణ్ వి ఫ్యాటింగ్, జె.రాజశేఖర్, ఐ ఇ డిజియం బి.టి. మురళీ కృష్ణ, సివిల్ డిజియం రాజేంద్ర కుమార్, సిహెచ్పి డిజియం కాశీ విశ్వేశ్వర రావు, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, పర్చేస్ ఎస్ ఈ రవి చరణ్, ప్రాజెక్ట్ ఇంజనీర్లు ఉదయ్ భాస్కర్, చంద్ర శేఖర్, డివై పి యం సునీల్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# రైతు సమస్యలపై రాజీ పడే ప్రసక్తి లేదు ప్రతి గింజ కొనుగోలు చేస్తాం

**- కొనుగోలు జరిపిన వెంటనే ఖాతాలోకి డబ్బులు జమ -ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు**

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** రైతుల నుండి గింజ కటింగ్ లు లేకుండా వడ్ల కొనుగోలు చేసే విషయంలో రాష్ట్రంలోనే పెద్దపల్లి నియోజకవర్గం అగ్రభాగాన నిలుస్తోందని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. పెద్దపల్లి మండలం పాల్తెం, కాసుల పల్లె, గోపయ్యపల్లి, కాపుల పల్లె, కనగర్తి, బొంపెల్లి, మేడిపల్లి తదితర గ్రామాల్లో ఏర్పాటుచేసిన వడ్ల కొనుగోలు సెంటర్లను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుల నుండి కటింగుల పేరిట కొనుగోలు సెంటర్లలో ధాన్యంను నిలువు దోపిడి చేశారని అన్నారు. ఆరుగాలం కష్టపడి రక్తాన్ని చెమటగా మార్చి రైతులు పండించిన పంటలను కటింగుల పేరిట బిఆర్ఎస్ పెద్దలు దోచుకు తిన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సమస్యల విషయంలో తాను ఏనాడు రాజీ పడేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో రైతులకు కూడా సంపూర్ణ మైన నమ్మకం విశ్వాసం తనపై ఉందన్నారు. పెద్దపల్లి నియోజకవర్గంలోని ప్రతి ఒక్క రైతు కూడా తనను రైతుబిడ్డగా చూడటం సంతోషంగా ఉందన్నారు. రైతుల విశ్వాసం పూర్తిగా చూరగొనడం తన అదృష్టమన్నారు. అయితే రైతు సమస్యలను పరిష్కరించడంలో తన కష్టాన్ని కూడా గుర్తించాలని ఆయన ప్రజలను కోరారు. కొనుగోళ్ల విషయంలో రైస్ మిల్లర్ నుండి ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని కోరారు. సన్న వడ్లకు బోనస్ అందించిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అలాగే, రైతు భరోసా విషయంలో జరుగుతున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని ఆయన కోరారు. విడతల వారిగా రైతు భరోసా ను ప్రభుత్వం విడుదల చేస్తోందని చెప్పారు. అలాగే సెంటర్లలో కొనుగోలు పూర్తయిన వెంటనే ఒకటి రెండు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడం జరుగుతుందన్నారు. ఈ విషయంలో గతంలో పోలిస్తే బిఆర్ఎస్ హయాంలో



రోజుల తరబడి డబ్బుల కోసం రైతులు పడిగాపులు కాశారని అన్నారు. రైతులు తరచూ వరి పంట కాకుండా పంటల మార్పిడి పై శ్రద్ధ చూపాలని కోరారు. సేంద్రియ ఎరువులను వాడితే భూసారం పెరుగుతుందన్నారు. పెద్దపల్లి నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి అలుపెరుగని కృషి చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఇంటింటికి ఇసుకను సులభతరం చేసిన ఘనత కూడా తమదేనన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చేందుకు అహోరాత్రులు కష్టపడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కూర మల్లారెడ్డి, మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య, ఏదేల్లి శంకర్, ఆరే సంతోష్, బండారు రామ్మూర్తి, ఆర్కోటి సంతోష్, అంజి నాయక్,ముత్యాల నరేష్ మల్లేష్,తదితరులు పాల్గొన్నారు.

## కొత్త నైపుణ్యాల ద్వారా ఉపాధి అవకాశాలు

**- బసంత్ నగర్ అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ అధిపతి మందల శ్రీనివాస్ రెడ్డి**



**రామగిరి, ఏప్రిల్ 23(ది క్రైమ్ న్యూస్):-** వేగంగా మారుతున్న సాంకేతికాభివృద్ధిని పుణికిపుచుకోవాలని, నిత్యం అప్డేట్ అవుతూ సృజనాత్మకతను పెంపొందించుకోవాలని బసంత్నగర్ అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ అధిపతి మందల శ్రీనివాస్ రెడ్డి విద్యార్థులకు పిలుపునిచ్చారు. మంథని జేఎన్టియు ఇంజనీరింగ్ కళాశాల వార్షిక క్రీడా దినోత్సవం ప్రిన్స్ పాల్ బి విష్ణువర్ధన్ అధ్యక్షతన జరగగా ముఖ్యఅతిధిగా శ్రీనివాస్ రెడ్డి హాజరై ప్రసంగించారు. విదార్థుల్లో కొరవడిన సామాజిక స్పృహను అధ్యాపకులు బాధ్యతగా తీసుకొని పెంచాలన్నారు. విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాముఖ్యత ఇవ్వాలన్నారు. నిత్యం ఏదో ఒక ఆటను ఆడడం దినచర్యలో భాగం చేసుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ మాట్లాడుతూ క్రీడలకు అన్ని సౌకర్యాలు ఉన్నా విద్యార్థుల ప్రాతినిధ్యం తక్కువగా ఉండడం బాధకరమన్నారు. క్రీడలకు కావాల్సిన సౌకర్యాలు సమకూర్చడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. సెల్ ఫోన్లు మానేసి క్రీడలపై మమకారం పెంచుకోవాలన్నారు. క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఛాంపియన్లుగా ఫైనలియర్ మెకానికల్ ఎల్ సత్యసాయి, సిఎస్ఇ మైత్రిలు నిలిచారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎం ఉదయ్కుమార్, ఫిజికల్ డైరెక్టర్లు పింగిళి కృష్ణారెడ్డి, జి సునీల్ కుమార్, టీచింగ్, నాన్టీచింగ్, విద్యార్థులు పాల్గోన్నారు.

## పెసర పిండితో ఇలా చేస్తే ముఖంపై జిడ్డు, మృతకణాలు మాయం..! అదిరి పోయే అందం మీ సొంతం..

మన వంటింట్లో లభించే సహజ సిద్ధమైన పదార్థాలు మన చర్మ సౌందర్యాన్ని పెంచడమే, చర్మం ఎంతో ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి. ఇందులో పెసలు మన చర్మ సౌందర్యాన్ని పెంచడంలో చక్కగా పని చేస్తుందని చెబుతున్నారు. చర్మానికి ఇది చేసే మేలు అంతా ఇంతా కాదు. చర్మాన్ని మృదువుగా చేయడంలోనూ, చర్మానికి మెరుపును ఇవ్వడంలోనూ, చక్కటి రంగు తేలేలా చేయడం లోనూ పెసర్లు చక్కగా పని చేస్తాయి. ఇందుకోసం కొద్దిగా పెసరపప్పు తీసుకుని బాగా ఎండబెట్టి పొడిలా చేసుకుని నిలువ చేసుకోవాలి. దీనిని ఫేస్ ప్యాక్ లాగా వేసుకోవాలి అనుకున్నప్పుడల్లా ఆ పెసరపిండిని వినియోగించుకోవచ్చు. రెండు టీ స్పూన్ల పెసరపప్పు పొడిని తీసుకొని అందులో కాస్త పసుపు వేసుకోవాలి. అందులో కావాల్సినంతా మోతాదులో పచ్చిపాలను కలుపుకుంటూ మెత్తటి పేస్ట్ లా తయారు చేసుకోవాలి. ఇపుడు ఆ మిశ్రమాన్ని ఫేస్ ప్యాక్లా ముఖానికి అప్లై చేసుకోవాలి. ఆ తర్వాత పదిహేను ఇరవై నిమిషాలకు ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి... ఇలా వారానికి రెండు మూడు సార్లు చేయడం వలన చక్కటి ఫలితాలను పొందగలరు. మూడు టీ స్పూన్ల పెసరపిండి, ఒక టీ స్పూను బియ్యప్పిండి, కొద్దిగా పసుపు వేసి దానికి రోజ్ వాటర్ కలిపి మెత్తని పేస్ట్ లా చేసుకోవాలి. తర్వాత ఆ పేస్ట్ ను ముఖానికి అప్లై చేసుకుంటూ బాగా మసాజ్ చేయాలి. ఇలా చేయడం వలన చర్మ రంధ్రాలోని మురికి, బ్యాక్టీరియా పోయి చర్మం కాంతి వంతంగా కనిపిస్తుంది. చర్మం బరకగా కనిపిస్తుంటే ఇబ్బందిగా ఉంటుంది. అలాంటప్పుడు కప్పు పెసర పిండిలో చెంచా నిమ్మరసం, చెంచా ఆలివ్ నూనె కలిపి ఆ మిశ్రమాన్ని ఒంటికి పట్టించి నలుగులా రుద్దుకోవాలి. ఇలా రోజూ చేస్తుంటే మృతకణాలు తొలగి చర్మం నునుపుగా మారుతుంది.

## కల్వచర్లలో శ్రీ సత్య సాయి ఆరాధనోత్సవాలు

**-101 నిమిషాల పాటు స్వామినామ కీర్తన భజన**

**- ఉమామహేశ్వర ఆలయంలో హనుమాన్ దీక్ష పరులకు అల్పాహార విందు**

**- కల్వచర్ల శ్రీ సత్య సాయి భజన మండలి కన్వీనర్ నూక రమేష్**



**రామగిరి, ఏప్రిల్ 23(ది క్రైమ్ న్యూస్):-** భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారు తన భౌతిక దేహాన్ని వదిలివేసి మహాసమాధి చెందిన ఏప్రిల్ 24 రోజును స్మరించుకుంటూ భక్తులు జరుపుకునే పవిత్రమైన వార్షిక కార్యక్రమం శ్రీ సత్య సాయి ఆరాధన ఉత్సవం రోజున బాబా బోధనలను, ప్రేమ, సేవ, సత్యం అనే సందేశాలను ఆచరిస్తూ, ఆయనకు కృతజ్ఞతలు తెలుపే ఈ ఆరాధన దినోత్సవం సందర్భంగా కల్వచర్ల సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో కలవచర్ల బస్టాండు వద్దగల సాయి నిలయంలో 101 నిమిషాల స్వామి నామ కీర్తన భజన కార్యక్రమం గురువారం సాయంత్రం ఆధ్యాత్మికంగా సాయి భక్తులు నిర్వహించారు. అనంతరం కల్వచర్ల ఉమామహేశ్వర ఆలయంలోని హనుమాన్ దీక్షపరులకు అల్పాహార విందును ఏర్పాటు చేశారు. అలాగే శుక్రవారం ఉదయం ఓంకారంతో సుప్రభాతం, నగర సంకీర్తన మరియు ప్రత్యేక పూజా కార్యక్రమాలతోపాటు పేదలకు నారాయణ సేవలో భాగంగా అమృత కలషాల పేరిట ఆహార వస్తువులు పంపిణి, వారసంతలో మజ్జిగ పంపిణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని కన్వీనర్ నూక రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కలవచర్ల శివరామకృష్ణ భజన మండలి, సత్యసాయి సేవాదళ్ సభ్యులు, సాయి భక్తులు పాల్గొన్నారు.

## అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవు

**- పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి - గోదావరిఖని, మంథని డిపోల సందర్శన**





**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి హెచ్చరించారు. గురువారం తెలంగాణ రాష్ట్రంలో ఆర్టీసీ బంద్ పిలుపు నేపథ్యంలో రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ పరిధిలోని గోదావరిఖని, మంథని ఆర్టీసీ డిపోలను పోలీస్ అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా డిపోలలో పరిస్థితులను సమీక్షించి, ఆర్టీసీ ఉద్యోగులతో ప్రత్యక్షంగా మాట్లాడారు. డీసీపీ మాట్లాడుతూ సమ్మెను ప్రజాస్వామ్యపరమైన హక్కుగా గౌరవిస్తున్నప్పటికీ అది పూర్తిగా శాంతియుత వాతావరణంలోనే నిర్వహించుకోవాలని సూచించారు. బంద్ సమయంలో ఎటువంటి ఉద్రిక్తతలు లేదా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అందరూ సహకరించాలని కోరారు. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నించినా, ప్రభుత్వ లేదా ప్రైవేట్ ఆస్తులకు నష్టం కలిగించినా, అధికారులపై దాడులకు పాల్పడినా అలాంటి వారిపై కఠినంగా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రైవేట్ డ్రైవర్లు తాత్కాలికంగా విధుల్లో చేరినా, అలాగే ఆర్టీసీ డ్రైవర్లు తిరిగి డ్యూటీలో చేరినా వారికి ఎటువంటి బెదిరింపులు లేకుండా పోలీస్ శాఖ తరఫున పూర్తి భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు. విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బంది నిరంతర పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. ఈ సందర్శనలో గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, గోదావరిఖని వన్టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, మంథని సీఐ బి. రాజు, ఎస్సై రమేష్, ఆర్టీసీ డీఎంలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు

**- సర్పంచ్ పల్లె పల్లె ప్రతిమ- పీవీ రావు**






**రామగిరి, ఏప్రిల్ 23(ది క్రైమ్ న్యూస్):-** ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన సౌకర్యాలు ఉన్నాయని రత్నాపూర్ సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీ రావు అన్నారు. రామగిరి మండలం రత్నాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయుడు బుర్రి శ్యామ్ ఆధ్వర్యంలో జరిగిన పాఠశాల వార్షికోత్సవ, ఫెరివలు డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పల్లె ప్రతిమా పీవీరావు మాట్లాడుతూ పిల్లలు వేసవి సెలవులలో జాగ్రత్తగా ఉండాలని కోరారు. ముఖ్యంగా సెల్ ఫోన్ కు దూరంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక , నృత్య పోటీలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులను సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కనకం. స్వామి, మురళయ్యా, రాజమౌళి, తిరుపతి,శ్రీకాంత్, మహేష్, ఓదేలు, లక్ష్మణ్, కవిత, లావణ్య, రవళీ పాల్గొన్నారు.

# స్పోర్ట్స్

# ఐపీఎల్ పాయింట్స్ టేబుల్‌లో పంజాబ్ హవా



ఐపీఎల్ మ్యాచ్‌లు క్రికెట్ ఫ్యాన్స్‌కు మస్త్ మజాను అందిస్తున్నాయి. ఫోర్లు, సిక్సర్లతో బ్యాట్స్‌మెన్లు హోరెత్తిస్తుంటే.. అదిరిపోయే బంతులతో బౌలర్లు దుమ్ములేపుతున్నారు. మొదట్లో బ్యాట్స్‌మెన్ పూర్తి ఆధిపత్యం చెలాయించగా.. ఇప్పుడు బౌలర్ల హవా మొదలైంది. బుధవారం లక్నోలోని ఎకానా క్రికెట్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్, లక్నో సూపర్ జెయింట్స్ మ్యాచ్‌లో బౌలర్ల హవా కొనసాగింది. మొదట బ్యాటింగ్ చేసిన రాజస్థాన్.. ఆరు వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. అనంతరం లక్నో జట్టు 18 ఓవర్లలో కేవలం 119 పరుగులకే ఔట్ అయింది. ఇప్పటివరకు అన్ని జట్లు ఆరు మ్యాచ్‌లు ఆడేయగా.. కొన్ని జట్లు 7 మ్యాచ్‌లు కూడా ఆడేశాయి. పంజాబ్ కింగ్స్ ఈ సీజన్‌లో కూడా దూసుకెళ్తోంది. ఆడిన ఆరు మ్యాచ్‌ల్లో ఐదు విజయాలు సాధించగా.. ఒక మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. 11 పాయింట్లతో టాప్ ప్లేస్‌లో నిలిచింది. లక్నోపై విజయంతో రాజస్థాన్ రాయల్స్ రెండోస్థానానికి చేరింది. 7 మ్యాచ్‌ల్లో ఐదు విజయాలు సాధించింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఐదు మ్యాచ్‌ల్లో నాలుగు మ్యాచ్‌ల్లో విజయం సాధించి.. 8 పాయింట్లతో మూడోస్థానంలో ఉంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ 7 మ్యాచ్‌లు ఆడగా.. నాలుగు విజయాలు సాధించింది. 8 పాయింట్లతో నాలుగోస్థానంలో ఉంది. ఢిల్లీ క్యాపిటల్స్ టీమ్ 5 మ్యాచ్‌లు ఆడగా.. మూడింట గెలుపొందింది. ఢిల్లీ ఖాతాలో ఆరు పాయింట్లు ఉండగా.. పాయింట్ల పట్టికలో ఐదోస్థానంలో ఉంది. గుజరాత్ టైటాన్స్ ఐదు మ్యాచ్‌ల్లో మూడు విజయాలతో ఆరోస్థానంలో ఉంది. ఈ సీజన్‌లో తొలి మ్యాచ్‌లో గెలుపొందిన ముంబై ఇండియన్స్.. ఆ తరువాత వరుసగా నాలుగు మ్యాచ్‌ల్లో ఓటమిపాలైంది. చివరి మ్యాచ్‌లో గెలుపొంది రెండో విజయం ఖాతాలో వేసుకుంది. నాలుగు పాయింట్లో ఏడోస్థానంలో ఉంది. చెన్నై సూపర్ కింగ్స్ జట్టు ఈ సీజన్‌లో కూడా ఆశించిన స్థాయిలో రాణించడం లేదు. ఆరు మ్యాచ్‌లు ఆడగా.. కేవలం రెండు విజయాలతో 8వ స్థానంలో ఉంది. ఇక లక్నో సూపర్ జెయింట్స్ పర్ఫామెన్స్ మరీ తీసికట్టుగా ఉంది. ఏడు మ్యాచ్‌ల్లో రెండు విజయాలతో కింది నుంచి రెండోస్థానంలో ఉంది. కోల్‌కతా నైట్ రైడర్స్ మాత్రం ప్లే ఆఫ్ రేసు నుంచి అన్ని జట్ల కంటే బాగా వెనుకపడిపోయింది. ఏడు మ్యాచ్‌ల్లో ఒకే విజయం సాధించింది. ఒక మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. మూడు పాయింట్లతో చివరిస్థానంలో ఉంది. మిగిలిన 7 మ్యాచ్‌ల్లో కనీసం ఆరు మ్యాచ్‌లు గెలిస్తే ప్లే ఆఫ్ రేసులో ఉంటుంది. ఇప్పటివరకు ఈ సీజన్‌లో అత్యధిక పరుగులతో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓపెనర్ అభిషేక్ శర్మ టాప్‌లో ఉన్నాడు. 7 మ్యాచ్‌ల్లో 323 పరుగులతో ఆరెంజ్ క్యాప్ హోల్డర్‌గా ఉన్నాడు. హెన్రిచ్ క్లాసెన్ (283), శుభ్‌మన్ గిల్ (265) రెండు, మూడు స్థానాల్లో ఉన్నారు. లక్నో బౌలర్ ప్రిన్స్ యాదవ్ 13 వికెట్లతో పర్పుల్ హోల్డర్‌గా ఉన్నాడు. ఆ తరువాతి స్థానాల్లో అన్షుల్ కాంబోజ్ (13), ఈషాన్ మలింగ (12) ఉన్నారు.

## ఈ అవార్డు గుజరాత్ మంత్రికి అంకితమిస్తున్నా- రవీంద్ర జడేజా

లఖ్?నవూ సూపర్ జెయింట్స్?తో జరిగిన లో స్కోరింగ్ మ్యాచ్?లో రాజస్థాన్ రాయల్స్ భళా అనిపించింది. బ్యాటుతో తడబడ్డా బంతితో రాణించిన రాజస్థాన్ 40 పరుగుల తేడాతో విజయం సాధించింది. సీనియర్ ప్లేయర్ రవీంద్ర జడేజా ఆర్?రౌండ్ ప్రదర్శనతో రాణించి జట్టు గెలుపులో కీలక పాత్ర పోషించాడు. దీంతో అతడికి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. అయితే ఈ అవార్డును అతడు 'గుజరాత్ విద్యాశాఖ మంత్రి'కి అంకింతం ఇచ్చాడు. మ్యాచ్ అనంతరం అవార్డ్? ప్రజెంటేషన్?లో జడేజా కీలక వ్యాఖ్యలు చేశాడు. జట్టు విజయంలో కీలకంగా మారినందుకు సంతోషంగా ఉందని చెప్పాడు. 'మ్యాచ్ గెలిపించినందుకు హ్యాపీగా ఉంది. అయితే అవార్డును నేను గుజరాత్ రాష్ట్ర విద్యాశాఖ మంత్రికి డెడికేట్ చేస్తున్నా. ఎందుకంటే నేను ఇవాళ అద్భుతమైన ప్రదర్శన చేస్తానని ఆమె నిన్ననే నాతో చెప్పింది. ఆమెకు థాంక్స్?' అని జడ్డూ పేర్కొన్నాడు. కాగా, ఆ మంత్రి ఎవరో కాదు జడేజా సతీమణి రివాబా జడేజానే!సుదీర్ఘ ఐపీఎల్? కెరీర్?లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకోవడం జడేజాకు ఇది 17వసారి. అలాగే చెన్నై సూపర్ కింగ్స్ తరపున కాకుండా ఇతర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూ ఈ అవార్డు దక్కించుకోవడం మాత్రం ఇదే తొలిసారి. సీఎస్కేకు కాకుండా జడేజా ఇతర ఆయా జట్ల (రాజస్థాన్, కొచ్చి టస్కర్స్ కేరళ, గుజరాత్ లయన్స్)కు 75 మ్యాచ్?ల్లో ప్రాతినిధ్యం వహించాడు. ఇక చెన్నై తరపున 186 మ్యాచ్?ల్లో బరిలోకి దిగగా అందులో 16 సార్లు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. లఖ్?నవూతో మ్యాచ్?లో పిచ్ బ్యాటింగ్?కు? అంతగా సహకరించలేదు. టాపార్డర్ విఫలమైన వేళ జడేజా కీలక ఇన్నింగ్స్ ఆడాడు. క్రీజులో నిలబడి స్కోర్ బోర్డును నడిపించాడు. 29 బంతులు ఆడిన జడ్డూ 43 పరుగులు చేసి నాటౌట్?గా నిలిచాడు. ఇందులో 2 ఫోర్లు, 1 సిక్స్? ఉన్నాయి. అనంతరం బౌలింగ్?లోనూ రాణించాడు. నాలుగు ఓవర్లో కోటాలో 29 పరుగులిచ్చి 1 వికెట్ దక్కించుకున్నాడు. అదీనూ నికోలస్ పూరన్ వికెట్ కావడం విశేషం. ఇక మ్యాచ్ విషయానికొస్తే, రాజస్థాన్ నిర్దేశించిన 160 లక్ష్య ఛేదనలో లఖ్?నవూ తేలిపోయింది. మిచెల్ మార్ష్ (57) మినహా మిగతా బ్యాటర్లంతా చేతులెత్తేశారు. 18 ఓవర్లలో లఖ్?నవూ 119 పరుగులకు కుప్పకూలిపోయింది. దీంతో రాజస్థాన్ 40 పరుగుల తేడాతో విజయం సాధించింది. రాజస్థాన్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్ 3, నాండ్రె బర్గర్, బ్రిజేష్ శర్మ చెరో 2, రవీంద్ర జడేజా, రవి బిష్ణోయ్ ఒక్కో వికెట్ దక్కించుకున్నారు. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో జడేజా భార్య రివాబా జడేజా నార్త్ జామ్?నగర్? స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా గెలుపొందారు. అయితే గతేడాది గుజరాత్ మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఆమెను మంత్రి పదవి వరించింది. ప్రస్తుతం ఆమె ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ కేబినెట్?లో విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.లఖ్?నవూ స్పీడ్ గన్ మయంక్ యాదవ్ ఈ మ్యాచ్?తో ఐపీఎల్?లో ఎంట్రీ ఇచ్చాడు. అయితే అతడికి ఆశించిన రేంజ్?లో కమ్?బ్యాక్ రాలేదు. 140ం వేగంతో బంతులేసినా ధారాళంగా పరుగులు ఇచ్చాడు.





## 2028 ఒలింపిక్స్‌లో అధికారికంగా క్రికెట్

ప్రపంచంలో రెండో అత్యంత ప్రజాదరణ పొందిన క్రీడ అయినప్పటికీ, ఒలింపిక్ వేదికపై కనిపించి దశాబ్దాలు దాటిపోయింది. చివరిసారిగా 1900 పారిస్ ఒలింపిక్స్‌లో క్రికెట్ మ్యాచ్‌లు జరిగాయి. సరిగా 128 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్ క్రీడల్లో మళ్లీ మెరవబోతోంది. 2023 అక్టోబర్‌లో ముంబైలో జరిగిన అంతర్జాతీయ ఒలింపిక్స్ కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. లాస్ ఏంజిల్స్ 2028 నిర్వాహకులు క్రికెట్ పోటీల కోసం దక్షిణ కాలిఫోర్నియాలోని పామోనాలో ఉన్న ఫెయిర్ గ్రౌండ్స్‌ను వేదికగా ఎంపిక చేశారు. ఈ చారిత్రక మైదానంలో బుధవారం నాడు స్టేడియం నిర్మాణ పనులకు శంకుస్థాపన జరిగింది. ఈ స్టేడియం సుమారు పదివేల కంటే ఎక్కువ మంది ప్రేక్షకులు కూర్చునే సామర్థ్యంతో నిర్మించబోతున్నారు. అంతర్జాతీయ ప్రామాణాలతో కూడిన ఈ ప్రీమియర్ క్రికెట్ స్టేడియం పురుషుల, మహిళల పోటీలకు ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ నిర్మాణ పనుల ప్రారంభాన్ని అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ఒక మైలురాయిగా అభివర్ణించింది. ఒలింపిక్ చరిత్రలో తొలిసారిగా ఒక క్రీడ మ్యాచ్ సమయాలను భారతీయ ప్రామాణిక సమయానికి అనుగుణంగా రూపొందించడం విశేషం. భారత ఉపఖండంలోని వంద కోట్లకు పైగా ఉన్న క్రికెట్ అభిమానులను ఆకర్షించేందుకు నిర్వాహకులు ఈ నిర్ణయం తీసుకున్నారు. లాస్ ఏంజిల్స్ స్థానిక కాలమానం ప్రకారం మ్యాచ్‌లు ఉదయం 9 గంటలకు, సాయంత్రం ఆరున్నర గంటలకు ప్రారంభమవుతాయి. ఇది భారత కాలమాన ప్రకారం వరుసగా రాత్రి 9.30 గంటలకు, ఉదయం 7 గంటలకు అవుతుంది. ఈ సమయాలు భారత టీవీ ప్రేక్షకులకు, డిజిటల్ వీక్షకులకు అత్యంత అనుకూలమైనవి. సాధారణంగా ఒలింపిక్స్ క్రీడల్లో కాంస్య పతక పోరు ముగిసిన తర్వాతే స్వర్ణ పతక పోరు జరుగుతుంది. కానీ క్రికెట్ విషయంలో ఈ సంప్రదాయాన్ని పక్కన పెట్టి, స్వర్ణ పతక మ్యాచ్‌ను ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య నిర్వహించాలని నిర్ణయించారు. ఇది భారత్ ప్రైమ్‌కు సరిగా సరిపోతుంది. భారత జట్టు ఫైనల్‌కు చేరుకుంటుందని నమ్మకంతోనే వీక్షకుల సంఖ్యను పెంచుకోవడానికి నిర్వాహకులు ఈ మార్పులు చేసినట్టు తెలుస్తోంది. లా28 ఒలింపిక్స్‌లో క్రికెట్ అత్యంత వేగవంతమైన టీ 20 ఫార్మాట్‌లో నిర్వహిస్తారు. పురుషుల, మహిళల విభాగాల్లో చెరో ఆరు జట్లు ఈ మెగా ఈవెంట్‌లో పాల్గొంటాయి క్రికెట్ ఒలింపిక్స్లో చేర్చడం ద్వారా కొత్త దేశాలకు ఈ క్రీడను విస్తరించవచ్చని ఐసీసీ భావిస్తోంది. ఇప్పటికే ఆసియా క్రీడలు, కామన్వెల్త్ క్రీడల్లో టీ20 ఫార్మాట్ విజయవంతమైంది. ఐసీసీ ఛైర్మన్ జైషా ఈ పరిణామాలపై సంతోషం వ్యక్తం చేశారు. వేదికల ప్రకటన అనేది ఒలింపిక్స్‌లో క్రికెట్ పునరాగమనానికి పడిన తొలి అడుగు అని ఆయన పేర్కొన్నారు. ఐసీసీతో కలిసి క్రికెట్‌ను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఒలింపిక్ ఉద్యమంలో భాగం కావడం వల్ల క్రికెట్‌కు వివిధ దేశాల ప్రభుత్వాల నుంచి మరింత నిధులు , మద్దతు లభిస్తుందని ఐసీసీ పేర్కొంది. అమెరికా క్రీడా అభిమానులు హోమ్ రన్‌లు, లాంగ్ బాల్స్‌ను ఇష్టపడతారని, క్రికెట్‌లో ఇవి పుష్కలంగా ఉంటాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఒలింపిక్స్ ద్వారా అమెరికన్లకు క్రికెట్ పట్ల ఆసక్తి పెరుగుతుందని నిర్వాహకులు భావిస్తున్నారు. లా28లో క్రికెట్‌తోపాటు బేస్ బాల్/ సాఫ్ట్ బాల్, ఫ్లాగ్ ఫుట్‌బాల్, లాక్రోస్, స్క్వాష్ వంటి క్రీడలు కూడా కొత్తగా చేరాయి. భారత్ , ఉపఖండం కోసం మీడియా హక్కుల విక్రయం విషయంలో నిర్వాహకులు మూడు రకాల ప్యాకేజీలు సిద్ధం చేశారు. మల్టీప్లాట్‌ఫామ్, టీవీ ఓన్లీ, డిజిటల్ ఓన్లీ. దీని ద్వారా భారీ ఆదాయం సమకూరుతుందని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు.

## మూడో టీ20లోనూ భారత మహిళల జట్టు వరుసగా ఓటమి

సౌతాఫ్రికా పర్యటనలో భారత మహిళల జట్టు వరుసగా మూడో టీ20లోనూ ఓటమిపాలైంది. జొహెన్నస్?బర్గ్ వేదికగా ఆతిథ్య సౌతాఫ్రికాతో తాజాగా జరిగిన మూడో మ్యాచ్?లో భారత్ 9 వికెట్ల తేడాతో ఓడిపోయింది. టీమ్ఇండియా నిర్దేశించిన 193 పరుగుల భారీ టార్గెట్?ను సఫారీ జట్టు కేవలం 1 వికెటే కోల్పోయి 16.3 ఓవర్లలోనే ఛేధించడం విశేషం. కెప్టెన్ లారా వోల్వార్ట్ (115 పరుగులు, 53 బంతుల్లో) సూపర్ సెంచరీతో అదరగొట్టగా, సున్ లస్ (64లి పరుగులు) హాఫ్ సెంచరీతో రాణించింది. దీంతో సౌతాఫ్రికా ఘన విజయం సాధించింది. భారత్ బౌలర్లలో శ్రేయాంక పాటిల్ మాత్రమే వికెట్ తీయగలిగింది. అంతకుముందు బ్యాటింగ్ చేసిన టీమ్ఇండియా నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లకు 192 పరుగులు చేసింది. ఓపెనర్ షఫాలీ వర్మ (64 పరుగులు), కెప్టెన్ హర్మన్?ప్రీత్ కౌర్ (66 పరుగులు) హాఫ్ సెంచరీలతో మెరిశారు. స్మృతి మంధాన (37 పరుగులు) ఫర్వాలేదనిపించింది. సౌతాఫ్రికా బౌలర్లలో మ్లాబా 2, నదైన్ డి క్లర్క్ 1 వికెట్ దక్కించుకున్నారు. కాగా, తాజా విజయంతో ఐదు మ్యాచ్?ల టీ20 సిరీస్?ను సౌతాఫ్రికా 3-0తో దక్కించుకుంది. తొలి రెండు మ్యాచ్?ల్లోనూ టీమ్ఇండియా ఓడింది. ఇరుజట్ల మధ్య నామమాత్రపు నాలుగో టీ20 మ్యాచ్ ఏప్రిల్ 25న జరగాల్సి ఉంది. వాస్తవానికి ఈ పర్యటనలో భారత్ గత రెండు మ్యాచ్?ల్లో కంటే ఈసారి బ్యాటింగ్?లో మెరుగ్గా రాణించింది. సిరీస్? దక్కించుకోవాలంటే కచ్చితంగా నెగ్గాల్సిన మ్యాచ్?లో తొలుత బ్యాటింగ్?కు దిగింది. ఓపెనర్లు మంధాన- షఫాలీ మంచి ఆరంభం ఇచ్చారు. వన్?డౌన్?లో జెమీమా రోడ్రిగ్స్ (0) విఫలమైనా, కెప్టెన్ హర్మన్ చెలరేగింది. ఓపెనర్లు ఇచ్చిన శుభారంభాన్ని కొనసాగిస్తూ జోరును ప్రదర్శించింది. 173.68 స్ట్రైక్ రేట్?తో 66 రన్స్ చేసింది.



చివర్లో రిచా ఘోష్ (18లి) కూడా బాగా ఆడింది. దీంతో భారత్ భారీ స్కోర్ చేసింది. ఇంతటి స్కోర్ చేయడంతో టీమ్ఇండియా గెలుస్తుందని అనుకున్నారంతా. కానీ సౌతాఫ్రికా ఇన్నింగ్స్ ప్రారంభం అయ్యాక అంచనాలు తారుమారయ్యాయి. ఓపెనర్లు వోల్వార్ట్, లుస్ రెచ్చిపోయారు. ఆకాశమే హద్దుగా చెలరేగిపోయారు. ఈ క్రమంలోనే వోల్వార్ట్ సెంచరీ, లుస్ హాఫ్ సెంచరీలు సాధించారు. వీళ్ల విధ్వంసం సృష్టించడంతో చాలా ముందే భారత్ ఓటమి ఖరారైంది. 15.3 ఓవర్ వద్ద ఎట్టకేలకు భారత్ తొలి వికెట్ తీసింది. సెంచరీ సాధించిన వోల్వార్ట్?ను శ్రేయంక ఔట్ చేసింది. అప్పటికి సౌతాఫ్రికా స్కోర్ 183. ఈ ఏడాది జూన్?లో ఇంగ్లాండ్ వేదికగా మహిళల టీ20 వరల్డ్?కప్ జరగనుంది. గతేడాది వన్డే ప్రపంచకప్ నెగ్గిన ఉత్సాహంలో భారత్? ఈ టోర్నీలో అడుగుపెట్టనుంది. టైటిల్ ఫేవరెట్?గా దిగనున్న టీమ్ఇండియాకు ఆ టోర్నీ ముందు ఇలాంటి సిరీస్? ఆందోళన కలిగిస్తుంది. ఈ పర్యటనలో ఇప్పటిదాకా మూడు మ్యాచ్?లు ఆడగా, మూడింట్లోనూ భారత్ పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. ఇప్పుడు 193 పరుగుల భారీ లక్ష్యాన్ని సైతం కాపాడుకోలేదు. కనీసం గట్టి పోటీ కూడా ఇవ్వలేదు. దీంతో వరల్డ్?కప్ ముంగిట ఇలా అయితే ఎలా? అంటూ ఫ్యాన్స్ ఆందోళన చెందుతున్నారు!



## నేను ఎప్పుడూ మీకు మద్దతుగా ఉంటాను..

ఐపీఎల్ 2026లో భాగంగా ముంబై ఇండియన్స్ , చెన్నై సూపర్ కింగ్స్ జట్ల మధ్య జరిగే మ్యాచ్ అంటేనే అదొక ఎమోషన్. అయితే ఈ మ్యాచ్‌కు ముందు మైదానంలో ఆట కంటే కూడా గ్యాలరీలో ఒక ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. దీనికి కారణం చాహర్ బ్రదర్స్. దీపక్ చాహర్, రాహుల్ చాహర్ మధ్య జరగబోయే ఈ పోరుపై వారి సోదరి మాలతీ చాహర్ వేసిన పంచ్‌లు ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. సొంత తమ్ముళ్లనే ఆటపట్టిస్తూ ఆమె చేసిన పోస్ట్ నెటిజన్లను విపరీతంగా నవ్విస్తోంది. ఐపీఎల్ 2026లో దీపక్ చాహర్ ముంబై ఇండియన్స్ జట్టులో ఉండగా, రాహుల్ చాహర్ చెన్నై సూపర్ కింగ్స్ జట్టులో ఉన్నాడు. వాస్తవానికి దీపక్ గతంలో చెన్నైకి ఆడితే, రాహుల్ ముంబైకి ఆడేవాడు. ఇప్పుడు సీన్ రివర్స్ అయ్యింది. అయితే వీరిద్దరి కంటే ముందుగా వీరి సోదరి మాలతీ చాహర్ లైమ్ లైట్ లోకి వచ్చారు. తన ఇద్దరు తమ్ముళ్లతో కలిసి ఉన్న ఫోటోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తూ.. "నేను ఎప్పుడూ మీకు మద్దతుగా ఉంటాను.. ఒకవేళ మీరు మైదానంలో కాకుండా డ్రెస్సింగ్ రూమ్ పక్కన బెంచీ మీద కూర్చున్నా సరే నా సపోర్ట్ మీకే" అంటూ సెటైర్ వేశారు. మాలతీ చాహర్ ఇలా అనడానికి ఒక బలమైన కారణం ఉంది. ఈ సీజన్‌లో వీరిద్దరికీ ప్లేయింగ్ ఎలెవన్‌లో ఆడే అవకాశాలు చాలా తక్కువగా వస్తున్నాయి. రాహుల్ చాహర్ చెన్నై తరపున ఇప్పటివరకు కేవలం ఒక్క మ్యాచ్ మాత్రమే ఆడాడు. ఆ మ్యాచ్‌లో కూడా 4 ఓవర్లలో 46 పరుగులు ఇచ్చి వికెట్ ఏమీ తీయలేదు. ఇక ముంబై తరపున ఆడుతున్న దీపక్ చాహర్ మూడు మ్యాచ్‌లు ఆడి కేవలం ఒకే వికెట్ తీశాడు. బ్యాటింగ్‌లో కూడా కేవలం 6 పరుగులే చేశాడు. అందుకే మీరు ఆడినా ఆడకపోయినా బెంచీ మీదున్నా మీకు నేను తోడుంటాను అని అక్క ఆటపట్టించింది. ముంబై వర్సెస్ చెన్నై మ్యాచ్‌కు ముందు ప్రాక్టీస్ సెషన్‌లో ఒక భావోద్వేగ దృశ్యం కనిపించింది. దీపక్ చాహర్ తన మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ పాదాలను తాకి ఆశీర్వాదం తీసుకున్నారు. దీనికి సంబంధించిన వీడియోను చెన్నై సూపర్ కింగ్స్ తన సోషల్ మీడియాలో షేర్ చేసింది. ధోనీ అంటే దీపక్ చాహర్‌కు ఎంత గౌరవమో మరోసారి నిరూపితమైంది. అయితే ధోనీ ఆశీస్సులు ఉన్నా అక్క వేసిన పంచ్‌ల నుండి మాత్రం దీపక్ తప్పించుకోలేకపోయారు. మాలతీ చాహర్ చేసిన ఈ పోస్ట్‌పై నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. అక్క అంటే ఇలాగే ఉండాలి.. మరీ అంత నిజాలు చెప్పేయకూడదు అని కొందరు కామెంట్ చేస్తుంటే, చాహర్ ఫ్యామిలీలో నవ్వుల విందు మామూలుగా లేదు అని మరికొందరు అంటున్నారు. మొత్తానికి వాంఖడేలో మ్యాచ్ మొదలవ్వక ముందే చాహర్ ఫ్యామిలీ సోషల్ మీడియాలో భారీ సిక్సర్ కొట్టేసింది.

## నిజమే.. నాకు ఒళ్లంతా ఈగో ఉంది..

ఐపీఎల్ 2026 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడుతున్న స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా తనలోని కొత్త కోణాన్ని ఆవిష్కరించారు. బుధవారం లక్నో సూపర్ జెయింట్స్ పై రాజస్థాన్ విజయం సాధించిన తర్వాత జడేజా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు క్రికెట్ ప్రపంచంలో చర్చనీయాంశంగా మారాయి. తన వ్యక్తిగత రికార్డుల కంటే జట్టు ప్రయోజనాలే ముఖ్యమని చాటిచెప్పిన జడేజా, ఆట పట్ల తనకున్న నిబద్ధతను చాటుకున్నారు. ఐపీఎల్ 2026లో చెన్నైని వీడి రాజస్థాన్ రాయల్స్ లో చేరిన జడేజాకు కొన్ని మ్యాచ్‌ల్లో పూర్తి స్థాయిలో బౌలింగ్ చేసే అవకాశం రావడం లేదు. తన కోటాలో ఉన్న 4 ఓవర్లను పూర్తి చేయకముందే కెప్టెన్ బౌలింగ్ ఆపేస్తున్నా, జడేజా ఏమాత్రం అసహనానికి గురికావడం లేదు. దీనిపై స్పందిస్తూ.. "నేను మైదానంలోకి అడుగుపెట్టే ముందే నాకు ఉన్న ఈగోను హోటల్ గదిలోనే వదిలేసి వస్తాను. జట్టు నన్ను ఏ బాధ్యత కోరినా అది నెరవేర్చడమే నా లక్ష్యం. వ్యక్తిగత ప్రదర్శన కంటే టీమ్ గెలుపే ముఖ్యం" అని జియో హాట్‌స్టార్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. లక్నోతో జరిగిన మ్యాచ్‌లో జడేజా 29 బంతుల్లో 43 పరుగులు చేసి అజేయంగా నిలిచారు. చివరి వరకు క్రీజులో ఉండటం వల్లే రాజస్థాన్ 159 పరుగుల గౌరవప్రదమైన స్కోరు చేయగలిగింది. "నేను గనుక 17 లేదా 18వ ఓవర్లో అవుట్ అయి ఉంటే, మేము మరో 20-25 పరుగులు తక్కువ చేసేవాళ్లం. అప్పుడు లక్నోకు లక్ష్యం సులువయ్యేది. కానీ వికెట్ కండిషన్స్ అర్థం చేసుకుని నెమ్మదిగా బౌలింగ్ చేయడం మాకు కలిసొచ్చింది" అని జడేజా వివరించారు. ఈ మ్యాచ్‌లో ఆయన బ్యాటింగ్‌తో పాటు 4 ఓవర్లలో 29 పరుగులిచ్చి ఒక కీలక వికెట్ కూడా తీశారు.



## దానిమ్మ తొక్కే కదా అని పారేస్తున్నారా? ఈ బెనిఫిట్స్ తెలిస్తే వదిలిపెట్టరు!

దానిమ్మ గింజలు మాత్రమే కాదు దానిమ్మ తొక్కలు కూడా అనేక ఆరోగ్య ప్రయోజనాలను చేకూరుస్తాయి. చాలామంది దానిమ్మ గింజలు ఒలిచిన తర్వాత తొక్కలను పడేస్తూ ఉంటారు. అయితే దానిమ్మ గింజలలో, మాత్రమే కాదు తొక్కలలో ఉండే పోషకాలు మనకు బాగా ఉపయోగపడతాయి. దానిమ్మ తొక్కలలో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు, ఫైబర్ మరియు ఖనిజాలు ఉంటాయి.

దానిమ్మ తొక్కలతో చాలా బెనిఫిట్స్

దానిమ్మ తొక్కలను మన ఆహారంలో భాగంగా చేసుకుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. దానిమ్మ తొక్కలను ఎండబెట్టి పొడిలా చేసుకుని టీ చేసుకుని తాగవచ్చు. అంతేకాదు దానిమ్మ తొక్కల నుండి తీసిన సప్లిమెంట్లను కూడా మనం తీసుకోవచ్చు. దానిమ్మ తొక్కల పొడిని నీళ్లలో కలిపి పేస్టులా చేసి చర్మానికి, జుట్టుకి రాసుకుంటే కూడా మంచి ఫలితాలు ఉంటాయి. అసలు దానిమ్మ తొక్కలతో ఎటువంటి ఆరోగ్యప్రయోజనాలు కలుగుతాయి అనేది ప్రస్తుతం చూద్దాం. దానిమ్మ తొక్కలతో ఈ ఆరోగ్య ప్రయోజనాలు

దానిమ్మ తొక్కలతో జీర్ణక్రియ మెరుగుపడుతుంది. దానిమ్మ తొక్కల లోని ఫైబర్ మలబద్ధకం వంటి జీర్ణ సమస్యలను తగ్గిస్తుంది. పేగు కదలికలను క్రమబద్ధీకరిస్తుంది. దానిమ్మ తొక్కలు గుండె ఆరోగ్యానికి ఎంతగానో దోహదం చేస్తాయి. ఇవి రక్తపోటును తగ్గించడానికి, శరీరంలోని కొలెస్ట్రాల్ ను నియంత్రించడానికి బాగా పనిచేస్తాయి. దానిమ్మ తొక్కలో ఉండే యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు శరీరంలో మంటను తగ్గించడానికి కూడా దోహదం చేస్తాయి. దానిమ్మ తొక్కలతో అందం, ఆరోగ్యం

దానిమ్మ తొక్కలో ఉండే యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు నోట్లో బ్యాక్టీరియా పెరుగుదలను నియంత్రిస్తాయి. దంత సమస్యలను నివారిస్తాయి. దానిమ్మ తొక్కలు జుట్టు ఆరోగ్యానికి ఎంతో బాగా పనిచేస్తాయి. చుండ్రు నివారించడానికి, జుట్టు రాలకుండా ఉండడానికి పేస్టులా చేసుకుని తలకు పెట్టుకుంటే మంచిది. ఇక దానిమ్మ తొక్కలను టీ గా గాని, పొడిగా గాని చేసుకొని ఆహారంలో భాగంగా తీసుకోవడం చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుంది. దానిమ్మ తొక్కలు ఇలా తీసుకుంటేనే బెస్ట్.. చర్మం యవ్వనంగా కనిపించడానికి, ముడతలు రాకుండా, వృద్ధాప్య ఛాయలు లేకుండా ఉండడానికి దానిమ్మ తొక్కలు ఉపయోగపడతాయి. దానిమ్మ తొక్కలో క్యాన్సర్ ను నివారించే లక్షణాలు ఉన్నాయి. క్యాన్సర్ కణాల పెరుగుదలను ఇవి నిరోధిస్తాయి.ఇన్ని ప్రయోజనాలు ఉన్న దానిమ్మ తొక్కలను ఆహారంలో భాగంగా చేసుకుంటే మంచిది. కాకుంటే మన ఆహారంలో దేనిని భాగంగా చేసుకున్నప్పటికీ దానిని మితంగానే తీసుకోవాలి. అధికంగా తీసుకోవడం అనర్థాలకు కారణం అవుతుంది.

# బీటీబీ జ్యూస్‌తో అందం, ఆరోగ్యం



ఇప్పటివరకు అందరూ ఏబీసీ జ్యూస్ తాగుతున్నారు. యాపిల్, బీట్ రూట్, క్యారెట్ ను కలిపి ఏబీసీ జ్యూస్ అంటారు. దీనివల్ల ఆరోగ్యానికి చాలా మంచిదనే సంగతి తెలిసిందే. కానీ ఇప్పుడు అంరూ బీటీబీ జ్యూస్ తాగుతున్నారు. వైద్యులు, పోషకాహార నిపుణులు కూడా దీన్నే సూచిస్తున్నారు. జ్యూస్ అంటే బీట్‌రూట్, టమాటో, సొరకాయలతో కలిపి తయారుచేసే ఒక ఆరోగ్యకరమైన జ్యూస్. ఈ మూడు కూరగాయల మొదటి అక్షరాలను కలిపి "బీటీబీ " అనే పేరు వచ్చింది. ఇది ఇటీవల కాలంలో బరువు తగ్గడానికి, చర్మ సౌందర్యానికి, శరీరాన్ని డిటాక్స్ చేయడానికి ఒక ప్రసిద్ధ పానీయంగా మారింది. బీటీబీ  జ్యూస్ లోని పదార్థాలు బీట్‌రూట్.. నైట్రేట్లు: రక్తపోటును తగ్గించడంలో సహాయపడతాయి.. గుండె ఆరోగ్యానికి మంచివి. యాంటీ ఆక్సిడెంట్లు (బెటలైన్స్): కణాలను ఫ్రీ రాడికల్స్ నుండి రక్షించి, క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తాయి. ఇనుము, ఫోలేట్: రక్తహీనతను నివారిస్తాయి, హిమోగ్లోబిన్ స్థాయిలను పెంచుతాయి. సహజమైన శక్తిని అందిస్తుంది. %ూశ్రీంశీ =ఝు౧% "మినపప్పుతో బోలెడు ఆరోగ్య ప్రయోజనాలు.. బరువుకు చెక్, ఇంకా" టమాటో.. లైకోపీన్: ఒక శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్. ఇది చర్మాన్ని సూర్యరశ్మి నుండి రక్షించి గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుంది.

విటమిన్ సి ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది, చర్మ ఆరోగ్యానికి మంచిది. ఇందులో ఉండే పొటాషియం రక్తపోటు నియంత్రణకు సహాయపడుతుంది. సొరకాయ.. నీటి శాతం అధికం. శరీరానికి హైడ్రేషన్ అందిస్తుంది. ఫైబర్: జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది, మలబద్ధకాన్ని నివారిస్తుంది. కడుపు నిండిన భావనను కలిగించి బరువు తగ్గడంలో సహాయపడుతుంది. కేలరీలు తక్కువ: బరువు తగ్గించే ఆహారంలో ఇది ఒక మంచి ఎంపిక. విటమిన్ సి, జింక్: చర్మ ఆరోగ్యానికి, రోగనిరోధక శక్తికి మంచిది. "వారసత్వ భూముల విషయంలో ఏపీ సర్కారు తీపికబురు.. జ్యూస్ యొక్క ప్రయోజనాలు బరువు తగ్గడం: తక్కువ కేలరీలు, అధిక ఫైబర్ ఉండటం వల్ల ఆకలిని నియంత్రిస్తుంది. జీర్ణక్రియ మెరుగుదల: ఫైబర్ మరియు నీటి శాతం వల్ల మలబద్ధకం తగ్గి, జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. చర్మ ఆరోగ్యం: యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు చర్మానికి మెరుపునిచ్చి, మచ్చలను తగ్గిస్తాయి. శరీరాన్ని శుభ్రపరచడం: కాలేయం పనితీరుకు మద్దతు ఇస్తుంది.. విష పదార్థాలను తొలగించడంలో సహాయపడుతుంది. బీట్‌రూట్‌లోని నైట్రేట్లు రక్తపోటును తగ్గిస్తాయి. విటమిన్, యాంటీఆక్సిడెంట్లు రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తాయి. తయారు చేసుకొనేటప్పుడు చిన్న అల్లం ముక్క, నిమ్మరసం, చిటికెడు నల్ల ఉప్పుడు కలుపుకొని తాగితే చాలా మంచిది.

# గ్రీన్ టీ, లెమన్ టీ లలో బరువు తగ్గటానికి ఏది బెస్ట్?



లెమన్ టీ మరియు గ్రీన్ టీ రెండు మనకు ఆరోగ్య ప్రయోజనాన్ని చేకూరుస్తాయి. అయితే బరువు తగ్గడానికి లెమన్ టీ మరియు గ్రీన్ టీలలో ఏది బాగా ఎఫెక్టివ్ గా పనిచేస్తుంది అనేది చాలామందిలో ఉండే ప్రశ్న. లెమన్ టీ మరియు గ్రీన్ టీ రెండు టీలు ప్రత్యేక ప్రయోజనాలను అందిస్తాయి, కానీ ఏది మరింత ప్రభావవంతం అనే విషయాలు తెలుసుకోవాలంటే ఈ కథనాన్ని చదవండి. లెమన్ టీ ప్రయోజనాలు లెమన్ టీ చాలా ఆరోగ్య ప్రయోజనాలతో, మంచి రుచితో కూడుకున్నటువంటి పానీయం. ఇది విటమిన్‌ను కలిగి ఉంటుంది, ఇది రోగ నిరోధక వ్యవస్థను మెరుగుపరుస్తుంది. నిమ్మకాయలోని సిట్రస్ జీర్ణక్రియకు సహాయపడుతుంది . శరీరాన్ని డిటాక్సిఫై చేయడంలో లెమన్ టీ సహాయపడుతుంది. లెమన్ టీ మెటబాలిజాన్ని మెరుగుపరచగలదు, బరువు తగ్గడంలో ఇది ఎంతో బాగా దోహదం చేస్తుంది. గ్రీన్ టీ ప్రయోజనాలు గ్రీన్ టీ యాంటీఆక్సిడెంట్లతో, ముఖ్యంగా కటెకిన్లతో సమృద్ధిగా ఉంటుంది. గ్రీన్ టీ కూడా శరీరంలో చెడు కొవ్వును తగ్గించడానికి దోహదం చేస్తుంది. ఇది క్యాఫైన్‌ను కలిగి ఉంటుంది, ఇది శక్తి స్థాయిలను పెంచగలదు. గ్రీన్ టీ శరీరంలోని క్యాలరీలను బర్న్ చేయడానికి ఉపయోగపడుతుందని అధ్యయనాలు సూచిస్తున్నాయి. బరువు తగ్గాలని భావించే వారికి గ్రీన్ టీ కూడా ఒక మంచి ఎంపిక అని చెబుతారు. %ూశీషవతీవస దీఎ% రెండు టీలలో ఉన్న ప్రత్యేక లక్షణాలు ఇవే బరువు తగ్గడంలో సహాయం చేయగల లక్షణాలు లెమన్ టీ మరియు గ్రీన్ టీ రెండింటిలో ఉన్నాయి. గ్రీన్ టీ యొక్క యాంటీఆక్సిడెంట్లు మరియు క్యాఫైన్ కంటెంట్ మెటబాలిజాన్ని పెంచడంలో లెమన్ టీ కంటే కొద్దిగా ఎక్కువగా ఉపయోగపడవచ్చు. అయితే, లెమన్ టీ యొక్క డిటాక్సిఫైయింగ్ ప్రభావాలు ఆరోగ్యకరమైన ఆహారానికి అనుకూలంగా ఉండవచ్చు. రెండు వేటికవే ప్రత్యేకమైనవి. బరువు తగ్గడానికి రెండు కీలకంగానే ఉపయోగపడతాయి. %ూశ్రీంశీ =ఝు౧% వాడిన నూనెను మళ్ళీ వాడుతున్నారా? అయితే హాస్పిటల్ లో బెడ్ కన్ఫర్మ్! లెమన్ టీ, గ్రీన్ టీ లను ఇలా తీసుకున్నా గుడ్ రిజల్ట్స్ అయితే లెమన్ మరియు గ్రీన్ టీ మధ్య ఎంపిక వ్యక్తిగత అభిరుచులు మరియు ఆరోగ్య లక్ష్యాలపై ఆధారపడి ఉంటుంది. సమతుల ఆహారం మరియు క్రమమైన వ్యాయామంతో కలిపినప్పుడు రెండు టీలు బరువు తగ్గడాన్ని మద్దతు ఇస్తాయి. బరువు తగ్గాలని భావించే వారు మాత్రమే కాదు, ముఖ్యంగా ఉండాలనుకునే ప్రతి ఒక్కరు ఈ రెండు టీలను సేవించడం లో ఎటువంటి ఇబ్బంది లేదు. వ్యక్తిగత అభిరుచిని బట్టి ఈ రెండింటిలో ఒక దానిని ఎంపిక చేసుకోవచ్చు. రెండు కలిపి కూడా తీసుకోవచ్చు.

# మార్కెట్

## వేదాంత.. అప్పుల కుప్ప

### అమెరికా షార్ట్ సెల్లర్ వైస్రాయ్ రిసెర్చ్ ఆరోపణ


### ఖండించిన వేదాంత గ్రూప్

న్యూఢిల్లీ : బిలియనీర్ అనిల్ అగర్వాల్ నేతృత్వంలో బ్రిటన్ కేంద్రంగా నడుస్తున్న సంస్థ వేదాంత రిసోర్సెస్.. ఓ పరాన్న జీవి అని, దాని భారతీయ అనుబంధ సంస్థ వేదాంత లిమిటెడ్‌ను అది కొద్దికొద్దిగా నాశనం చేస్తుందని అమెరికా షార్ట్ సెల్లర్ వైస్రాయ్ రిసెర్చ్ బుధవారం తీవ్ర ఆరోపణలు చేసింది. దేశీయ గనుల రంగంలో కార్యకలాపాలు సాగిస్తున్న వేదాంత లిమిటెడ్‌కు మాతృ సంస్థగా ఉన్నటువంటి వేదాంత రిసోర్సెస్ రుణాలపై వైస్రాయ్ రిసెర్చ్ షార్ట్ పొజిషన్ తీసుకున్నది. ఈ క్రమంలోనే వేదాంత రిసోర్సెస్.. మితిమీరిన అప్పులు, దొంగ సొమ్ముపై నిర్మించినదని, దాని లెక్కలన్నీ తప్పుల తడకలేనంటూ వైస్రాయ్ రిసెర్చ్ విరుచుకుపడింది. అయితే ఇదంతా అసత్య ప్రచారమని, ఇందులో ఎంతమాత్రం నిజం లేదంటూ ఈ ఆరోపణల్ని వేదాంత గ్రూప్ ఖండించింది. కాగా, వేదాంత రిసోర్సెస్ లిమిటెడ్‌కు సొంతంగా చేయదగిన చెప్పుకోదగ్గ కార్యకలాపాలేవీ లేవని, భారత్‌లోని వేదాంత లిమిటెడ్‌పైనే ఆధారపడి నెట్టుకొస్తున్నదని వైస్రాయ్ రిసెర్చ్ అంటున్నది. ఈ క్రమంలోనే గత నాలుగు ఆర్థిక సంవత్సరాల్లో వేదాంత నుంచి రూ.75,800 కోట్లను, హిందుస్థాన్ జింక్ నుంచి రూ.57,300 కోట్ల డివిడెండ్ రూపంలో వేదాంత రిసోర్సెస్ తీసుకున్నదని చెప్పింది. అలాగే తీసుకున్న అప్పులకుగాను ఏటా వేదాంత రిసోర్సెస్ చెల్లించే వడ్డీలు 200 మిలియన్ డాలర్ల చొప్పున పెరుగుతూపోతున్నాయని, గతేడాది మొత్తం వడ్డీ చెల్లింపులు 835 మిలియన్ డాలర్లకు చేరాయన్నది.




## 100 ఏళ్లైనా.. ఏఐతో ఆ స్థానాలను భర్తీ చేయడం సాధ్యం కాదు : బిల్‌గేట్స్

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్.. ప్రస్తుతం ఎవరి నోట విన్నా ఇదే మాట. ఇప్పుడు ఇది సర్వాంతర్యామి అయిపోయింది. ఎలాంటి ప్రశ్నకైనా ఇట్టే సమాధానం ఇస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా అన్ని రంగాల్లోనూ ఏఐ విస్తరించింది. దీంతో ఏఐ వినియోగం భారీగా పెరిగిపోయింది. ఇది మంచి విషయమే అయినప్పటికీ.. ఏఐ కారణంగా ప్రపంచ వ్యాప్తంగా ఉద్యోగుల్లో అభద్రతా భావం పెరిగిపోయింది. చాలా కంపెనీలు తమ ఉద్యోగులకు లేఆఫ్‌లు ప్రకటించి.. వారి స్థానాల్లో ఏఐని వినియోగిస్తున్నారు. దీంతో ప్రపంచ వ్యాప్తంగా ఉద్యోగుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ఆందోళనల వేళ మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ కీలక వ్యాఖ్యలు చేశారు. వచ్చే 100 ఏళ్లైనా ప్రోగ్రామర్లను ఏఐ భర్తీ చేయలేదన్నారు. అంతేకాదు కోడింగ్ పైనా ఏఐ ప్రభావం ఉండదని చెప్పారు. ఓ ఇంటర్వ్యూలో బిల్‌గేట్స్ మాట్లాడుతూ.. 'కృత్రిమ మేధ అనేది ప్రోగ్రామింగ్ రంగంలో మనిషికి ప్రత్యామ్నాయం కాలేదు. కేవలం ఒక సహాయకారిగా మాత్రమే పనిచేస్తుంది. ప్రోగ్రామింగ్‌లో క్లిష్టమైన సమస్యగా భావించేదాన్ని క్రియేటీవ్‌గా పరిష్కరించాల్సి ఉంటుంది. ప్రోగ్రామింగ్‌లో అది సవాలుతో కూడుకున్న విషయం. మానవ మేధస్సు లేని యంత్రాలు (ఏఐ) అలా చేయలేవు' అని బిల్‌గేట్స్ వ్యాఖ్యానించారు. అదేవిధంగా కోడింగ్ అంటే కేవలం టైపింగ్ చేయడం కాదని.. చాలా లోతుగా ఆలోచించాల్సి ఉంటుందని బిల్‌గేట్స్ తెలిపారు. ఈ మేరకు భవిష్యత్తులో కోడింగ్, ఎనర్జీ మేనేజ్‌మెంట్, బయాలజీ రంగాలకు ఆటోమేషన్ ముప్పు తక్కువేనని ఆయన అంచనా వేశారు.




## మివీ ఏఐ ఇయర్‌బడ్స్

హైదరాబాద్ : రాష్ట్రానికి చెందిన ఎలక్ట్రానిక్స్ పరికరాల సంస్థ మివీ ..మార్కెట్లో ఏఐ ఆధారిత బడ్స్‌ను విడుదల చేసింది. ఫ్లిప్‌కార్ట్, కంపెనీ వెబ్‌సైట్లలో లభించే ఈ కొత్త ఉత్పత్తి ధర రూ.6,999గా నిర్ణయించింది. నాలుగు రంగులు గోల్డ్, బ్లాక్, సిల్వర్, బ్రొంజ్ మాడళ్లలో లభించనున్న ఈ పరికరం హైదరాబాద్‌లో ఉన్న ప్లాంట్లోనే తయా రు చేసినట్లు చెప్పారు. ఏఐ ఆధారంగా హిందీ, తెలుగు, తమిళం, బెంగాలీ, మరాఠి, కన్నడ, మలయాళం వంటి ఎనిమిది భాషల్లో ఈ పరికరం అనుసంధానంకానున్నది. ఒక్కసారి రీచార్జి చేస్తే 40 గంటలపాటు ఈ బ్యాటరీ లైఫ్ ఇవ్వనున్నది. బ్లూటూత్ 5.4 కనెక్టివిటీ, యూఎస్‌బీ టైప్-సీ చార్జర్, వాటర్-రెసిస్టెంట్ డిజైనింగ్ టెక్నాలజీతో తీర్చిదిద్దింది.



# ఆంధ్రప్రదేశ్

## అంగన్‌వాడీలకు వేసవి సెలవులు ఇవ్వాలి

### పెంచుతామన్న వేతనాలు అమలు చేయాలి

### విజయనగరంలో అంగన్‌వాడీల భారీ ర్యాలీ

విజయనగరం,ఏప్రిల్23 : ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స యూనియన్ ఆధ్వర్యంలో వేసవి సెలవులు మే నెల మొత్తం ఇవ్వాలని, ప్రభుత్వం పెంచుతామన్నా వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ గురువారం సాయంత్రం స్థానిక కోట జంక్షన్ నుంచి మూడు లాంతర్లు, మీదుగా గంట స్థంభం వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ని ఉద్దేశించి ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స యూనియన్ జిల్లా అధ్యక్షులు కె ప్రభావతి, సి ఐ టి యు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యు ఎస్ రవికుమార్ లు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే వేసవి సెలవులు నెలరోజులు ఇస్తామని, కనీస వేతనాలు అమలు చేస్తామని చెప్పిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చి 21 నెలలు కావస్తున్న అంగన్వాడి లు గురించి మాట్లాడకపోవడం దారుణమన్నారు. వేసవి తీవ్రత ఎక్కువగా ఉండటంతో పిల్లలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. మరో వైపు జీఓ5 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మినీ అంగన్వాడీ లను మెయిన్ అంగన్వాడీ కేంద్రాలుగా మారుస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత నెలలో రాష్ట్ర కేంద్రంలో అంగన్వాడీ లు ధర్నా చేస్తే పదిరోజుల్లో సమస్యలు పరిష్కారం చేస్తామని చెప్పిన పెద్దలు నెలరోజులు దాటిన ఇంతవరకు మా సమస్యలపై సమాధానం చెప్పలేదన్నారు. తక్షణమే అంగన్వాడీ లు కు కనీస వేతనాలు ప్రకటించి, వేసవి సెలవులు నెలరోజులు ప్రకటించాలని పెండింగ్ లో ఉన్న సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. నిరసన ర్యాలీలో సుశీల, రాధ, సి ఐ టి యు నాయకులు బి.రమణ, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

## నేటినుంచి వేసవి సెలవులు

### బస్టాండ్లలో పెరిగిన రద్దీ

గుంటూరు,ఏప్రిల్23 : ఆర్టీసీ బస్సులకు గురువారం ప్రయాణికుల రద్దీ పెరిగింది. పాఠశాలలకు 24వ తేదీ నుండి వేసవి సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు ఇళ్లకు వెళ్లడానికి ప్రయాణమయ్యారు. విద్యార్థులను తీసుకెళ్ళ టానికి వారి తల్లిదండ్రుల రాకతో రద్దీ పెరిగింది. గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ లో బస్సు సీట్ల కోసం ప్రజలు ఎగబడుతున్నారు. సరిపడా బస్సులు లేక గంటల తరబడి ఎదురు చూస్తున్నారు. సాధారణ రోజులలో ప్రయాణించే ప్రయాణికుల సంఖ్య కంటే గురువారం దాదాపు 50 శాతం పెరిగారని సమాచారం. వేసవిలో ఎండలు తీవ్రంగా ఉన్నప్పటికీ మిట్ట మధ్యాహ్న సమయంలో కూడా ఆర్టీసీలో రద్దీ ఉండటం గమనార్హం. శుక్రవారం కూడా రద్దీ ఉండే అవకాశం ఉంది. కాబట్టి ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా గుంటూరు నుండి వివిధ ప్రాంతాలకు అదనపు బస్సులు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## పెళ్లి చేసుకున్న ప్రేమ జంటపై దాడి

### ఇష్టం లేని పెళ్లి అంటూ తల్లిదండ్రుల ఆగ్రహం

ఏలూరు,ఏప్రిల్23 : ద్వారకాతిరుమల మండలం ఐఎస్ రాఘవాపురంలో ప్రేమ వివాహం చేసుకున్న జంటపై తల్లిదండ్రులు దాడికి పాల్పడటం తీవ్ర ఉద్రిక్తతకు దారి చేసింది. తమకు ఇష్టం లేకుండా పెళ్లి చేసుకున్న జంటపై దాడి చేసిన తల్లిదండ్రులు.. యువతిని బలవంతంగా తీసుకెళ్లారు. స్థానికంగా నివసిస్తున్న సంజిత్.. కామవరపుకోట మండలం వెంకటాపురానికి చెందిన పద్మ కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. వీరి వివాహానికి పద్మ తల్లిదండ్రులు అంగీకరించలేదు. దీంతో గత నెల 20న ఏలూరులోని అంబేద్కర్ నవ సమాజ్ సొసైటీలో ఇద్దరూ ప్రేమ వివాహం చేసుకున్నారు. వివాహం అనంతరం తమకు ప్రాణహాని ఉందని ఈ జంట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. గత రాత్రి సంజిత్ ఇంటి వద్దకు వచ్చిన పద్మ తల్లిదండ్రులు, వారి బంధువులు ఇనుప రాడ్లతో విచక్షణారహితంగా జంటపై దాడి చేశారు. ఆపై పద్మను బలవంతంగా తీసుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ద్వారకాతిరుమల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఐఎఎస్ అహ్మద్‌బాబుపై హైకోర్టు సీరియస్

### వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి ఆదేశం

### ఇన్నాళ్లూ ఎందుకు ఉపేక్షించారని సిఎస్‌కు ప్రశ్న

అమరావతి,ఏప్రిల్23 : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలోని సీనియర్ ఐఏఎస్ అధికారి అహ్మద్ బాబుపై ఏపీ హైకోర్టు నిప్పులు చెరిగింది. ఉద్యోగుల పట్ల రాగద్వేషాలతో వ్యవహరించే వ్యక్తి ఐఏఎస్ అధికారిగా కొనసాగడానికి వీల్లేదని ధర్మాసనం సంచలన వ్యాఖ్యలు చేసింది. చట్టం అన్నా, కోర్టు ఉత్తర్వులన్నా ఆయనకు గౌరవం లేదని న్యాయస్థానం మండిపడింది. బీపీసీ నిర్వహించి, అర్హులైన వారికి పదోన్నతులు కల్పించకుండా ఫైళ్లను తొక్కిపెడతారా? ఇది ఉద్యోగులను వేధించడం కాదా? వారి జీవితాలతో ఆటలాడుతారా? అంటూ ధర్మాసనం నిలదీసింది. అహ్మద్ బాబుపై ఇన్ని ఆరోపణలు వస్తున్నా ప్రభుత్వం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎందుకు మౌనంగా ఉన్నారని కోర్టు ప్రశ్నించింది. ఆయన్ను ఇంకా అదే పోస్టులో ఎందుకు కొనసాగిస్తున్నారని, ఇటువంటి వారిని తక్షణమే 'లూప్‌లైన్'లో వేయాలని సూచించింది. అహ్మద్ బాబుపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరతామని హైకోర్టు హెచ్చరించింది. ఒకవేళ ఆరోపణలు నిజమని ఆధారాలు ఉంటే, ఆయన్ను సర్వీసు నుంచి డిస్మిస్ చేయాలని కూడా ఆదేశిస్తామని స్పష్టం చేసింది. అహ్మద్ బాబు వ్యవహారంపై బాధితుడు/పిటిషనర్ ఇచ్చిన వినతిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇప్పటి వరకు తీసుకున్న చర్యలేమిటో తమ ముందు ఉంచాలని అడ్వకేట్ జనరల్‌ను కోర్టు ఆదేశించింది. ఒకవేళ మాకు అధికారం ఉంటే ఇప్పుడే అహ్మద్ బాబును సస్పెండ్ చేసేవాళ్లమని కోర్టు వ్యాఖ్యానించడం గమనార్హం. ఈ వ్యవహారంపై తదుపరి విచారణను హైకోర్టు నేటికి వాయిదా వేసింది. ఉన్నత స్థాయి అధికారిపై న్యాయస్థానం ఇంత కఠినంగా స్పందించడం ఇప్పుడు ఏపీ అధికార వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

## ఆర్టీసీ సమ్మెలో ఉద్రిక్తత

వరంగల్,ఏప్రిల్23 : ఆర్టీసీ డిమాండ్ల పరిష్కారంలో ప్రభుత్వం అవలంభిస్తున్న మొండి వైఖరికి నిరసనగా వరంగల్ జిల్లా నర్సంపేటలో ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యా యత్నానికి పాల్పడడం తీవ్ర సంచలనం కలిగించింది. రాష్ట్రవ్యాప్తంగా సమ్మెలో దిగిన ఆర్టీసీ కార్మికులు రెండోరోజు అన్ని ఆర్టీసీ డిపోల ఎదుట మహాధర్నాకు పిలుపునిచ్చాయి. ఇందులో భాగంగా గురువారం నర్సంపేట డిపో ఎదుట ధర్నాలో పాల్గొన్న డ్రైవర్ కోలా రమేశ్‌గౌడ్ ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. సహచర కార్మికులు వెంటనే అప్రమత్తమై మంటలను ఆర్పివేసి తీవ్రంగా గాయపడ్డ డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉండడంతో చికిత్స నిమిత్తం వరంగల్ ఆసుపత్రికి తరలించారు.

# కృష్ణానదిపై ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం

### బ్లూ. గ్రీన్‌లివబుల్ సిటీగా నూతన రాజధాని

### నూతన ప్రాజెక్టులు, ఐకానిక్ వంతెన, విద్యాసంస్థలకు ఆమోదం

### బిట్స్ లాంటి సంస్థ ఏర్పాటు కావడం హర్షణీయం

### సిఆర్‌డిఏ సమావేశంలో సిఎం చంద్రబాబు నాయుడు



అమరావతి,ఏప్రిల్23 : రాజధానిని అనుసంధానిస్తూ కృష్ణానదిపై నిర్మించే వంతెన ఐకానిక్‌గా ఉండాలని, బ్లూ. గ్రీన్‌లివబుల్ సిటీగా నూతన రాజధానిని నిర్మిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. గురువారం సాయంత్రం ముఖ్యమంత్రి అధ్యక్షతన సిఆర్‌డిఏ అథారిటీ సమావేశం జరిగింది. దీనిలో నూతన ప్రాజెక్టులు, ఐకానిక్ వంతెన, విద్యాసంస్థల ఏర్పాటు వంటి అంశాలపై పలు ఆమోదాలు తెలిపారు. ఈ సమావేశానికి సిఆర్‌డిఏ, ఎడిఐసిఎల్, ఆర్థిక, అటవీశాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. పలు ప్రతిపాదనలపై చర్చించారు. బిట్స్‌పిలానీ లాంటి ప్రతిష్టాత్మక విద్య సంస్థల క్యాంపస్‌లతో అమరావతి నగరం కీలకమైన విద్యా కేంద్రంగా నిలుస్తుందని సిఎం తెలిపారు. ఎపిలో మళ్లీ పెట్టుబడులపై విశ్వాసం వచ్చిందని అభిప్రాయం వ్యక్తం చేశారు. రెన్యూ ఎనర్జీ లాంటి సంస్థలు ఇంగాట్ సోలార్ వేఫర్ ఉత్పత్తికి అనకాపల్లిలో యూనిట్ ఏర్పాటు చేస్తోందని సిఎం తెలిపారు. అలాగే రివర్‌ఫ్రంట్, ఎల్‌పిఎస్ లేఅవుట్ల నిర్మాణం, పనుల పురోగతిపైనా చర్చించారు. గతంలో భూములు పొందిన సంస్థలు పనులు వేగవంతంగా చేస్తున్నాయా లేదా వెంటనే పరిశీలించాలని సిఎం ఆదేశించారు. 2027 నుండి అమరావతి క్యాంపస్ అడ్మిషన్లు ప్రారంభిస్తామని బిట్స్ పిలానీ ప్రతినిధులు సిఎం చంద్రబాబునాయుడికి తెలిపారు. గురువారం వెలగపూడి సచివాయలంలో సిఎం వారు కలిశారు. రాజధాని ప్రాంతంలో నిర్మిస్తున్న క్యాంపస్ పురోగతిపై వివరించారు. అమరావతి క్యాంపస్ ఐకానిక్‌గా నిర్మిస్తున్నామని, క్వాంటం, ఎఐ విభాగాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. క్వాంటం టెక్నాలజీలో స్టార్టప్‌లను ప్రోత్సహించేలా ప్రణాళికలు చేయాలని వారికి సిఎం సూచించారు. క్యాంపస్ కోసం రూ.250 కోట్ల మేర వ్యయం చేస్తున్నామని, మూడుదశలుగా దీన్ని నిర్మిస్తున్నామని వివరించారు. మొత్తం పదివేలమంది చదువుకునేలా క్యాంపస్ ఉంటుందని పేర్కొన్నారు. సమావేశం సందర్భంగా రాజధాని నిర్మాణంలో వివిధ ప్రతిపాదనలపై చర్చ జరిగింది. హరిత, నీలి నగరంగా రాజధాని నిర్మాణం జరుగుతుందని సీఎం చంద్రబాబు అన్నారు. ఏపీపై మళ్లీ పెట్టుబడిదారులకు విశ్వాసం పెరిగిందని చెప్పారు. రాజధానిని అనుసంధానిస్తూ కృష్ణానదిపై.. ఐకానిక్‌గా బ్రిడ్జి నిర్మించాలని సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు.

## హిందూ దేవుళ్లపై వ్యాఖ్యలను సహించం

### చట్టపరమైన చర్యలకోసం పోరాడుతుంటాం

### టీటీడీ బోర్డు సభ్యుడు భాను ప్రకాశ్ రెడ్డి హెచ్చరిక

తిరుపతి,ఏప్రిల్23 : హిందూ దేవాలయాలు, సంప్రదాయాలపై అవమానకర వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని తిరుమల తిరుపతి దేవస్థానం టీటీడీ బోర్డు సభ్యుడు భాను ప్రకాశ్ రెడ్డి హెచ్చరించారు. సోషల్ మీడియా వేదికలపై హిందూ దేవుళ్లపై అవమానకర వ్యాఖ్యలు పెరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. ఈ అంశంలో న్యాయస్థానాలను ఆశ్రయించి భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 298 ప్రకారం కేసులు వేస్తామని భాను ప్రకాశ్ హెచ్చరించారు. ఇటీవల అలాంటి వ్యాఖ్యలు చేసిన సినీ నటుడు ప్రకాశ్ రాజ్‌పై రూ.100 కోట్ల పరువు నష్టం దావా వేసినట్లు భాను ప్రకాశ్ రెడ్డి గుర్తు చేశారు. సోషల్ మీడియా ద్వారా హిందూ దేవతలపై విమర్శలు చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు కొనసాగిస్తూనే ఉంటామని హెచ్చరించారు. కొంతమంది హిందూ ధర్మంపై విషం చిమ్ముతూ సోషల్ మీడియా ద్వారా డబ్బులు సంపాదిస్తున్నారని ఆగ్రహించారు. దేవాలయాలు సెక్యులర్ సంస్థలు కాదని.. అవి హిందూ ప్రార్థనా స్థలాలని ఆయన తేల్చి చెప్పారు. ఈ మేరకు దేవాలయాల్లో ఉద్యోగాలు, వ్యాపారాలు హిందువులకు మాత్రమే ఉండాలన్నారు. శ్రీశైలంలో అన్యమతస్తులు సగం జనాభా ఉన్నారన్నారు. దీనిపై దేశవ్యాప్తంగా చర్చ అవసరమని.. మేధావులు, రిటైర్డ్ న్యాయమూర్తులతో సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో దేవాలయాలపై దాడుల విషయంలో ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్డీఏ కూటమి హిందూ సంప్రదాయాల రక్షణకు కట్టుబడి ఉందని భాను ప్రకాశ్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

## అనంతలో హనీట్రాప్ ముఠా

### ఐదుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు

అనంతపురం,ఏప్రిల్23 : అనంతపురంలో గత కొంతకాలంగా ప్రముఖులే లక్ష్యంగా సాగుతున్న హనీట్రాప్ ముఠా వ్యవహారం బట్టబయలైంది. హనీ ట్రాప్ కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. ఈ కేసుకు సంబంధించి మొత్తం ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశారు. కింగ్ రంగమ్మ నాయుడు అలియాస్ చిన్ని నాయుడమ్మతో పాటూ దబ్బర రాజేష్, జయలక్ష్మి, మల్లేశ్వరి, అనంత కుమారిని అరెస్ట్ చేశారు. ఉదయ్ భాస్కర్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ ముఠా ఇప్పటివరకు పలువురిని హనీ ట్రాప్ చేసి లక్షల రూపాయలు వసూలు చేసినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. డీఎస్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ.. 'మల్లేశ్వరి, రంగమ్మ నాయుడు పథకం ప్రకారం అమాయకులను, బాగా డబ్బున్నవాళ్లకు వల వేసి ట్రాప్ చేసేవారు. ఆపై బెదిరింపులకు పాల్పడి లక్షలాది రూపాయలు వసూలు చేసేవారు. నిందితుల వద్ద నుంచి రూ.13 లక్షల నగదు, రెండు కత్తులు, అలాగే ప్రామిసరీ నోట్లు స్వాధీనం చేసుకున్నాం. అయితే, హనీ ట్రాప్‌కు గురైన బాధితులు కేసులు నమోదు చేయడానికి ముందుకు రావడం లేదు. ఎవరైనా ముందుకు వస్తే.. వారి పేర్లను గోప్యంగా ఉంచుతాం. ఈ కేసుకు రాజకీయ పార్టీలతో ఎలాంటి సంబంధం లేదు. కొందరు నాయకులతో నిందితులు ఫొటోలు దిగిన విషయాన్ని మాత్రమే ఆధారంగా చేసుకుని అపోహలు సృష్టించవద్దని అన్నారు.

## తమిళనాడులో పోలింగ్ ప్రారంభం

### ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

### ఓటేసిన సినీనటులు రజనీ, కమల్, అజిత్ తదితరులు

### ఓటేసిన చిదంబరం, స్టాలిన్ , ఉదయనిధి

చెన్నై,ఏప్రిల్23 : తమిళనాడు అసెంబ్లీ పోలింగ్ గురువారం ఉదయం ప్రారంభం అయ్యింది. ఓటర్లు ఓటేసేందుకు బారులు తీరారు. పలువురు ప్ముఖులు ముందుగానే వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా పలువురు హీరోలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సూపర్ స్టార్ రజనీకాంత్ చెన్నైలోని స్టెల్లా మారిస్ కాలేజీలో పోలింగ్ బూత్ నెంబర్ 237లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక మక్కల్ నీది మయ్యమ్ (ఎంఎన్ఎం) చీఫ్, ప్రముఖ నటుడు కమల్ హాసన్, ఆయన కుమార్తె శృతిహాసన్ ఆళ్వార్ పేట స్కూల్ కు చేరుకుని తమ ఓటు హక్కుని వినియోగించుకున్నారు. మరో ప్రముఖ నటుడు ఎస్. అజిత్ కుమార్ చెన్నైలోని తిరువాన్మియూర్ లో ఓటు వేశారు. కాగా, ప్రముఖ నటుడు ప్రభు, విక్రమ్ ప్రభు, శివకార్తికేయన్ లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 'ఓటు వేయడం అనేది భారత పౌరుల హక్కు. దయచేసి ఆ ఓటుహక్కును వినియోగించుకోండి' అని ఈ సందర్భంగా హీరో ప్రభు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. తమిళనాడులో మొత్తం 234 స్థానాల్లో ఓటింగ్ జరుగుతోంది. తొలి గంటల్లో పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 11 గంటల వరకు తమిళనాడులో 37.56 శాతం ఓటింగ్ నమోదైంది. శివగంగ ప్రాంతంలోని పోలింగ్ కేంద్రంలో కేంద్ర మాజీ మంత్రి పి. చిదంబరం ఓటేశారు. భాజపా నేత ఖుష్బూ, నటి త్రిష ఓటు హక్కు వినియోగించుకున్నారు. టీవీకే చీఫ్ విజయ్ చెన్నైలో ఓటేశారు. ఆయన తిరుచిరాపల్లి ఈస్ట్, పెరంబూర్ నుంచి పోటీలో ఉన్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, ఆయన భార్య దుర్గా స్టాలిన్, వారి కుమారుడు ఉదయనిధి స్టాలిన్ చెన్నైలో ఓటేశారు.

## రాహుల్‌తో పిసిసి చీఫ్ భేటీ

### రాష్ట్రంలో తాజా రాజకీయాలపై వివరణ

### పార్టీ సంస్థాగత నిర్మాణపైనా చర్చ

### నామినేటెడ్ పదవులు, బిసి కులగణనపై ప్రస్తావన

న్యూఢిల్లీ,ఏప్రిల్23 : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఢిల్లీలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను రాహుల్‌కు టీపీసీసీ చీఫ్ వివరించారు. అదేవిధంగా రాష్ట్రంలో తాజా రాజకీయ అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. కాంగ్రెస్ ఆర్గనైజేషన్ కార్యక్రమాలు, డీసీసీ అధ్యక్షుల నియామకాలు, జిల్లా కమిటీలు, మండల కమిటీల నియామకాలను రాహుల్‌కు వివరించారు. తెలంగాణలో కులగణన సమాచారాన్ని ప్రకటించినట్లు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. మహిళా రిజర్వేషన్లలో బీసీ రిజర్వేషన్లనూ జోడించాలని రాహుల్‌కు విజ్ఞప్తి చేశారు. రాబోయే ఏఐసీసీ జాతీయ ఓబీసీ సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించాలని కోరారు. ఈ విజ్ఞప్తులకు రాహుల్ గాంధీ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నేతృత్వంలోని రాష్ట్ర కాంగ్రెస్ ప్రతినిధి బృందం నేడు ఢిల్లీలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీని కలిసింది. ఈ బృందంలో రాజ్యసభ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, సీనియర్ నేత వి. హనుమంతరావు కూడా ఉన్నారు.

### అక్రమాస్తుల కేసులో ఎసిబి కోర్టు కీలక నిర్ణయం

### అసిస్టెంట్ కమిషనర్ శాంతికి రెండ్రోజుల కస్టడీ

విజయవాడ,ఏప్రిల్23(ఆర్ఎన్ఎ): ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఆంధ్రప్రదేశ్ దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ కాళింగిరి శాంతికి సంబంధించి విజయవాడ ఏసీబీ కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆమెను మరోసారి రెండు రోజుల పాటు ఏసీబీ కస్టడీకి అప్పగిస్తూ కోర్టు అనుమతినిచ్చింది.ప్రస్తుతం విజయవాడ జిల్లా జైలులో జ్యుడిషియల్ రిమాండ్‌లో ఉన్న శాంతిని, తదుపరి విచారణ నిమిత్తం తమ కస్టడీకి ఇవ్వాలని ఏసీబీ అధికారులు కోర్టును కోరారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం శుక్ర,శనివారాల్లో రెండు రోజుల పాటు శాంతిని ఏసీబీ కస్టడీకి తీసుకునేందుకు అనుమతించింది. ఆమె అక్రమంగా కూడబెట్టినట్లుగా భావిస్తున్న ఆస్తులు, బినామీ వ్యవహారాల గురించి అధికారులు ఆమెను లోతుగా ప్రశ్నించనున్నారు. ఈ నెల ప్రారంభంలో ఏసీబీ అధికారులు నిర్వహించిన సోదాల్లో శాంతికి సంబంధించి భారీగా అక్రమ ఆస్తులు వెలుగు చూశాయి. తాడేపల్లి, విశాఖపట్నం సహా పలు చోట్ల నిర్వహించిన సోదాల్లో సుమారు 770 గ్రాముల బంగారం, 3 కిలోల వెండి, ఒక భవనం, ఎ÷-లాట్లు, కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటికే ఆమె రిమాండ్‌ను మే 5వ తేదీ వరకు కోర్టు పొడిగించిన సంగతి తెలిసిందే. అక్రమాస్తుల కేసులో అరెస్ట్ అయిన నేపథ్యంలో, నిబంధనల ప్రకారం ప్రభుత్వం ఆమెను ఇప్పటికే విధుల నుంచి సస్పెండ్ చేసింది. 2020లో దేవాదాయ శాఖలో అసిస్టెంట్ కమిషనర్‌గా చేరిన శాంతి, గతంలో కూడా కొన్ని వివాదాల కారణంగా సస్పెన్షన్‌కు గురై, ఇటీవలే విధుల్లో చేరాల్సి ఉండగా ఈ కేసులో చిక్కుకున్నారు. ఏసీబీ అధికారులు ఈ రెండు రోజుల కస్టడీలో మరిన్ని కీలక ఆధారాలు సేకరించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## ఓటు వేయడం బాధ్యతగా గుర్తించండి

### తమిళనాడు, బెంగాల్ ఓటర్లకు మోడీ పిలుపు


న్యూఢిల్లీ,ఏప్రిల్23 : తమిళనాడు, పశ్చిమబెంగాల్‌లో పోలింగ్ సందర్భంగా.. ఓటర్లు తమ ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ముఖ్యంగా తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో జరుగుతున్న ఎన్నికల పోలింగ్ దృష్ట్యా, ఓటర్లు ఉత్సాహంగా తరలిరావాలని ఆయన కోరారు. ఓటు వేయడాన్ని కేవలం ఒక బాధ్యతగా మాత్రమే కాకుండా, దేశం పట్ల ఒక పవిత్ర కర్తవ్యంగా భావించాలని ప్రధాని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి ఓటు దేశ భవిష్యత్తును నిర్ణయించడంలో కీలక పాత్ర పోషిస్తుందని, కాబట్టి ఏ ఒక్కరూ ఓటింగ్‌కు దూరం కాకూడదని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల్లో యువత, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని మోదీ ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. మొదటిసారి ఓటు వేస్తున్న యువత నవ భారత నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. మహిళలు పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. గత రికార్డులను తిరగరాస్తూ, ఈసారి పోలింగ్ శాతం గణనీయంగా పెరగాలని ప్రధాని ఆకాంక్షించారు. ప్రజాస్వామ్య పండుగలో పౌరులందరూ చురుగ్గా పాల్గొని.. పారదర్శకమైన, పటిష్టమైన ప్రభుత్వాన్ని ఎన్నుకోవడంలో తమ వంతు సహకారం అందించాలని 'ఎక్స్' వేదికగా ఆయన సందేశాన్ని పంచుకున్నారు.

## అనంతబాబు కోవర్టుగా పోలీస్

### సిఐ రవికుమార్‌ను బదిలీ చేసిన ఏలూరు ఐజి

కాకినాడ,ఏప్రిల్23 : వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబుకు పోలీసుశాఖ రహస్య సమాచారం అందిస్తున్నారనే ఆరోపణలపై కాకినాడ జిల్లా సర్పవరం పీఎస్ ఇన్‌ఛార్జి సీఐ రవికుమార్‌పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. ఆయన్ను విధుల నుంచి తప్పించి.. వీఆర్‌కు పంపిస్తూ ఏలూరు రేంజ్ ఐజీ ఆదేశాలు జారీ చేశారు. దళిత యువకుడు, డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో అనంతబాబు ప్రధాన నిందితుడిగా ఉన్నారు. పోలీసుల దర్యాప్తునకు సంబంధించిన సమాచారం లీక్ చేశారని సీఐపై ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలోనే ఉన్నతాధికారులు ఆయనపై చర్యలు తీసుకున్నారు.







# రామాయణంలో రావణ, కుబేర యుద్ధం

భారీ స్థాయిలో చిత్రీకరిస్తున్న దర్శకుడు బాలీవుడ్ దర్శకుడు నితీష్ తివారీ దర్శకత్వంలో రణబీర్ కపూర్ హీరోగా రూపుదిద్దుకుంటున్న అత్యంత భారీ బ్జడెట్ చిత్రం 'రామాయణం' గురించి ఒక సంచలన వార్త ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. సాధారణంగా రామాయణం కథ అనగానే శ్రీరాముడి బాల్యం లేదా జననంతో మొదలవుతుందని మనందరికీ తెలుసు, కానీ ఈ చిత్రంలో దర్శకుడు నితీష్ తివారీ సరికొత్త ప్రయోగానికి శ్రీకారం చుడుతున్నట్లు తెలుస్తుంది. ఈ సినిమాలో రావణుడిగా నటిస్తున్న కన్నడ సూపర్ స్టార్ యష్ పవర్‌ఫుల్ ఎంట్రీతో, రావణ-కుబేర యుద్ధంతో ప్రారంభం కాబోతుందని తెలుస్తుంది. తన సోదరుడైన కుబేరుడిపై దాడి చేసి, స్వర్ణ లంకను మరియు పుష్పక విమానాన్ని రావణుడు స్వాధీనం చేసుకునే ఘట్టాన్ని అత్యంత భారీ స్థాయిలో వెండితెరపై చూపించబోతున్నట్లు సమాచారం. భారతీయ సినీ చరిత్రలోనే మునుపెన్నడూ లేని విధంగా సుమారు 4,000 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మితమవుతున్న ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది. ఇందులో రాముడిగా రణబీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, హనుమంతుడిగా సన్నీ డియోల్ నటిస్తున్నారు. ఇటీవల లాస్ ఏంజిల్స్‌లో జరిగిన ప్రత్యేక స్క్రీనింగ్‌లో ప్రదర్శించిన 20 నిమిషాల ఫుటేజీ చూసిన విశ్లేషకులు, ముఖ్యంగా లంకా నగరం మరియు రావణుడి యుద్ధ సన్నివేశాల్లోని ఘట్టాలు హాలీవుడ్ స్థాయిని మించి ఉన్నాయని ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. రావణుడి శక్తిని, ప్రతాపాన్ని చూపే ఈ విజువల్ స్పెక్టాకిల్ మొదటి భాగం 2026 దీపావళికి, రెండో భాగం 2027 దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానుంది.

# వరుస ఫ్లాప్‌లతో శ్రీలీల డిసప్పాయింట్

## హిట్‌లు లేకపోవడంతో కెరీర్‌లో ఒడిదుడుకులు

కన్నడ సినిమాలతో కెరీర్ ప్రారంభించి, టాలీవుడ్‌లో తక్కువ సమయంలోనే స్టార్ హీరోయిన్‌గా ఎదిగిన శ్రీలీల ప్రస్తుతం తన కెరీర్‌లో కీలక దశను ఎదుర్కొంటోంది. ప్రారంభంలో వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని టాప్ హీరోయిన్ రేసులోకి వచ్చిన ఆమె ఇప్పుడు మాత్రం వరుస ఫలితాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు కనిపిస్తోంది. దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు దర్శకత్వంలో వచ్చిన 'పెళ్లి సందడి' సినిమాతో శ్రీలీల టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోయినా? ఆమెకు మాత్రం మంచి గుర్తింపు వచ్చింది. మొదటి సినిమా ఎ÷-లాప్ అయినా కూడా, ఇండస్ట్రీలో ఆమెకు వరుస అవకాశాలు రావడం విశేషం. రవితేజ సరసన నటించిన 'ధమాకా' సినిమా బ్లాక్‌బస్టర్ కావడంతో శ్రీలీల కెరీర్ ఒక్కసారిగా టర్న్ అయింది. ఆ విజయంతో ఆమె టాలీవుడ్‌లో టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారింది. వరుసగా అరడజను సినిమాలు ఆమె చేతిలో పడగా, కొన్నింటి ఫలితాలు నిరాశపరిచాయి. గత కొన్ని సంవత్సరాలుగా శ్రీలీల వరుస సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ, పెద్ద హిట్ మాత్రం ఆమెకు దక్కలేదు. 'పుష్ప 2'లో చేసిన ప్రత్యేక డాన్స్ నంబర్‌తో ఇతర భాషల ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన ఆమెకు తమిళ, హిందీ ఇండస్ట్రీల్లో అవకాశాలు కూడా వచ్చాయి. తమిళంలో చేసిన 'పరాశక్తి' సినిమా బాక్సాఫీస్ వద్ద విఫలమైంది. దీంతో అక్కడ ఆమెకు ఆశించిన గుర్తింపు రాలేదు. ఇక హిందీలో అనురాగ్ బసు దర్శకత్వంలో చేస్తున్న సినిమా ఆలస్యం అవుతుండటం కూడా ఆందోళన కలిగిస్తోంది. ఆ ప్రాజెక్ట్ ఎప్పుడు పూర్తవుతుందో స్పష్టత లేకపోవడం గమనార్హం. ఇటీవల వచ్చిన 'ఉస్తాద్ భగత్ సింగ్'లో పవన్ కళ్యాణ్ సరసన నటించినా? సినిమాలో ఆమె పాత్రకు పెద్దగా గుర్తింపు రాలేదు. అదే సమయంలో గత ఏడాది వచ్చిన సినిమాలు కూడా కమర్షియల్‌గా పెద్ద విజయాలను అందుకోలేకపోయాయి. ప్రస్తుతం తెలుగులో పెద్దగా ప్రాజెక్టులు లేకపోవడంతో, శ్రీలీల తన భవిష్యత్తును బాలీవుడ్ సినిమాపైనే ఆధారపెట్టినట్టు కనిపిస్తోంది. ఇదిలా ఉండగా ధనుష్ హీరోగా తెరకెక్కుతున్న ఓ సినిమాలో ఆమెకు అవకాశం వచ్చిందనే వార్తలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై ఇంకా అధికారిక ప్రకటన లేదు. సినీ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, ఈ సంవత్సరం శ్రీలీల కెరీర్‌కు అత్యంత కీలకం. కనీసం ఒకటి రెండు హిట్స్ సాధిస్తేనే ఆమె మళ్లీ టాప్ రేసులోకి రావచ్చని అంటున్నారు.



# నేను నోరు తెరిస్తే అంతే సంగతులు

## గీతామాధురి యూట్యూబ్ ఇంటర్వ్యూ

తెలుగు సినీ సంగీత ప్రపంచంలో తన స్వరంతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న ప్రముఖ గాయని గీతా మాధురి మరోసారి వార్తల్లో నిలిచారు. పాటలతోనే కాదు, టీవీ షోలతో, సోషల్ మీడియాలో తన యాక్టివ్‌నెస్‌తో కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఆమె, తాజాగా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి. గీతామాధురి ఇటీవల ఓ యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కొన్ని ఆసక్తికర విషయాలు వెల్లడించారు. ఈ ఇంటర్వ్యూకి సంబంధించిన ప్రోమో విడుదల కాగా, అందులో ఆమె చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ప్రోమోలో గీతామాధురి మాట్లాడుతూ నేను ఎప్పుడో ఒక రోజు కాఫీ షాప్‌కి వెళ్తాను. ఆ రోజే ఏదో ఒక ప్రేమ జంట అక్కడికి వస్తుంది. నేను వెళ్లినప్పుడే ఎవరో ఒకరు దొరుకుతారు. ఇలా చాలా మంది నాకు కనిపించారు' అంటూ నవ్వుతూ చెప్పారు. అయితే ఈ విషయంపై ఆమె చేసిన మరో కామెంట్ సంచలనం సృష్టించింది.నేను చూసిన వాటి గురించి నోరు తెరిస్తే కాపురాలు కూలిపోతాయి అంటూ గీతామాధురి చెప్పడం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. గీతామాధురి చెప్పిన ఆ జంటలు ఎవరు? వారు టాలీవుడ్‌కు చెందినవారా? లేక ఆమె వ్యక్తిగత పరిచయాల్లో ఉన్నవారా? అనే విషయంపై నెటిజన్లు చర్చలు మొదలుపెట్టారు. అయితే ఈ అంశంపై పూర్తి వివరాలు తెలుసుకోవాలంటే పూర్తి ఎపిసోడ్ విడుదలయ్యే వరకు వేచి చూడాల్సిందే. ఇక గీతామాధురి కెరీర్ విషయానికి వస్తే? ఒకవైపు కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తూ, మరోవైపు పాటలు, టీవీ షోలతో బిజీగా గడుపుతున్నారు. నందు భార్యగా, ఇద్దరు పిల్లల తల్లిగా కుటుంబాన్ని చూసుకుంటూనే తన కెరీర్‌ను బ్యాలెన్స్ చేసుకుంటున్నారు.

# రాకా మూవీలో దీపికదే కీ రోల్

## ఆమె నటించదన్న వార్తలపై టీమ్ స్పందన

అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'రాకా'. భారీస్థాయిలో రూపొందుతోన్న ఈ సినిమాలో బన్నీకి జోడీగా బాలీవుడ్ నటి దీపికా పదుకొణె నటిస్తున్నారు. ఇటీవల ఆమె రెండోసారి తల్లి కానున్నట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో ఈ సినిమాపై రూమర్స్ మొదలయ్యాయి. షూటింగ్ ఆలస్యం అవుతుందని.. దీపిక స్థానంలో మరో నటిని తీసుకోనున్నారని వార్తలు వచ్చాయి. తాజాగా వాటిని 'రాకా' టీమ్ ఖండించింది. సినిమాలో దీపిక పాత్ర నిడివి తగ్గించారనే ప్రచారాన్ని కూడా కొట్టేసింది. సినిమాలో ఆమె పాత్ర కీలకమైనదని షూటింగ్ కూడా అనుకున్న షెడ్యూల్స్ ప్రకారమే సాగుతోందని స్పష్టం చేసింది. రూమర్స్‌ను షేర్ చేయొద్దని విజ్ఞప్తి చేసింది. సన్ పిక్చర్స్ నిర్మిస్తోన్న ఈ ఫాంటసీ ఎంటర్‌టైనర్‌లో దీపిక కొన్ని క్రేజీ యాక్షన్ సన్నివేశాల్లోనూ నటించనున్నట్లు తెలుస్తోంది. అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటూ ఆమె ఈ సీక్వెన్స్ చేస్తున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో ఆమెతో పాటు మరికొందరు హీరోయిన్‌లు కూడా నటించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. రష్మిక, జాన్వీకపూర్, మృణాల్ ఠాకూర్ పేర్లు కూడా వినిపిస్తున్నప్పటికీ, అధికారికంగా మాత్రం ఇంకా చిత్రబృందం వెల్లడించలేదు. ఇందులో ప్రధాన పాత్రల్లో ఎవరు అతిథి పాత్రల్లో ఎవరనే విషయంపై స్పష్టత రావడానికి మరింత సమయం పట్టే అవకాశాలు ఉన్నాయి. వచ్చే ఏడాది ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమాలోని లుక్ కోసం అల్లు అర్జున్ రోజూ 3, 4 గంటలు సమయం వెచ్చిస్తున్నారని సినీవర్గాలు చెప్పాయి.






# మెక్సికోలో వారణాసి సీన్స్ ప్రదర్శన

రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతోన్న చిత్రం 'వారణాసి'కోసం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీప్రియులు ఎదురుచూస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఒక వార్తను ఎస్ఎస్ కార్తికేయ పంచుకున్నారు. మెక్సికోలో జరగనున్న ఓ సినీ వేడుకలో ఈ చిత్రంలోని కొన్ని సన్నివేశాలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. మెక్సికో వేదికగా ఏప్రిల్ 24 నుంచి 26 వరకు జరగనున్న కామిక్ కాన్ ఎక్స్‌పీరియన్స్‌లో 'వారణాసి'కి సంబంధించిన ఎక్స్‌క్లూజివ్ కంటెంట్‌ను ప్రదర్శించనున్నారు. ఈ సినిమాకు సంబంధించిన మేకింగ్ వీడియోలు, బిహైండ్ ది సీన్స్‌తో పాటు కొన్ని కీలకమైన సన్నివేశాలతో కూడిన గ్లింప్స్‌ను ప్రేక్షకులకు చూపించనున్నారు. ఈ వేడుకకు కార్తికేయ హాజరు కానుండగా.. రాజమౌళి ప్రత్యేక వీడియో సందేశంతో అక్కడి అభిమానులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా ఐమ్యాక్స్ ఫార్మాట్‌లో విడుదల కానుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో భారీ షెడ్యూల్ జరుగుతోంది. అంతర్జాతీయస్థాయిలో భారతీయ సినిమా సత్తాను చాటేలా ఈ సినిమాను రాజమౌళి అత్యున్నత సాంకేతిక విలువలతో రూపొందిస్తున్నారు. మహేశ్‌కు జోడీగా ప్రియాంక చోప్రా నటిస్తున్నారు.








Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com